- కట్టుకోమన్నారు.. కాసులు ఇవ్వలేదు
- చర్చిల నిర్మాణానికి మూడేళ్ల కిందట మంజూరు ఉత్తర్వులు
- బిల్లులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు
- వైసీపీ పాలకుల మాటలు నమ్మి పాస్టర్ల అప్పులపాలు

నమ్మకంగా మోసం

గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటపు, అనవసర ప్రచారాలకు పోయి చేసిన అనేక తప్పిదాలతో పలువర్గాలు ఇబ్బందిపడ్డాయి. చివరకు చర్చి పాస్టర్లు సైతం వారి నిర్వాకంతో అప్పులపాలై అల్లాడుతున్నారు. 'క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మీకు నిధులు ఇస్తాం. చర్చిల నిర్మాణం చేసుకోండి. ప్రతి చర్చికి రూ.5లక్షల చొప్పున నిధులు ఇస్తున్నాం' అని వైసీపీ పాలకులు ఇచ్చిన మంజూరు పత్రాలు చూసి పాస్టర్లు అంతా మురిసిపోయారు. 'ప్రభుత్వం ఇచ్చే డబ్బులు కదా? ఎవరో కాంట్రాక్టర్లు మన ప్రార్థన మందిరాల విషయంలో ఎందుకు పనులు చేయాలి? మనమే కట్టుకుందాం' అనుకున్నారు. అప్పులు తెచ్చిమరీ మందిరాలను నిర్మించారు. బిల్లుల చేయాల్సిన సమయంలో వైసీపీ నేతలు చేతులెత్తేశారు. అధికారులను అడిగితే మీకు వచ్చింది మంజూరు ఉత్తర్వులే అంటూ తప్పించుకున్నారు. దీంతో పాస్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.


మర్రివేములలో నిర్మాణంలో ఉన్న చర్చి

ఉమ్మడి ప్రకాశంలో పెండింగ్ బిల్లుల జాబితా

అధికారుల వద్ద ఉన్న బిల్లుల జాబితా ప్రకారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జే.పంగులూరు మండలం కోటపాడు, పుల్లలచెరువు మండలంలో చాపలమడుగు, కొత్తూరు, అక్కపాలెం, గిద్దలూరు మండలంలో పెద్దనల్లకాలువ, ఓబులాపురం, ఎర్రగొండపాలెం మండల కేంద్రంలో రెండు, మార్టూరు మండలం నాగరాజుపల్లి తాండా, టంగుటూరు మండలం కారుమంచి, ముండ్లమూరు మండలం పసుపుగల్లు, కొమరోలు మండలం తాటిచర్ల మోటు, పామూరు మండలంలోని మోపాడులలోని చర్చిల బిల్లులు పెడింగులో ఉన్నాయి. మిగిలినవి కూడా నిర్మాణాలు జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో రికార్డులు సమర్పించని కారణంగా పెండింగ్‌లో ఉన్నాయి.

త్రిపురాంతకం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేతల మాటలు విని దేవునిసేవలో ఉండాల్సిన పాస్టర్లు చర్చి నిర్మాణం కోసం అప్పులు తెచ్చుకుని పనులు చేయించారు. చివరకు అధికారుల చుట్టూ తిరిగి ఎంబుక్‌లు రికార్డింగ్ చేయించారు. బిల్లులను జిల్లా అధికారులకు చేర్చారు. ఇంత పని మనమెలా చేసుకుంటామని ఇబ్బందిపడుతూనే ఎలాగోలా అన్ని రికార్డులు పూర్తి చేసుకున్న తరువాత చల్లని కబురు జిల్లా అధికారుల నోట వినిపించింది. మీకు మంజూరు ఉత్తర్వులు మాత్రమే వచ్చాయని ఇవ్వడానికి డబ్బులు లేవని చెప్పారు. మూడేళ్లుగా ఇదే మాటలతో ఇబ్బందులు పడుతున్నామని పాస్టర్లు చెప్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనగా అందులో ఎక్కువ భాగం చర్చిల నిర్మాణం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో జరిగింది.

మూడేళ్లుగా ఎదురుచూపులు

గత వైసీపీ హయాంలో జిల్లాలో పలు చర్చిల నిర్మాణం కోసం క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేశారు. ఒక్కో చర్చికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో మొత్తం దాదాపు 30 చర్చిలకు నిధులు మంజూరు చేస్తే అందులో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోనే 17 చర్చిలు ఉన్నాయి. వీటి నిర్మాణాలను స్వయంగా ఆయా చర్చిల పాస్టర్లే చేపట్టారు. వీటి పర్యవేక్షణ బాధ్యతలు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు. అయితే నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకున్న తరువాత ఎంబుక్‌లను కూడా అధికారులు రికార్డు చేశారు. కానీ నిధులు లేవంటూ వారికి బిల్లులు ఇవ్వకపోవడంతో మూడేళ్లుగా వాటికోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. పైగా ఆర్థికస్తోమత మిగతా 6లో...

క్రీడా శాఖలో కలవరం

- 'ఆడుదాం ఆంధ్ర'లో అవినీతిపై ఇంటెలిజెన్స్ ఆరా
- 'మీకోసం'కు డుమ్మాకొట్టిన డీఎస్‌డీవో



ఒంగోలు, కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): క్రీడాశాఖలో కలవరం మొదలైంది. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో అవినీతికి పాల్పడిన వ్యవహారంపై ఆంధ్రజ్యోతి సోమవారం ప్రచురించిన 'ఆట నాదే.. నోటు నాదే' కథనం అంతటా చర్చనీయాంశమైంది. క్రీడల నిర్వహణకు రూ.93లక్షల వరకు నిధులు కేటాయించగా గెలుపొందిన విజేతలకు ప్రైజ్ మనీ ఇవ్వకుండా సొంత ఖాతాకు జమ చేసుకున్న జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి అవినీతి బాగోతం క్రీడాశాఖలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఆటల్లో అవినీతిపై ఇంటెలిజెన్స్ విచారణ జరుగుతుండగా, సంబంధిత అధికారులను సైతం పక్కదారి పట్టించే విధంగా డీఎస్‌డీవో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు సోమవారం ప్రచురితమైన కథనంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎస్‌డీవో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)లో తనకు అండదండలు పుష్కలంగా అందిస్తున్న ఓ అధికారిణికి ఫోన్ చేసి తనను ఈ గండం నుంచి గట్టెక్కించాలని కోరినట్లు సమాచారం. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు హాజరవుతారు. అయితే సోమవారం డీఎస్‌డీవో రాలేదు. దీంతో అడుదాం ఆంధ్ర అవినీతిపై ఉన్నతాధికారులకు సమాధానం ఇవ్వాల్సి వస్తుందన్న కారణంతో గ్రీవెన్స్‌కు డుమ్మా కొట్టారని గుసగుసలు వినిపించాయి.

బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము మార్పు

మరోవైపు ఆటల పోటీలలో దోచేసిన డబ్బులు తన బ్యాంకు ఖాతాతోపాటు, మిగతా 6లో...

● స్పోర్ట్స్ కిట్లు పక్కదారి

సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపడం, క్రీడాకారులకు మంజూరు చేసిన కొన్ని స్పోర్ట్స్ కిట్‌లు కూడా పక్కదారి పట్టించినట్లు వెలుగులోకి వస్తున్నాయి. అయితే అవినీతి అధికారిగా గత కొన్నేళ్లుగా క్రీడా శాఖలో పేరుగాంచినా, నేటికీ చర్యలు లేకపోవడం పట్ల పలు క్రీడా సంఘాలు, క్రీడాకారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నాటి వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పెద్దల ఆశీస్సులతో ఇష్టారాజ్యంగా వ్యవహరించగా, ప్రజా ప్రభుత్వం వచ్చాక కూడా ఆమెదే పైచేయి కావడం విమర్శలకు తావిస్తోంది. గతంలోనూ స్టెప్ సీఈవోగా ఉన్న అధికారిని, పలు కోచ్‌లను సైతం కక్షసాధింపులు చేయడంతో ఆమె వద్ద పనిచేయలేమని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడిన అధికారిణిపై చర్యలు తీసుకొని దోపిడీకి గురైన సొమ్ము రికవరీ చేయాలని కోరుతున్నారు.

విజయాలు వివరిస్తూ.. సమస్యలు వింటూ..

- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో సాగుతున్న టీడీపీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలు
- జిల్లా అంతటా ఉత్సాహంగా కార్యక్రమం
- ఇంటింటి ప్రచారంలో ఒంగోలు ముందంజ

ఒంగోలు, జూలై 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ కీలక ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతల నుంచి క్షేత్రస్థాయిలోని బూతు కన్వీనర్ల వరకు ప్రజల వద్దకు వెళ్ళి ప్రభుత్వ విజయాలు, ఆయా వర్గాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తున్నారు.


ఒంగోలులో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల

అదేసమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు, వ్యక్తిగత సమస్యలను కూడా తెలుసుకుంటున్నారు. ఈ విషయాలకు ఆయా నియోజకవర్గాల్లో ప్రధాన బాధ్యతలుగా ఉండే శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జి లేదా ఆ స్థాయినేతలు అత్యంత ప్రాధాన్యత మిగతా 6లో...


కాలువపై ఏర్పాటు చేసుకున్న వ్యాపార సముదాయాలు

మేజర్‌కు అడ్డుగా కట్టడాలు

- నీటి విడుదలలో సమస్యలు
- ఖాళీ చేయాలని నోటీసులు

త్రిపురాంతకం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సాగరు నీరు ప్రవహించే మేజర్ కాలువకు అడ్డుగా వ్యాపార సముదాయాలు నిర్మించుకోవడంతో నీటి విడుదల సమయంలో ఏదైనా సమస్య వస్తే ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎన్నెస్పీ అధికారులు చెప్తున్నారు. త్రిపురాంతకంలోని మిరియంపల్లి మేజర్ కాలువ మధ్యలో రోడ్డు వెళుతుంది. ఈరోడ్డుకు ఇరువైపులా కాలువ చివరలో బంకులు, కొందరు వ్యాపార కట్టడాలను నిర్మించారు. ఇప్పటికీ పలుమార్లు చెప్పినా తొలగించడం లేదు. వీటివల్ల అధికారులకు ఇబ్బందులు లేవని వారు చెప్తుండగా, అది రికార్డు మిగతా 6లో...


సబ్‌స్టేషన్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు గొట్టిపాటి, స్వామి, ఎమ్మెల్యేలు డాక్టర్ ఉగ్ర, నారాయణరెడ్డి

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

కనిగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్టు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని గార్లపేట రోడ్డులో రూ.3.80 కోట్లతో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సోమవారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి విలేకరులతో మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా ఇప్పటికే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరు చేసినట్టు చెప్పారు. అదే సమయంలో మిగతా 6లో...

మెగా పీటీఎంలో విచిత్రాలెన్నో..

- అధికారుల పరిశీలనలో వెలుగులోకి..
- ఫొటోలు, వీడియోలు మళ్లీ అప్‌లోడ్

ఒంగోలు విద్య, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో ఈనెల 10న నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(పీటీఎం)లో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పీటీఎం వివరాలు అప్‌లోడ్‌లో అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. పాఠశాలల నుంచి లీప్ యాప్‌లో అప్‌లోడ్ అయిన వీడియోలు, ఫొటోలు లోపభూయిష్టంగా ఉండటంతో గత రెండు రోజులుగా విద్యాశాఖ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్ చేయడంలో తలమునకలై ఉన్నారు. రాష్ట్రస్థాయిలో కమిషన్ కార్యాలయంలో ఈ వీడియోలు, ఫొటోలు సరిచేసేందుకు జిల్లా నుంచి 15 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కుస్తీలు పడుతున్నారు. మెగా పీటీఎంకు సంబంధించి ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ ఎలా చేయాలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఈనెల మొదటి నుంచి మెగా పీటీఎంపై తీవ్ర కసరత్తు జరిగింది. పది రోజుల పాటు పిల్లలకు పాఠాలు చెప్పడం వదిలేసి పీటీఎం ఏర్పాటు, మొక్కల వివరాలు అప్‌లోడ్ ఇతర ఏర్పాట్లలో బీజీ అయ్యారు. ఇంత జరిగినా ఫొటోలు, వీడియోలు నాణ్యమైన వాటిని అప్‌లోడ్ చేయడంలో విఫలమయ్యారు.

ఫొటోలు, వీడియోల్లో చిత్ర విచిత్రాలు

మెగా పీటీఎంకు సంబంధించి పాఠశాలల నుంచి లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలు, ఫొటోల్లో చిత్రవిచిత్రాలు చోటు మిగతా 6లో...

ఎస్సీ విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయం

- సన్న బియ్యంతో భోజనంపై మంత్రి బాలవీరాంజనేయస్వామి ఆరా
- పొదిలిలో రూ.79లక్షలతో బాలురు, బాలికల వసతి గృహాలకు మరమ్మతులు

7

మెగా పీటీఎంలో విచిత్రాలెన్నో..

(5వ పేజీ తరువాయి)

చేసుకున్నాయి. 40 నిమిషాల వీడియోకు బదులు 30 నుంచి 40 సెకన్ల వీడియోలు అప్‌లోడ్ చేశారు. బాగా నాణ్యత గల ఫొటోలు మూడు అప్‌లోడ్ చేయాల్సి ఉండగా ఒకే ఫొటోను కొందరు మూడుసార్లు అప్‌లోడ్ చేసి మమ అనిపించారు. సాక్షి సంతకంతో మొబైల్ ఫోన్ల నుంచి పంపాల్సిన వివరాలు కొందరు హెచ్‌ఎంలే పంపారు. పాఠశాలకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథుల హాజరులో కూడా పొంతన లేని వివరాలు అప్‌లోడ్ చేశారు. రికార్డు చేసిన వీడియోలు అప్‌లోడ్ చేయాల్సి ఉండగా కొందరు లైవ్ వీడియోలు అప్‌లోడ్ చేశారు. ఈ తప్పులు సరిచేసి వీడియోలు, ఫొటోలు, నివేదికలు మళ్లీ పంపాలని ఆదేశించారు. సోమవారం జరిగిన వెబెక్స్‌లో ఆర్‌జేడీ, అదనపు డైరెక్టర్లు ఈ వివరాలు వెంటనే పంపించాలని ఆదేశించారు. కనిగిరి, సీఎస్‌పురం, మార్కాపురం మండలాలు వెనుకబడి ఉన్నాయని స్పీడప్ చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. సోమవారం రాత్రికి పని పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు.

క్రీడాశాఖలో కలవరం

(5వ పేజీ తరువాయి)

తన కుటుంబసభ్యుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా, ప్రస్తుతం ఆ బ్యాంకు ఖాతాలలో నగదును ఇతర ఖాతాలకు మార్చే ప్రయత్నాన్ని చేస్తున్నట్లు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి నాయకుల అండదండలతో అధికారిగా చేరిన ఆమె ప్రజా ప్రభుత్వం వచ్చాక కూడా అదే పంథాను కొనసాగించడం పట్ల క్రీడాశాఖలోని కొందరు ఉద్యోగులు తప్పుబడుతున్నారు. ప్రత్యేకించి, క్రీడల్లో జరుగుతున్న అవినీతిపై కొందరు ఉద్యోగులు ప్రశ్నించగా వారిపై కక్షసాధింపులకు పాల్పడటం, వారిని బదిలీ చేయడం, అవసరమైతే నోటికి పనిచెప్పడం సర్వసాధారణమైందని కొందరు వాపోతున్నారు. అవినీతిపై గత నెల రోజులుగా ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తుండగా, ఆధారాలు మాయం చేసే పనిలో ఉండటంతోపాటు, అప్పుడు జరిగిన తప్పిదానికి ఇప్పుడు అర్హులైన విజేతలకు ప్రైజ్ మనీ ఇస్తామని బేరసారాలు చేసినట్లు తెలిసింది.

మేజర్ కాలువకు అడ్డుగా కట్టడాలు

(5వ పేజీ తరువాయి)

పరంగా ఎన్నెస్పీ స్థలమని, పైగా సాగరు నీరు విడుదలైన తరువాత కాలువలో సమస్యలు వస్తే అక్కడ దిగి పని చేయడానికి ఇవి అడ్డు వస్తున్నాయని అధికారులు అంటున్నారు. ఈ కట్టడాలను ఖాళీ చేయించాలని, తమ భూమికి హద్దులు చూపాలని రెవెన్యూ అధికారులకు కూడా లేఖ రాశామని వారు చెప్తున్నారు. ఈ విషయమై డీఈ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నెస్పీ భూముల్లో అక్రమంగా కట్టడాలు నిర్మించుకున్న వారు ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారం కూడా తీసుకుంటామని, తాము చేసేది రైతుల మేలు కోసమేనని తెలుసుకుని సహకరించాలని కోరారు.

32 సొసైటీలకు కొత్త పాలక వర్గాలు



పీడీసీసీబీ ప్రధాన కార్యాలయం

ఒంగోలు విద్య, జూలై14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 32 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు(సొసైటీల) కొత్త పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పి .రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఉన్న అఫీషియల్ పీఐసీ స్థానంలో కొత్తగా నాన్ అఫీషియల్ పీఐసీలను నియమించారు. వాటి వివరాలు పక్క బాక్స్‌లో పొందుపరిచాం...

చీమకుర్తి సొసైటీకి అధ్యక్షుడుగా పూనాటి వెంకటరావు, సభ్యులుగా ఎ.బాలబ్రహ్మారెడ్డి, యానం వెంకటేశ్వర్లు
గుడిపూడివారిపాలెం సొసైటీ అధ్యక్షుడుగా కడియాల వెంకట్రావు, సభ్యులుగా ఉచ్చు రామారావు, వలేటి శ్రీరాములు
నందిపాడు సొసైటీ అధ్యక్షుడుగా యూ నాగేశ్వరరావు, సభ్యులుగా బోడపాటి సుబ్బారావు, తుమ్మల వీరాంజనేయులు,
పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడుగా మండవ హరిప్రసాదు, సభ్యులుగా నల్లూరి సంజీవరావు, సన్నపురెడ్డి రమేష్‌రెడ్డి,
అమ్మనబ్రోలు సొసైటీ అధ్యక్షుడుగా మారెళ్ల జనార్దనరావు, సభ్యులుగా డి.వెంకటశేషయ్య, కె.వెంకటేశ్వర్లు
తిమ్మసముద్రం సొసైటీ అధ్యక్షుడుగా మన్యం శివనాగేశ్వరరావు, సభ్యులుగా డి .కోటేశ్వరరావు, ఎం మురళి
ఓబ్నపాలెం సొసైటీ అధ్యక్షుడుగా మండవ ఆంజనేయులు, సభ్యులుగా ఈదర రాజా, భీమవరపు వెంకటేశ్వర్లు,
ఉప్పుగుండూరు సొసైటీ అధ్యక్షుడుగా కాట్రగడ్డ చంద్రబాబు, సభ్యులుగా ఎస్.భాస్కరరావు, పి.శ్రీనివాసరావు
బి.నిడమానూరు సొసైటీ అధ్యక్షుడుగా నలమలపు అంకిరెడ్డి, సభ్యులుగా ఎల్ శిరోమణి, ఎస్ వెంకటరావు
చదలవాడ సొసైటీ అధ్యక్షుడుగా కె.నాగరాజు, సభ్యులుగా జె. హరిబాబు, ఎస్ యల్లమంద
గుమ్మనంపాడు సొసైటీ అధ్యక్షుడుగా బి.రంగనాయకులు, సభ్యులుగా పి.రమణారావు, పి నరసింహారావు
గురువారెడ్డిపాలెం సొసైటీ అధ్యక్షుడుగా కె.సుబ్బారెడ్డి, సభ్యులుగా కె.శ్రీకాంత్, పి.ఆనందరావు
మంగమూరు సొసైటీ అధ్యక్షుడుగా ఎన్.నారాయణరావు, సభ్యులుగా ఎస్‌కే మస్తాన్ సాహెబ్, కె.గోపీకృష్ణ
పేర్నమిట్ట సొసైటీ అధ్యక్షుడుగా కె. వెంకటేశ్వరరావు,సభ్యులుగా పి.శ్రీనివాసరావు,ఎ.బ్రహ్మయ్య
సంతనూతలపాడు సిండికేట్ ఎఫ్‌ఎస్‌సీఎస్ అధ్యక్షుడుగా కె.విజయమ్మ, సభ్యులుగా ఎం రామకృష్ణారెడ్డి, పి.రాము
చౌడవరం సొసైటీ అధ్యక్షుడుగా పి.లక్ష్మీప్రసన్న, సభ్యులుగా ఆర్ నారాయణ, కె.వెంకటేశ్వర్లు
సిఎస్‌పురం సొసైటీ అధ్యక్షుడుగా వెంకటరెడ్డి, సభ్యులుగా టి.నారాయణ, డి .నాగరాజు
పామూరు సొసైటీ అధ్యక్షుడుగా యు.హరిబాబు, సభ్యులుగా ఎస్‌కె రహంతుల్లా, కె.వెంకటరమణయ్య
పీసీపల్లి సొసైటీ అధ్యక్షుడుగా పి.ఈశ్వరయ్య, సభ్యులుగా డీ సుబ్రహ్మణ్యం, యు. పిచ్చిరెడ్డి,
వెలిగండ్ల సొసైటీ అధ్యక్షుడుగా ఎస్ కాశిరెడ్డి, సభ్యులుగా వై సలోమన్, లక్ష్మీనారాయణ
ఈస్ట్ వెంకటాపురం సొసైటీ అధ్యక్షుడుగా డి. కృష్ణ, సభ్యులుగా వై.వెంకారెడ్డి, ఆర్ .వెంకటేశ్వర్లు
దర్శి సొసైటీ అధ్యక్షుడుగా కె .చంద్రశేఖరబాబు, సభ్యులుగా పి. పాపారావు, ఎ. వెంకటరావు
పసుపుగల్లు సొసైటీ అధ్యక్షుడుగా పి.శ్రీనివాసరెడ్డి, సభ్యులుగా వె.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.నాగేశ్వరరావు
చెట్లమిట్ట సొసైటీ అధ్యక్షుడుగా వి.బోడిరెడ్డి, సభ్యులుగా జి. సత్యనారాయణరెడ్డి, యు.చినశేషయ్య
గుర్రపుసాల సొసైటీ అధ్యక్షుడుగా వి.వెంకటేశ్వర్లు, సభ్యులుగా జి. గోవిందయ్య,జి.చినసుబ్బయ్య
వీరభద్రాపురం సొసైటీ అధ్యక్షుడుగా జి.కోటయ్య,సభ్యులుగా ఎ. మల్లయ్య, జి.ఆంజనేయులు
ముటుకుల సొసైటీ అధ్యక్షుడుగా పి.యోగేశ్వరరావు, సభ్యులుగా జి.వెంకటేశ్వర్లు, కె.అచ్చియ్య
మిట్టపాలెం సొసైటీ అధ్యక్షుడుగా ఎం.అల్లూరురెడ్డి, సభ్యులుగా వై.వెంకటనారాయణ, సభ్యులు డి. వెంకటనారాయణ,
విశ్వనాథపురం సొసైటీ అధ్యక్షుడుగా కె. శ్రీనివాసరెడ్డి,సభ్యులుగా డి.చినికాశిం, కె.ఏడుకొండలు
గిద్దలూరు సొసైటీ అధ్యక్షుడుగా డి.బాలఈశ్వరయ్య, సభ్యులుగా డి.గోపాల్‌రెడ్డి, సీహెచ్ ఆనందరావు
ఇడమకల్లు సొసైటీ అధ్యక్షుడుగా బి.రవీంద్రారెడ్డి, సభ్యులుగా డి.నాగేశ్వరరెడ్డి, బి రంగయ్య
అర్ధవీడు సొసైటీ అధ్యక్షుడుగా కె.వెంకటరంగారెడ్డి, సభ్యులుగా ఎల్. రామయ్య, జి. రామకృష్ణలను నియమించారు

వంతెనల వద్ద వామ్మో..!



శిథిలావస్థకు చేరుకున్న పర్చూరు వాగుపై బ్రిడ్జి



కుంకలమర్రు రోడ్డులోని కొమ్మమూరు కాలువపై రక్షణ గోడలు లేని బ్రిడ్జి

పర్చూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలోని వంతెనల సైడు గోడలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారాయి. కొన్నిచోట్ల వంతెన గోడలమధ్యలో చెట్లు పెరిగిపోతున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో వంతెనలు దెబ్బతింటున్నాయి. దీంతో ఆయా ప్రధాన రహదారుల్లోని వంతెనల పరిస్థితి దయనీయంగా మారింది. పర్చూరు వాగుపై ఉన్న వంతెన కనీస మరమ్మతులకు నోచుకోలేదు. వంతెన గోడపై చెట్టుపెరిగినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఇక చీరాల రోడ్డులోని కొమ్మమూరు కాలువ వంతనపై సైడ్‌వాల్ దెబ్బతింది. ద్విచక్రవాహనదారులు ఎవరైనా ఇక్కడ నియంత్రణ కోల్పోతే నేరుగా కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇక స్వర్ణ-కారంచేడు రోడ్డులోని వంతెన కూడా ప్రమాదభరితంగా ఉంది. కారంచేడు-కుంకలమర్రు రోడ్డులోని కొమ్మమూరు కాలువపై ఏర్పాటు చేసిన వంతెన మరింత ప్రమాదభరితంగా తయారైంది. మరోవైపు శిథిలావస్థకు చేరిన వంతెనతోపాటు, సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతినటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు కొమ్మమూరు కాలువలో నిత్యం నీరు ప్రవహిస్తూ ఉండటంతో పరిస్థితి ఒకింత ఆందోళనకరంగా మారింది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న బ్రిడ్జిలకు కనీస మరమ్మతులు చేయించడంతోపాటు వంతెన గోడలపై అలముకున్న వృక్షాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విజయాలు వివరిస్తూ.. సమస్యలు వింటూ..

(5వ పేజీ తరువాయి)

ఇస్తున్నారు. ఈనెల 2 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కాగా నిత్యం ఊరువాడా ఏదో ఒక స్థాయిలో కార్యక్రమం నడుస్తూనే ఉంది.

నియోజకవర్గాల వారీ సమీక్ష

ఏ రోజుకు ఆరోజు టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఏ నియోజకవనర్గంలో, ఏ బూతు పరిధిలో ఎన్ని ఇళ్లకు పార్టీ శ్రేణులు వెళ్లారు, ఎవరెవరు ముఖ్యనేతలు పాల్గొన్నరనేది కూడా సమీక్ష చేస్తూ ఆన్‌లైన్‌లోనే డేటా పెడుతున్నారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు ఒంగోలు నియోజకవర్గం ముందంజలో ఉంది. నియోజకవర్గంలో ఉన్న కుటుంబాల్లో 48.45శాతం కుటుంబాలను ఆదివారం రాత్రికి పార్టీ క్యాడర్ ఈ కార్యక్రమంలో కవర్‌చేశారు. తర్వాత స్థానంలో 39.26శాతంతో మార్కాపురం నియోజకవర్గం ఉంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా ఆధారంగా మొత్తం 6,01,536 కుటుంబాలు ఉన్నట్లు టీడీపీ లెక్కతేల్చింది. ఆ కుటుంబాలన్నింటినీ 30 రోజుల్లోపు వివిధ స్థాయిల్లోని క్యాడర్ కలిసేలా అదిష్టానం దిశానిర్దేశం చేసింది. ఈనెల 2నుంచి ప్రారంభమై నెల రోజులు సాగే ఈ కార్యక్రమంలో పార్టీలోని కీలక ప్రజాప్రతినిధులు కూడా నిత్యం పాల్గొనాలని ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో నియోజకవర్గ బాధ్యులైన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఇతర ముఖ్యనేతలు విస్తృత కసరత్తు చేశారు. తొలుత నియోజకవర్గాల వారీ సమావేశాలు రూపొందించి షెడ్యూల్ రూపొందించి స్థానిక నాయకులు కార్యక్రమం నిర్వహించేలా చేయడంతో పాటు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు కూడా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పాల్గొంటున్నారు. అయితే కొన్ని నియోజకవర్గాల్లో ఎక్కడిక్కడ స్థానిక నాయకత్వం చొరవ తీసుకొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలపై కరపత్రాలు పంపిణీ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తుండగా మరికొన్నింటిలో ముఖ్యనేతలు హాజరైన వద్దనే సాగుతోంది. ఫలితంగా ఈనెల 2 నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో ఆదివారం వరకు 1,41,501 కుటుంబాలను మాత్రమే కవర్‌చేశారు. అంటే జిల్లాలో ఉన్న కుటుంబాల్లో సుమారు 23.52శాతం కుటుంబాలను పార్టీ క్యాడర్ కలిసింది. జిల్లా సగటు కన్నా ఒంగోలు నియోజకవర్గంలో రెట్టింపునకుపైగా కుటుంబాలను కవర్ చేయగా మార్కాపురం, కనిగిరి కూడా ఎక్కువ శాతంగానే ఉన్నాయి. కొండపి, దర్శి, గిద్దలూరులు వెనుకబడిపోయాయి. సోమవారం కూడా జిల్లా వ్యాప్తంగా సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం కొనసాగింది. మంత్రి డాక్టర్ స్వామి, గొట్టిపాటి రవికుమార్ ఉదయం కనిగిరిలో అక్కడి నియోజకవర్గ స్థాయి పార్టీముఖ్యనేతలతో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమం ఇంకా వేగవంతంపై దిశానిర్దేశం చేశారు. రాత్రికి ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌తో కలిసి చీమకుర్తిలో మంత్రి స్వామి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 28, 29 డివిజన్ల పరిధిలో గోడుగుపాలెం, లాయర్‌పేట కొండయ్య బంకు వీధి, రాజాపానగల్‌రోడ్డు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

నియోజకవర్గం	మొత్తం కుటుంబాలు	క్యాడర్ కలిసిన కుటుంబాలు	పూర్తయిన శాతం
ఒంగోలు	79158	38353	48.45
మార్కాపురం	70820	27801	39.26
కనిగిరి	78831	18706	23.73
సంతనూతలపాడు	71161	16502	23.18
వైపాలెం	68588	11396	16.62
గిద్దలూరు	79424	10282	12.95
కొండపి	78508	9833	12.52
దర్శి	75046	8623	11.49
మొత్తం	6,01,536	1,41,501	23.18

అవీఇవీ

ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయాలి



గ్రామ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

కొత్తపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించే ప్రతి పంటను ప్రకృతి వ్యవసాయ విధానంలోనే సాగు చేసే విధంగా చూడాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ సుభాషిణి అన్నారు. సోమవారం రాత్రి కొత్తపట్నంలోని ఎస్సీ కాలనీలో జరిగిన వ్యవసాయ వార్షిక ప్రణాళిక తయారీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కొత్తపట్నం గ్రామంలో ఆరు గ్రామ సంఘాలను ఏర్పాటు చేసి ఈ సంవత్సరం వేయబోయే పంటలు ప్రతి రైతు కూడా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను తినటం వలన ఆరోగ్యంతోపాటు పర్యావరణాన్ని కూడా కాపాడుకోవచ్చని ఆమె అన్నారు. సాగు భూమి లేని వారు ఇంటి వద్దనే కిచెన్ గార్డెన్‌ను పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశానికి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఏసమ్మ, వీవో ఏ ప్రత్యూష, మహిళా సంఘాలసభ్యులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రెడ్డప్ప, ఇందిర, ప్రవీణ్, సురేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో మహిళలు నిరసన

ఎర్రగొండపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వేగినాటి కోటయ్యనగర్ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారం రోజులుగా ట్యాంకర్ల దారా నీటిని సరఫరా చేయడం లేదని, తాగునీరు లేక 100 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీటీ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

(5వ పేజీ తరువాయి)

విద్యుత్ చార్జీలను పెంచకుండా ప్రజలపై ఎలాంటి భారం మోపకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అదనపు విద్యుత్ లోడు ఉన్న ప్రాంతాలను గుర్తించి లోవోల్టేజీ సమస్యను లేకుండా పరిష్కారం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో 70వేలకుపైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చినట్టు చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో పది వేలకు పైగా సోలార్ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చేవిధంగా విద్యుత్‌శాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో నష్టాలను తగ్గించేవిధంగా సబ్‌స్టేషన్‌ల సమీపంలో కూడా పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కూడా సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్, సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం, తహసీల్దార్ రవిశంకర్, మున్సిపల్ చైర్మన్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, షేక్ ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

నమ్మకంగా మోసం

(5వ పేజీ తరువాయి)

అంతంత మాత్రంగా ఉండే పాస్టర్లు వీటి కోసం అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేసుకోవడంతో అప్పుల వాళ్ల బాధలు భరించలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

కొన్నిచోట్ల అసంపూర్తిగానే..

వైసీపీ నాయకులు మండలస్థాయిలో తమకు చెప్పిన మాటలు నమ్మి ప్రభుత్వం ఇచ్చే డబ్బులు కదా త్వరగా వస్తాయని నమ్మి మోసపోయామని బాధితులు వాపోతున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో మంజూరైన వాటిలో కూడా పుల్లలచెరువు మండలంలో అత్యధికంగా 12 చర్చిలు ఉన్నాయి. ఎర్రగొండపాలెంలో 3, త్రిపురాంతకంలో రెండు ఉన్నాయి. అయితే త్రిపురాంతకం మండలంలోని రెండు చర్చిలకు కార్పొరేషన్‌లో రూ.10 లక్షలు ఉన్నాయని, వాటిని తక్షణమే ఆ రెండు చర్చిల బిల్లులు ఇచ్చారు. జిల్లాలోని మిగిలిన అందరికీ ఇప్పటికి బిల్లులు అందలేదు. అయితే కొందరి ఎంబుక్ రికార్డులు అందలేదని, పనులు అసంపూర్తిగా ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లాలో 13 చర్చిల రికార్డులు సక్రమంగా అంది బిల్లులు జనరేట్ అయి కూడా మూడేళ్లుగా డబ్బుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గ్రానైట్ క్వారీల్లో ప్రమాదరహిత చర్యలు : ఐజీ



గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి

చీమకుర్తి,జూలై14(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు.చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం ఆయన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి రికార్డులు తనిఖీలు చేశారు. అనంతరం గ్రానైట్ క్వారీలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో నేరాల కట్టడికి సీసీ కెమెరాలతో అనునిత్యం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు,సీఐ సుబ్బారావు,సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి సున్నా సీట్లు

చీమకుర్తిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి స్వామి

చీమకుర్తి,జూలై14(ఆంధ్రజ్యోతి): వికృత చేష్టలతో పరుష పదజాలంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం జరిగేలా పన్నాంగం పన్నుతున్న ప్రతిపక్ష వైసీపీకి రాబోయే ఎన్నికల్లో గుండు సున్నా సీట్లు కట్టబెట్టి ప్రజలే బుద్ధి చెబుతారని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం సాయంత్రం చీమకుర్తి పట్టణంలో రామనగర్‌లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఇంటింటా తిరుగుతూ ఏడాదిపాలనలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడారు.తల్లికి వందనం ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఇచ్చామని అన్నపుడు మహిళలనుంచి పెద్ద ఎత్తున చప్పట్ల ద్వారా హర్షం వ్యక్తం అయింది. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏడాది కాలంలో చీమకుర్తిలో చేసిన అభివృద్ధిని వివరించారు రామతీర్థంనుంచి నేరుగా చీమకుర్తి పట్టణవాసులకు తాగునీరు అందించే ప్రాజెక్ట్‌ను తన హయాంలో తీసుకువస్తే గత వైసీపీ ప్రభుత్వం మూలన పడవేసిందన్నారు. ఇపుడు తిరిగి రూ.73కోట్లతో పనులును ప్రారంభించనున్నామన్నారు. తదుపరి మంత్రి,ఎమ్మెల్యేలకు పౌర సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, కందిమళ్ల గంగాధరరావు, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, గొల్లపూడి సుబ్బారావు, కోటేశ్వరరావు, కౌన్సిలర్ రమాదేవి, ఆవనిగడ్డ శేషారావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రామనగర్‌లో ఇంటింటా తిరుగుతున్న మంత్రి స్వామి,ఎమ్మెల్యే విజయకుమార్


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

ప్రజాపాలనతో ఇంటింటా సంతోషం

కల్లూరులో సుపరిపాలనలో తొలిఅడుగు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

కురిచేడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విధ్వంస పాలనపోయి ప్రజాపాలన రావడంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం కురిచేడు మండలం కల్లూరు గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి విధ్వంసపాలన సాగించడంతో ప్రజలు విలవిల్లాడిపోయి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. అయినా ఆయన బుద్ధి మారలేదని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజల గురించి ఆలోచించే ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. మమ్మల్ని ఇంటింటికీ తిప్పుతున్నారని చెప్పారు. అందరూ కలసికట్టుగా ముందుగా సాగితే వచ్చే ఎన్నికల్లో దర్శిలో టీడీపీదే విజయమని చెప్పారు.

సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ జగన్ లాంటి వ్యక్తి ముఖ్యమంత్రికి అనర్హుడన్నారు. గత ఐదేళ్లు తాడేపల్లి ప్యాలస్‌లో కూర్చొని అప్పుడప్పుడా బయటకు వచ్చినా పరదాలు కట్టించిన ఘనుడు అని విమర్శించారు. ఒకరు మరణిస్తే వారి పరామర్శకు వచ్చి మరో ముగ్గురి ప్రాణాలు తీసిన వ్యక్తి అని ధ్వజమెత్తారు. తన కారు టైరు కింద నలిగి వ్యక్తి ప్రాణాలు పోయినా తనకు తెలియదన్న తప్పించుకున్న వ్యక్తి జగన్ అని విమర్శించారు. నెలకోసారి ప్యాలస్ నుంచి బయటకు వచ్చి గందరగోళం సృష్టించడం తంతుగా సాగుతోందన్నారు. తల్లికి వందనం పేరుతో ఎంతమంది ఉంటే అంతమందికి ఇచ్చిన ఘనత ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సాకారం కాబోతున్నట్టు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఈనెలలో సాయం చేయనున్నట్టు చెప్పారు. అధికారంలోకి రాగానే చెప్పిన విధంగా పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి మాట నిలబెట్టుకున్న సీఎంకు ధన్యవాదాలు తెలియజేయాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి మంత్రులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. నమశ్శివాయపురం, పెద్దవరం గ్రామాల వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ కురిచేడు మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలకు పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణ కోసం ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 8నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1నుంచి 2 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని చెప్పారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టువద్ద ఉన్న శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాల, ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ, రైజ్ కృష్ణసాయి, రైజ్ కృష్ణసాయి గాంధీ ఇంజనీరింగ్ కళాశాల, ఒంగోలులోని నేషనల్ కౌన్సిల్‌ఫర్ చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా సంస్థలో ఈపరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వాచీలు, పరికరాలను పరీక్షా కేంద్రాల్లో అనుమతించడం లేదన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లదే కీలక బాధ్యత అని డీఆర్వో తెలిపారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ విజయకుమార్, డీపీవో వెంకటనాయుడుతో పాటు పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయం

- పొదిలిలో రూ.79లక్షలతో బాలురు, బాలికల వసతి గృహాలకు మరమ్మతులు
- రాష్ట్రంలో రూ.143కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు
- రూ.100కోట్లతో నూతన భవనాలు
- సన్న బియ్యం వండిపెడుతుండడంపై మంత్రి బాలవీరాంజనేయస్వామి ఆరా


విద్యార్థినులతో ముచ్చటిస్తున్న మంత్రి స్వామి

పొదిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. సోమవారం పట్టణంలో ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూ.79లక్షల నిధులతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పొదిలి హాస్టళ్లలో మరుగుదొడ్ల పునర్‌నిర్మాణ పనులు, భవనాల మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి మరమ్మతులను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న వంటగది, టాయ్‌లెట్స్, విద్యార్థులు నిద్రించే వసతి రూములను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పూలమొక్కలు, ఇతర మొక్కలను వేయాలన్నారు. అనంతరం ఎస్సీ బాలుర వసతిగృహాన్ని పరిశీలించి స్నానాల గదులు, బాత్రూంలు, పరిసరాలను పరిశీలించారు. సన్న బియ్యంతో భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రూ.143కోట్లతో సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. రూ.100కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.58కోట్లతో వసతి గృహాల్లో మరుగుదొడ్లను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. మంత్రి వెంట సోషల్ వెల్ఫేర్ ఈడీ వెంకటేశ్వరనాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ టీడీపీ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, రేగుల వీగునారాయణ తుళ్లూరి నరసింహారావు, కాంట్రాక్టర్ దోర్నాల అంజిరెడ్డి, తలమళ్ళ వెంకట్రావు, రామాపురం కొండలు, ముని శ్రీనివాసులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఇద్దరూ గెలిచినట్లే



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఇబ్రహీంషరీఫ్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలు గెలిచినట్లేనని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ చెప్పారు. స్థానిక జిల్లా న్యాయస్థానంలోని బార్ అసోసియేషన్ హాలులో సోమవారం జరిగిన మీడియేషన్ ఫర్ నేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కక్షిదారులు ఇరువురు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మధ్యవర్తిత్వం శిక్షణ పొందిన న్యాయవాదులు చిట్టెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమకు ఇచ్చిన శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కక్షిదారుల మధ్య మధ్యవర్తిత్వం చేసి వ్యాజ్యాల పరిష్కారానికి ఎంతో సహకరిస్తుందన్నారు. శిక్షణ పొందిన మీడియేటర్స్ నల్లూరి సత్య శ్రీనివాసులు, పి. సంజీవరెడ్డి, నాయుడు ఈశ్వరరావు, అయినాబత్తిన సుబ్బారావులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉండే పంచాయతీకి ర్యాంక్


తుమ్మలచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

తర్లుపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉండే గ్రామ పంచాయతీలకు ర్యాంక్ వస్తుందని కేంద్ర బృందం సభ్యులు రవి వర్మ అన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న మురుగు కాలువల పర్యవేక్షణ, మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ స్కూల్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్తలను వేరుచేసి సక్రమంగా ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌కు తరలించాలని, తద్వారా కాంపోండ్ ఎరువు తయారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు మరుగుదొడ్ల వినియోగం గురించి ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే పంచాయతీలకు ర్యాంకింగ్ వస్తుందన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు సందీప్, ఈఓపీఆర్‌డీ సుకుమార్, స్వచ్ఛభారత్ సభ్యులు ఎస్‌కే ఖాజా వలి, రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు గీతా, పద్మ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరులో ఆగని నీటి వృథా

గిద్దలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వభారతి పాఠశాల వీధిలో పైపులైన్ పగిలి నీరంతా వృథాగా పోతున్నది. గతంలో పైపులైన్ వద్ద లీకేజ్ ఉండగా, చిన్నపాటి మరమ్మతులు మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. అయితే మళ్లీ అదే ప్రాంతంలో నీటి లీకేజీ పెరిగి ఫౌంటేన్ లాగా నీరు చిమ్ముతూ వృథాగా పోతున్నది. స్థానికులు నీటి వృథా వద్ద చిన్నపాటి బండలు పెట్టినప్పటికీ ఆగడం లేదు. ఇలాగే మరికొన్ని ప్రాంతాలలో పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో నీరు వృథాగానే పోతున్నది. వెంటనే ఆ ప్రాంతాలను గుర్తించి కొత్త పైపులను బిగించాలని, నీటి వృథాను అరికట్టాలని ఆప్రాంతప్రజలు కోరుతున్నారు.


పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు అరెస్ట్

రూ. 9.06 లక్షల వెండి, బంగారం, మోటార్ సైకిల్ సీజ్

వివరాలు వెల్లడించిన సీఐ హజరత్తయ్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య పక్కన ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అడ్డదారిలో నగదు సంపాదించాలనే దురాశలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను జరుగుమల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 3.100 కిలోల గంజాయిని, రూ.8 లక్షల విలువచేసే 8 కేజీలు వెండి (57 కడ్డీలు), 9 గ్రామల బంగారం (రూ. 81వేలు), రూ.25 వేలు విలువచేసే మోటార్ బైక్‌ను సీజ్ చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య జరుగుమల్లి ఎస్సై బత్తుల మహేంద్రతో కలిసి వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాలు మేరకు.. ఒంగోలు నుంచి చెన్నై వెళ్లె జాతీయ రహదారి 16 పై జరుగుమల్లి మండలం వావిలేటిపాడు క్రాస్‌రోడ్డు ఇటుకల బట్టీల వద్ద అక్రమ గంజాయి రవాణా చేస్తున్నరనే సమాచారంలో పోలీసులు అక్కడికి వెళ్లారు. సంఘటనా స్థలంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌కి చెందిన ముకేష్‌కుమార్, గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెంకి చెందిన ఒడ్లమాను శివారెడ్డి, ఒంగోలుకి గుర్రం జాషువా నగర్‌కు చెందిన ట్రంకు కార్తీక్ చెందిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితులు ముగ్గురిని పోలీసులు విచారించారు. అందులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముకేష్‌కుమార్ సుమారు నాలుగేళ్ల నుంచి మద్దిపాడు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మద్దిపాడు హైవేపై లారీ డ్రైవర్ల నుంచి తక్కువ రేటుకి డిజిల్ కొనుగోలుచేసి ఎక్కువ రేటుకి అమ్ముతూ అక్రమంగా నగదు సంపాదిస్తూ జీవనం సాగిస్తున్నారు. డిజిల్ వ్యాపారం తగ్గడంతో మేదరమెట్ల దగ్గరలోని గ్రోత్‌సెంటర్ వద్ద హోటల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంటాడు. దీంతో అక్రమంగా నగదును సంపాదించడానికి గంజాయి రావాణా చేయడం ప్రారంభించారు. ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లోకి వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కేజీ గంజాయిని రూ. 10వేలు చొప్పున కోనుగోలు చేసి దానిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ. 200 నుంచి 500 వరకు మేదరమిట్ల, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో అమ్ముతూ నగదు సంపాదించుకుంటున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన ఒడ్లమాను శివారెడ్డి, ఒంగోలుకి చెందిన కార్తీక్‌లు ముకేష్‌కుమార్ వద్దకు వచ్చి తరుచూ గంజాయి కోనుగోలు అమ్మకాలు చేసేవారు. ఈక్రమంలో ఇరువురు ముకేష్‌కుమార్ ఫోన్‌చేసి చెరొక కేజీ గంజాయి కావాలని అడుగుతారు. దీంతో ముకేష్‌కుమార్ జరుగుమల్లి మండలం వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్దకు వచ్చి గంజాయి ప్యాకెట్లు తీసుకొని వెళ్లమని చెబుతాడు. దీంతో సోమవారం ముకేష్‌కుమార్ గంజాయి ప్యాకెట్లు తీసుకొని జరుగుమల్లి అడ్డరోడ్డుకి వచ్చాడు. కొద్దిసేపటికి గంజాయి ప్యాకెట్లు తీసుకొని వెళ్లడానికి శివారెడ్డి, కార్తీక్‌లు అక్కడికి వచ్చారు. ముకేష్‌కుమార్ నుంచి ఇరువురు గంజాయి ప్యాకెట్లు తీసుకొని వెళ్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ హజరత్తయ్య, జరుగుమల్లి ఎస్సై బత్తుల మహేంద్రను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

వెబ్ ఆప్షన్లు ప్రారంభం



ఒంగోలు విద్య, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీసెట్-25 వెబ్ ఆప్షన్లు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 16 వరకు అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి సర్టిఫికెట్ల పరిశీలనకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 17వతేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది, ప్రవేశాలకు సంబంధించి అభ్యర్థులు ప్రాధాన్యతక్రమంలో కళాశాలలు, కోర్సులకు వరుస క్రమంలో ఆప్షన్‌లు పెట్టుకోవాలి. అందుకు ఈనెల 18 వరకు అవకాశం ఉంది. వెబ్ ఆప్షన్లలో మార్పులు, చేర్పులకు 19వ తేదీ వరకు ఉంది. ఆ తర్వాత ఆప్షన్లు ఫ్రీజ్‌అవుతాయి. వాటి ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులకు ఈనెల 22న సీట్ల కేటాయిస్తారు. 23నుంచి 26వ తేదీ వరకు సీటు వచ్చి అభ్యర్థులు సెల్ఫ్ జాయినింగ్ అయ్యి కళాశాలలో రిపోర్టు చేయాలి. ఆగస్టు 4నుంచి ఇంజనీరింగ్, ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయి.

బకాయిలు చెల్లించని దుకాణాలకు తాళాలు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో పన్ను బకాయిలు చెల్లించని దుకాణాలకు కార్పొరేషన్ అధికారులు తాళాలు వేశారు. గత కొన్నేళ్లుగా పన్నులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం ఆ బకాయిలు సుమారు రూ. 10 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంచితే కొన్ని షాపులలో బినామీలు ఉండగా, వారిని గుర్తించే పనిలో ఉన్నారు. ఈ మేరకు కమిషనరు కే. వెంకటేశ్వరరావు ఆదేశాలతో షాపులకు తాళాలు వేయడంతోపాటు, దీర్ఘ కాలిక పన్నుల వసూలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, ఆర్‌వో విజయ్ భాస్కర్, ఆర్‌ఐలు కళ్యాణి, శ్రీనివాసులు, క్రాంతి, నిరూప్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి


విచారణ జరుపుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జడ్పీ పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిపై చర్యలు తీసుకోవాలని ఆ పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పఠాన్ నాగూర్‌ఖాన్ డిమాండ్ చేశారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో ప్రధానోపాధ్యాయిని అవినీతికి పాల్పడుతూ మెనూను సక్రమంగా అమలుచేయడం లేదన్నారు. సోమవారం 802 మందికి భోజనం వండటానికి 120 కేజీలకు బదులు 50కిలోల బియ్యం మాత్రమే వండి నిర్వాహకులకు ఇచ్చారన్నారు. గుడ్లు కూడా 450 మాత్రమే ఇచ్చారని తెలిపారు. రికార్డులు పరిశీలిస్తే 120 కిలోల బియ్యం, 450 గుడ్లు ఇచ్చారని రికార్డులో రాసినట్లు తెలిపారు. తన ముందే రికార్డులు కూడా తారుమారు చేసినట్లు ఆరోపించారు. ఇటీవల పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష నిధులు వస్తే రూ.10వేలు మాత్రమే ఖర్చు చేసి, మిగిలింది దాచుకుందని తెలిపారు. ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని, పాచిపట్టిన వాటర్ ట్యాంకులోని నీరు తాగి బాలికలు వ్యాధులకు గురవుతున్నారన్నారు. పదిపాసైన విద్యార్థుల నుంచి టీసీ కోసం రూ.500 బలవంతంగా వసులు చేసిందని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయురాలిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు.

హెచ్‌ఎంపై విచారణ

జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్ పఠాన్ నాగూర్ సోమవారం చేసిన ఆరోపణలపై సాయంత్రం ఉన్నతాధికారులు స్పందించారు. పాఠశాలకు చేరుకున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. బియ్యం గోడౌన్‌ను పరిశీలించారు. హెచ్‌ఎం తీరుపై సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్, తహసీల్దార్, విద్యా శాఖ అధికారులు పాఠశాలలో రికార్డులను పరిశీలించి విచారణ చేశారు.

వైసీపీ కార్పొరేటర్లవి అసత్య ప్రచారాలు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పాత మార్కెట్ ఖాళీ స్థలంపై వైసీపీ కార్పొరేటర్లు అసత్య ప్రచారాలు మానుకోవాలని డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి పేర్కొన్నారు. సోమవారం ఆయన చాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బుజ్జి మాట్లాడుతూ పాత మార్కెట్‌లో ఖాళీ స్థలం కేటాయింపులో నిబంధనలకు లోబడి తాత్కాలికంగా నిర్మాణాలు చేపట్టేందుకు గతంలో ఓ వ్యక్తికి అనుమతులు మంజూరు చేసిందన్నారు. పలు కారణాల చేత ఇచ్చిన అనుమతులనను గతంలోనే రద్దు చేశామని, వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు. టీడీపీపై బురద జల్లే పనిలో వైసీపీ కార్పొరేటర్లు ఉన్నారని బుజ్జి తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందన్నారు. సీనియర్ కార్పొరేటర్ దాచర్ల వెంకట రమణయ్య మాట్లాడుతూ నగరాన్ని అందంగా తీర్చిదిద్దడంతోపాటు, మహా నగరాలకు దీటుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఒక లక్ష్యంతో పనిచేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా రహదారుల విస్తరణ, నగర సుందరీకరణ, పార్కులు, తాగునీటి పైపులైన్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపై దృష్టి సారించారన్నారు. రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం పలికినట్లు చెప్పారు. వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా ఆ పార్టీకి చెందిన నేతలు, కార్పొరేటర్లు తమ వైఖరి మార్చుకోకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. మీడియా సమావేశంలో టీడీపీ కార్పొరేటర్లు తిప్పరమల్లి రవితేజ, అంబూరి శ్రీనివాసరావు, ఆదిపూడి గిరిజా శాండిల్య, చింతపల్లి గోపితో పలువురు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్

రేపటి నుంచి మహిళా ఎంపీపీలకు శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని మండల పరిషత్ మహిళా అధ్యక్షులకు, మహిళా జడ్పీటీసీలకు ఈనెల 16వతేదీ నుంచి మూడు రోజుల పాటు ఒంగోలులోని పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో బి. చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజుల పాటు స్పెషలైజ్డ్ శిక్షణా కార్యక్రమాన్ని మహిళా సభ్యులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో బాపట్లలో ఈ శిక్షణ ఇచ్చామని, ఆ శిక్షణకు హాజరుకాలేకపోయిన మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలకు ఇప్పుడు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ జరుగుతుందని తెలిపారు.

కార్మికుల సమ్మెకు మద్దతు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న సమ్మెకు సీఐటీయూ జిల్లాకమిటీ సంపూర్ణమద్దతు ఇస్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం. రమేష్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వతేదీ అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. అందువల్ల కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సర్వేకు సహకరించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు, జరుగుమల్లి, పొన్నలూరు, టంగుటూరు, నాగులుప్పలపాడు, సింగరాయకొండ తదితర మండలాల్లో అయిల్ నిక్షేపాలు ఉన్నాయని ఓఎన్‌జీసీ అధికారులు, వారి సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లోని గ్రామస్థులు, రైతులు ఈ సర్వేకు సహకరించాలన్నారు.

ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● జేసీ గోపాలకృష్ణ ఆదేశం



గ్రీవెన్స్‌లో ప్రజల సమస్యలు వింటున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్,జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను జేసీకి విన్నవించారు. ఆయా సమస్యలపై స్పందించిన జేసీ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా వాటి పరిష్కారం తీరు ఉండాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో భరోసా కల్పించాలని గోపాలకృష్ణ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్‌రెడ్డి, జాన్సన్, పార్థసారథితో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

● దళితవాడలోని ఎయిడెడ్ సీఈ పాఠశాల స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి రక్షించాలని నాగులుప్పలపాడు మండలం మాచవరం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఆ ఎయిడెడ్ పాఠశాల 97 సంవత్సరాలనుంచి 1నుంచి 5వతరగతి వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. పాఠశాలకు చెందిన మూడుసెంట్ల స్థలాన్ని ఆక్రమించడంతో విద్యార్థుల రాకపోకలతో పాటు వాహనాలు కూడా పోలేనిపరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల ఆక్రమణలు తొలగించి పాఠశాల స్థలాన్ని రక్షించాలని కోరారు.

మద్దిపాడులో మూడు అర్జీలు

మద్దిపాడు :మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు.

మీకోసంలో ఎస్పీకి 94 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో నేరుగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి 94 మంది తమ ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు. దీంతో సంబంధిత పోలీసు అధికార్లతో ఎస్పీ మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, సీఐలు దుర్గాప్రసాద్, షమీముల్లా,ఎస్సై జనార్దనరావు పాల్గొన్నారు.



నగరంలోని గొడుగుపాలెంలో వృద్ధురాలి సమస్యను వింటున్న ఎమ్మెల్యే జనార్దన్

సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

● శాసనసభ్యులు దామచర్ల జనార్దన్

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు పరిష్కరించడంతోపాటు, అభివృద్ధి చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులోని 29వ డివిజన్‌లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేయడంతోపాటు, అందరి కుటుంబాల్లో ఆనందం చూడటమే లక్ష్యమన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చినట్లు తెలిపారు. వచ్చే నెల 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణసౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ధి కోసం తాను నిరంతరం కష్టపడుతున్నాని అన్నారు. నగర సుందరీకరణ, ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా, రోడ్ల విస్తరణ, పారిశుధ్యం మెరుగు, అలాగే పార్కుల అభివృద్ధి, పైపులైను నిర్మాణం తదితర పనులు ఏడాదిలోనే చేపట్టామన్నారు. ప్రజా ప్రభుత్వం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని దామచర్ల మీడియాకు స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా డివిజన్‌లోని పలు సమస్యలను గుర్తించిన దామచర్ల తక్షణమే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావుతోపాటు పలువురు డివిజన్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలని ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతిని ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. ప్రభాకర్ డిమాండ్‌చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా ఆ సంఘ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రతి నెలా నిరుద్యోగులకు నెలకు రూ. 3వేల భృతిని చెల్లించాలన్నారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆర్. కరుణానిధి, ఏఐవైఎఫ్ నాయకులు బి. రాంబాబు, గోపీ,మత్తయ్య, శ్యాంబాబు, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

చీమకుర్తి సీఐ ఆగడాలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్, గ్రానైట్‌మాఫియాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న సీఐ సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ విముక్తి కమిటీసభ్యులు కాట్రగడ్డ రఘుపతి, డాక్టర్ పమిడి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పర్యావరణ విముక్తి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. చీమకుర్తి మండలంలోని ఆర్ఎల్‌పురం గ్రామ డొంకలు, వాగుపోరంబోకు భూములను ఆక్రమించి గ్రానైట్ వెస్టేజ్ రాళ్లతో డంపింగ్ చేస్తున్న కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉం డటమే కాకుండా ఫిర్యాదు చేసిన వారిని హతమారుస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తాము పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్నామని, తమపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. తమ నలుగురు సభ్యులకు ఏదైనా జరిగితే సీఐ సుబ్బారావు, ఐదుగురు గ్రానైట్‌కంపెనీల వారినే బాధ్యులను చేయాలని వారు కోరారు. వేమూరి సుబ్బారావు, పుట్టా సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సీఐకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పర్యావరణ విముక్తి కమిటీ సభ్యులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీపుల్స్‌ఫర్ యానిమల్స్ సభ్యులు

మూగజీవాలను హింసిస్తే నేరంగా పరిగణించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాలను హింసిస్తే నేరంగా పరిగణించాలని పీపుల్స్ ఫర్ యానిమల్స్ సభ్యులు విష్ణువర్ధన్ కోరారు. ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ మూగజీవాలను హింసించినా, వాటికి అన్నంపెట్టే సమయంలో ఎవరైనా ఇబ్బందులు పెట్టినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సభ్యుడు రాకేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సామాజిక వనాల సాగుపై రైతుల చూపు

● పొగాకు కష్టనష్టాలు పడలేకే..

కొండపి, జూలై14 (ఆంధ్రజ్యోతి): కొండపి ప్రాంతంలో రైతులు సామాజిక వనాలసాగుపై ఆసక్తి కనపరుస్తున్నారు. గడచిన ఏడాది నుంచే రైతులు సుబాబుల్, జామాయిల్, చౌక సాగును ప్రారంభించారు. ప్రధానంగా కొండపి ప్రాంతంలో పొగాకు, శనగ పంటలు ఏటా రైతులు సాగు చేస్తుంటారు.

అయితే గడచిన నాలుగేళ్లగా పొగాకు సాగు లాభదాయకంగా ఉండటంతో శనగ పంట తగ్గించి పొగాకు సాగు విస్తీర్ణం పెంచారు. అయితే గడచిన ఏడాది కూలి రేట్లు తోపాటు పొగాకు ఉత్పాదక వ్యయం పెరిగింది. దీనిని గమనించిన రైతులు తక్కువ పెట్టుబడితో సామాజిక వనాల సాగుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

గడచిన ఏడాది కొండపి ప్రాంతంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో జామాయిల్ నాటారు. దాదాపు 500 ఎకరాల్లో సుబాబుల్, రెండొందల ఎకరాల్లో ఇసుక నేలల్లో చౌక మొక్కలు వేశారు. ఈ ఏడాది పొగాకు ధరలు భారీగా పతనమై, పొగాకు సాగుతో నష్టాలు మూటగట్టుకున్న రైతులు సామాజిక వనాల సాగుకు ఉపక్రమిస్తున్నారు.

ఒకేసారి పెట్టుబడితోపాటు, కూలీలు, ఇతర సేద్యాల ఖర్చులు సామాజిక వనాల సాగులో తక్కువ ఉంటాయి. యాజమాన్య, సస్యరక్షణ ఖర్చులుతోపాటు, సామాజిక వనాల సంరక్షణ ఖర్చులు కూడా ఉండవు. దీనితో రైతులు సబాబుల్, జామాయిల్, చౌక చెట్ల పెంపకానికి కార్యాచరణ కార్యక్రమం రూపొందించుకుంటున్నారు.



గడచిన ఏడాది సాగు చేసిన జామాయిత్ తోట



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా బొగ్గవరపు

ఒంగోలు కల్చరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా బొగ్గవరపు సుబ్బారావు సెప్టెంబర్ 1 నుంచి బాధ్యతలు నిర్వహిస్తారని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం స్థానిక వైశ్యభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘ అధ్యక్ష ఎన్నిక గత సంవత్సరం జూన్ 9న నిర్వహించగా ఐదుగురు నామినేషన్ వేశారని అందులో ముగ్గురు ఉపసంహరించుకోగా కోటా హనుమంత రావు, బొగ్గవరపు సుబ్బారావులు బరిలో ఉన్నారన్నారు. అయితే వైశ్యసంఘ పెద్దల సూచనతో ఒక్కొక్కరు సంవత్సరం చొప్పున పదవి నిర్వహించేలా ఒప్పందం జరిగిందన్నారు. దీనితో ఇప్పటి వరకు కోటా హనుమంతరావు అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారని పల్లపోతు వెంకటేశ్వర్లు తెలిపారు. అయితే వైశ్యభవన్‌కు సంబంధించి కొన్ని పనులు జరుగుతుండటంతో సంఘ పెద్దలు టి.జి.వెంకటేష్, శిద్దా రాఘవరావుల సూచనతో కోటా హనుమంతరావు ఆగస్టు 31 వరకు బాధ్యతలలో కొనసాగుతారని, అనంతరం బొగ్గవరపు సుబ్బారావు బాధ్యతలు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. సంఘ మాజీ అధ్యక్షుడు శిద్దా పాండురంగా రావు మాట్లాడుతూ వైశ్యులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని అన్నారు. బొగ్గవరపు సుబ్బారావు మాట్లాడుతూ వైశ్యసంఘ పెద్దలు తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి జిల్లాలో ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. ఈసమావేశంలో వాసవి సేవ రాష్ట్ర అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాసరావు, నాయకులు గునుపూడి భాస్కర రావు, జలదంకి వెంకట కృష్ణారావు, సురేష్, కూరపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలు సొసైటీ అధ్యక్షునిగా జనార్దనరావు



నాగులుప్పలపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మనబ్రోలు, రాపర్ల పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అమ్మనబ్రోలు సొసైటీ అధ్యక్షునిగా మారెళ్ల జనార్దన రావు, రాపర్ల సొసైటీ అధ్యక్షునిగా గంగి రమణారెడ్డిని నియమించారు. వీరితో పాటు సభ్యులుగా అమ్మనబ్రోలు పీఏసీఎస్‌కు డి.వెంకటశేషయ్య, కె.వెంకటేశ్వర్లు, రాపర్ల పీఏసీఎస్‌కు చెన్నాయపాలెం జాలయ్య, గంటా పెద్దన్నను నియమించారు.

నందిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

మద్దిపాడు,జూలై14(ఆంధ్రజ్యోతి):నందిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఉప్పగుండూరి నాగేశ్వరరావు ,పెద్దకొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా మండవ హరిప్రసాదులను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా ఉప్పగుండూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ నందిపాడు సొసైటీ సేవలు రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు మండవ హరిప్రసాదు మాట్లాడుతూ సొసైటీ ద్వారా శనగలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయిస్తానన్నారు.

వేలానికి మేలురకం పొగాకును తీసుకురావాలి

● బోర్డు రీజనల్ మేనేజర్ రామారావు



పొగాకు వేలంను పరిశీలిస్తున్న ఆర్‌ఎం శీలం రామారావు

ఒంగోలు (రూరల్),జూలై14(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు కొనుగోలు చేసే మేలు రకం పొగాకును మాత్రమే వేలానికి తీసుకురావాలని పొగాకు బోర్డు ఆర్ఎం శీలం రామారావు అన్నారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండులో జరుగుతున్న వేలంను పొగాకు బోర్డు ఆర్ఎం శీలం రామారావు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ పొగాకు వ్యాపారులు (వ్యాపార సంస్థల ప్రతినిధులు)రైతులకు గిట్టుబాటు వచ్చే విధంగా కొనుగోలు చేయాలన్నారు. పొగాకు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయన్నారు. అందువల్ల రైతులు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2025 -2026 సంవత్సరానికి రైతులు పొగాకు పంట కుప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు ఈకార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జె.తులసి,వివిధ గ్రామాల రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ. .280

మద్దిపాడు: వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రాచవారిపాలెం రైతులు 1,225 బేళ్లు అమ్మకానికి తీసుకురాగా 1,180 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280 కాగా కనిష్ఠ ధర రూ.180 ఉన్నట్లు వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు.అలాగే ఒంగోలు పొగాకు బోర్డు ఆర్.ఎం రామారావు పొగాకు వేలంను పరిశీలించారు. రైతు సంఘ నాయకులు ఆబ్బూరి శేషగిరి రావు, ఐటీసీ, జీటీసీ మేనేజర్లు, నారిపెద్ది వరహాల చౌదరి, మండవ గోవింద రాజులు, మండవ శ్రీరామ్మూర్తి, కాకర్ల విజయ్ కుమార్, రావి ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.

వసతిగృహంలో బాలికలను చేర్పించాలి

కొత్తపట్నం,జూలై 14(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల,బాలుర వసతి గృహాల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని వసతి గృహం సంక్షేమ అధికారిణి అరుణ కోరారు బాలబాలికలకు వేర్వేరుగా ప్రభుత్వ భవనాల్లో వసతి గృహాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అన్ని కులాలకు చెందిన విద్యార్థులకు ప్రవేశం ఉంటుందని ఆమె తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి

మద్దిపాడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని మద్దిపాడు ఎంపీడీవో వి.జ్యోతి అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆమె మాట్లాడారు. కార్మికులు వీధుల్లో తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త సంపద కేంద్రానికి తరలించే విధంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు జవాబుదారీతనంతో పనిచేయాలని ఆమె సూచించారు.

పెద్దకొత్తపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు

మద్దిపాడు :పెద్దకొత్తపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం పీఏసీఎస్‌కు త్రీమెన్ కమిటీ నియామకం

● చైర్‌పర్సన్‌గా లక్ష్మీప్రసన్న



కొండపి, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడవరం పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌తోపాటు, మరో ఇద్దరిని మెంబర్లుగా నియమిస్తూ సహకార శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. చోడవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన బొద్దులూరి లక్ష్మీప్రసన్న, మెంబర్లుగా చోడవరం గ్రామానికి చెందిన రావి నారాయణ, కట్టుబడివారిపాలెం గ్రామానికి చెందిన కమ్మ వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బొద్దులూరి లక్ష్మీప్రసన్న తెలుగు మహిళ మండల అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తనను చైర్‌పర్సన్‌గా నియమించినందుకు మంత్రి స్వామికి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు, టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావుకు, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


మద్దిపాడు,జూలై 14(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీపీ ప్రసాద్ అన్నారు. నర్సాయపాలెం స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

చెట్లు నరికిన వారిని కఠినంగా శిక్షించాలి

నాగులుప్పలపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఈదుమూడి గ్రామంలోని హిందూ శ్మశాన వాటికలో తాము పెంచి పోషించిన వివిధరకాల చెట్లను అక్రమంగా నరికి మొద్దులు తరలించిన వ్యక్తులపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని 'మన ఊరు మన ఈదుమూడి' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ స్వగ్రామైన ఈదుమూడి అభివృద్ధికి కొందరు గ్రామస్థులతో కలసి 2015 లో మన ఊరు మన ఈదుమూడి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అందులో భాగంగా హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేసి ప్రహరీ నిర్మించి లోపల కానుగ,వేప,తురాయి మొక్కలను నాటి పెద్దవి చేశామన్నారు. రెండు రోజుల క్రితం విద్యుత్ శాఖ సిబ్బంది శ్మశాన స్థలంలోని చెట్లను పవర్ కటింగ్ మిషన్లతో అక్రమంగా నేల వరకు నరికి మొద్దులను సైతం తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను అక్రమంగా నరికిన వారిని సంబంధిత అధికారులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఇదే విషయం పై గ్రామ పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డికి మన ఊరు మన ఈదుమూడి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు ఫిర్యాదు చేశారు. కారకులైన వారిని శిక్షించకుంటే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.







శ్మశానంలో చెట్లను అక్రమంగా మిషన్‌తో నేల వరకు కోసి వేసి తరలించుకుపోయిన విద్యుత్ శాఖ సిబ్బంది

తీరనున్న ప్రజల దాహార్తి

- చిరకాల స్వప్నం నెరవేరుతుండడంతో ఆనందం
- తాగునీటి కష్టాలను తొలగిస్తున్న ప్రజా ప్రభుత్వం
- చకచకా జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులు
- వైసీపీ పాలనలో సమ్మర్ స్టోరేజీ నిర్మాణంపై నిర్లక్ష్యం



రహదారి పొడవునా సిద్ధంగా ఉన్న పైపులు



భారీ యంత్రాలతో సాగుతున్న పైపులైన్ పనులు

పొదిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అత్యంత కరువు పీడిత ప్రాంతం పొదిలి మండలమని చెప్తారు. తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చెరువులు, కుంటలు, వంకలుల, వాగులు ఒట్టిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. కనీసం వాడుక నీటికీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. 40ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన రక్షితనీటి పథకం పెరిగిన జనాభాకు అనుకూలంగా అవసరాలు తీర్చలేకపోతోంది. దీంతో తాగునీటిని సైతం కొనుక్కొని తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. పెద్దచెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌గా మార్చి దర్శి వద్ద ఉన్న సాగర్ కుడి కాలువ నుంచి పైపులైన్ ద్వారా పెద్దచెరువును నింపాలనే ప్రతిపాదనలు ఏళ్లయినా కార్యరూపం దాల్చలేదు. సాగర్ జలాలు పెద్ద చెరువులో నింపితే పొదిలి మండల ప్రజల దాహార్తి తీర్చడంతోపాటు భుగర్భ జలాలు కూడా పెరిగి వాడుక నీటికి సైతం ఇబ్బందులు ఉండవని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో గత వైసీపీ పాలనలో రూ.50కోట్ల అంచనాతో పైపులైన్ నిర్మాణ పనులకు పాలనా ఆమోదం లభించింది. ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి మార్కాపురంలో వర్చువల్ పద్ధతిలో సమ్మర్ స్టోరేజ్ ప్రాజెక్టుకు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులు దక్కించుకున్న నిర్మాణ సంస్థ వెంటనే పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టింది. రూ.10కోట్ల మేర పనులు చేసింది. దానికి సంబంధించి బిల్లులు చేసే సమయంలో ఆర్థిక అనుమతులు ఇవ్వక పోవడంతో బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. కేవలం ఎన్నికల ముందు లబ్ధి కోసమే వైసీపీ నేతలు ప్రచార ఆర్భాటంగా ఈ పనులు ప్రారంభించారే తప్ప ప్రజల కష్టాలను తీర్చడానికి కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తికాకుండా ఏదో గొప్ప ఘనత సాధించినట్లు వైసీపీ నేతలు విజయోత్సవాలు కూడా చేసుకున్నారు. తీరా ఆర్థిక అనుమతులు లేవనే విషయం బైటకు పొక్కడంతో జగన్‌రెడ్డి ప్రారంభ డ్రామా అంతా మోసమని తెలిసిపోయింది. అంతే కాకుండా నిర్మాణ పనులు వెనువెంటనే ఆగిపోయాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమ్మర్‌స్టోరేజీ నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండా, పొదిలిలో సమ్మర్ స్టోరేజీ పనులకు ఆర్థిక అనుమతి ఇవ్వకుండా జగన్‌రెడ్డి ప్రజలను మోసగించిన తీరును ఆయన ఎండగట్టారు. అదే క్రమంలో పనులు చేపట్టి పొదిలి ప్రజల నీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చిన కందుల ఆ మేరకు ఆర్థిక అనుమతులు వచ్చేలా ఎంతగానో కృషి చేశారు. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక అనుమతులు వచ్చాయి. దీంతో పైపులైన్ నిర్మాణ పనులను నిర్మాణ సంస్థ పునఃప్రారంభించింది. రాత్రింబవళ్లు పనులను భారీ యంత్రాలతో చేస్తున్నారు. పైపులైన్‌లు అమర్చే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఇప్పటి వరకు 60శాతంపైగా పనులు పూర్తి అయ్యాయి. పైపులైన్ నిర్మాణ పనుల తరువాత చెరువులో ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది.

సమ్మర్ స్టోరేజీ నిర్మాణం పూర్తి అయితే చిన్న చెరువుకు సాగర్ జలాలతో నింపుతారు. పట్టణ జనాభాతోపాటు మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు సమృద్ధిగా అందించే వీలు కలుగుతుంది. ఎన్నోఏళ్ల కల సాకారమవుతుండడంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాళ్లవాగు సరిహద్దు భూమిలో కొలతలు వేయించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతి, జిల్లా సర్వేయర్లు

రాళ్లవాగు సరిహద్దు భూముల సర్వే

ఎర్రగొండపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం సర్వే నెంబరు 28/1లో రాళ్లవాగు సరిహద్దు భూములు ఆక్రమణలకు గురయ్యాయని జేసీకి ఫిర్యాదులు అందడంతో సోమవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతి, ఎర్రగొండపాలెం తహసీల్దార్ మంజునాథ రెడ్డి పర్యవేక్షణలో జిల్లా సర్వేయర్లు కొలతలు వేశారు. రాళ్లవాగు సరిహద్దులో ఆక్రమణకు గురైన భూమిని గుర్తించారు. రాళ్లవాగు సరిహద్దు భూమి వరకు ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ తీయించాలని తహసీల్దారుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కళావతి ఆదేశాలిచ్చారు. రెండు రోజుల్లో రాళ్లవాగు సరిహద్దు భూమికి ట్రెంచ్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ఈ కొలతల్లో జిల్లా సర్వేయర్, డివిజన్ సర్వేయరు, అర్జీదారులు, ప్రైవేటు భూముల యజమానులు పాల్గొన్నారు.

చట్లమిట్ల పీఏసీఎస్ చైర్మన్‌గా వెన్నా



వెన్నా బోడిరెడ్డి

పెద్దారవీడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : చట్లమిట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా వెన్నా బోడిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో ప్రత్యేక చీఫ్ బి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా జి.సత్యనారాయణ రెడ్డి, ఉప్పలపాటి చిన్న శేషయ్యను నియమించారు. ఈ సందర్భంగా వెన్నా బోడిరెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో పీఏసీఎస్ చైర్మన్ పదవిని ఇచ్చినందుకు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఎంపీ మాగుంటకు కృతజ్ఞత లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



మాట్లాడుతున్న మలేరియా అధికారి రంగనాయకులు

పరిసరాల్లో నీటిని నిలువ ఉంచకూడదు

కంభం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇంటి పరిసరాలలో నీటిని నిలువ లేకుండా చూసుకోవాలని మలేరియా అధికారి రంగనాయకులు తెలిపారు. సోమవారం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ డెంగీ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డెంగీ రేబిస్ దోమ మనుషులను కుట్టడం వలన ఒకరి నుంచి మరొకరికి జ్వరం వస్తుందన్నారు. డెంగీ దోమ నీటిలో పెరుగుతుందన్నారు. ఇది పగటిపూట మాత్రమే కుడుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలని, దోమతెరలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో కంభం సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్ల : గ్రామాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. మండలంలోని అనుములపల్లి, జేపీ చెరువు గ్రామాల్లో పారిశుధ్య పనులను సో మవారం ఆయన పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు ఉద యం 6గంటలకు చెత్తబండ్లను తీసుకువెళ్లాలని, ప్రజలను మేల్కొలిపి తమ గృహాల్లో, గృహ పరిసరాల్లో చెత్తను సేకరించాలని ఆదేశించారు. ప్రజలు కూడా కార్మికులకు సహకరించాలని, గ్రామాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటేష్, అనుములపల్లి కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

రాచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఎల్ రామానాయక్ అన్నారు. రాచర్ల జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.15వేల విలువైన పోడియంను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పి శేఖర్, రమణారెడ్డి, పూర్వ విద్యార్థులు పి గోపాల్, ఎం వీరాంజనేయులు, కేశవ్, బ్రహ్మయ్య, చాంద్ బాషా, హసీనా, సంతోష్ కుమారి పాల్గొన్నారు.

టీబీ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రాచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : టీబీ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీబీ సూపర్‌వైజర్ రవీంద్రారెడ్డి అన్నారు. వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామ ప్రజలకు, ఫారం గురుకుల పాఠశాల బాలికలకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. మద్యం, ధూమపాన బాధితులు 60 ఏళ్లపైబడిన వారు టీబీపై అప్రమత్తంగా ఉండాలన్నారు. లక్షణాలు ఉన్నా, వ్యాధి సోకినా వెంటనే పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. ఉచిత చికిత్సతో పాటు నెలకు రూ.1000 పెన్షన్ కూడా ఇస్తుందన్నారు. వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ముత్యాల ప్రసాద్, స్టాఫ్ నర్స్ ఈ సత్యసుధ, సీహెచ్‌వోలు ఎస్.రామాంజనేయులు, బీ ప్రీతి, నారాయణమ్మ, శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మేరీకుమారి పాల్గొన్నారు.

యోగానంద్‌కు శుభాకాంక్షలు



అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న యోగానంద్

రాచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కటికె యోగానంద్ 48వ పుట్టినరోజు వేడుకలు సోమవారం రాచర్ల సనావుల్లా ఖాన్ గెస్ట్‌హౌస్‌లో అట్టహాసంగా జరిగాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేసి యోగానంద్ తన ఆనందాన్ని పంచుకున్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు పాల్గొని యోగానంద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

మాదిగ చర్మ డప్పు విజయవంతం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 11న తలపెట్టిన మాదిగ చర్మ డప్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ చర్మ డప్పు కళాకారుల పోరాట సమితి నాయకులు అన్నారు. కార్యాలయంలో పాస్టర్‌ఏలియా ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం



8వ వార్డులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. 8వవార్డులో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ముందుగా ఎమ్మెల్యే కందుల ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటలకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిపై కూడా నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని లూటీ చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకపోతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, మాలపాటి వెంకటరెడ్డి, పఠాన్ ఇబ్రహీం, మౌళాలి, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, చిన్ననాగిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దారవీడు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తోందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలో దేవరాజుగట్టు ఎస్సీ కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దోచుకోవడమే తప్ప అభివృద్ధి అనే మాటే లేదన్నారు. నాడు గ్రామాలకు వెళ్లాలంటే నరకయాతన పరిస్థితి నుంచి నేడు సుఖంగా ప్రయాణించేలా రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచి మెట్టు లక్ష్మీదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసుల రెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, నాయకులు ఆనెకాళ్ల శ్రీనివాసుల రెడ్డి, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు నక్కా శ్రీను, పాముల పోలురాజు, కోనంగి పాలంకయ్య, బూత్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



సారెను సమర్పిస్తున్న మహిళలు

అమ్మవార్లకు సారె సమర్పణ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ విజయ టాకీస్ వీధిలోని కనకదుర్గ సమేత మల్లికార్జున స్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సారెను సమర్పించారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయం, మార్కండేశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి, కాలేజీ రోడ్డులోని పోలేరమ్మ ఆలయాలలో సారె సమర్పించారు. కనకదుర్గ సమేత మల్లికార్జున స్వామి ఆలయాలలో అమ్మవారికి తొలి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

శివకోటేశ్వరరావుకు ఘనంగా వీడ్కోలు

రాచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పనితీరు, వాక్‌చాతుర్యంతో అందరి మన్ననలు పొందిన వ్యక్తి శివకోటేశ్వరరావు అని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వీ గిరిధర్‌శర్మ అన్నారు. రాచర్ల-1 ఎంఈవోగా విధులు నిర్వహిస్తూ వర్ధ్వారు మండలానికి బదిలీ అయిన శివకోటేశ్వరరావుకు ఉపాధ్యాయులు సోమవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ఆ యన మాట్లాడారు. అనంతరం ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఆయన స్థానంలో ఎంఈవో-1గా బాధ్యతలు స్వీకరించిన షేక్ మొయినుద్దీన్, గిరిధర్ శర్మను కూడా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిధర్‌శర్మ



అక్రమ ట్యాప్ కనెక్షన్‌లను తొలగిస్తున్న సిబ్బంది

అక్రమ ట్యాప్ కనెక్షన్‌లు క్రమబద్ధీకరించుకోవాలి

పొదిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్యాప్ కనెక్షన్లు అక్రమంగా కలిగిఉన్న వారు క్రమబద్ధీకరించుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ ఎఎఎల్ఎన్‌రెడ్డి సూచించారు. గతంలో పట్టణంలో పర్యటించి ఇంటిముందు, దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ట్యాప్ కనెక్షన్‌లను తొలగించాలని చెప్పినప్పటికీ స్పందన లేకపోవడంతో సోమవారం నగరపంచాయతీ సిబ్బంది ట్యాప్ కనెక్షన్‌లు తొలగించే కార్యక్రమాన్ని వెంకటేశ్వరస్వామి దేవాలయంకాలనీ, దర్శిరోడ్డులో చేపట్టారు. దీంతో ఇంటి, దుకాణ యజమానులు ట్యాపులకు డిపాజిట్ చెల్లించేందకు ముందకు వచ్చారని తెలిపారు. పురపాలక సంఘం ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలంటే ఇంటిపన్ను, నీటిపటన్ను లైసెన్స్ ఫీజు, ట్యాప్‌కనెక్షన్ క్రమబద్ధీకరణ ఫీజులు చెల్లించాలని కోరారు. అందరు సహకరించి పురపాలక అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆయన కోరారు.

మీకోసంకు అధికారులు హాజరయ్యేలా చూడండి

కంభం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం మీ కోసం కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు చెన్నకేశవరావు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఒంగోలులో మీ కోసంలో కలెక్టర్‌ను కలిసి కంభం తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే మీకోసం కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీవో, ఒకరిద్దరు అధికారులు తప్ప మిగిలిన ఏ శాఖ వారూ హాజరు కావడం లేదన్నారు. దీని వలన ప్రజాసమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కూలి పనులు మానుకుని వస్తున్న వారు అధికారులు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతునానరన్నారు. అధికారులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న అక్రమ కట్టడాలు

రాచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమించినా, ఆ భూముల్లో కట్టడాలు కట్టినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టడంతో సోమవారం ఆయన ఆకట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోసన్న మం దిరం పక్కనున్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి అక్రమకట్టడాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఆ మందిరం పక్కగా పొలాలకు వెళ్లేందుకు రస్తా ఉందని దానిని కూడా ఆక్రమించారని కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బొల్లెద్దుల సుశీలమ్మకు చెందిన పట్టా భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేసిందన్నారు. వారి ఫిర్యాదు మేరకు తాము విచారణ చేయగా ఆక్రమణలు అక్రమ కట్టడాలు కనిపిస్తున్నాయన్నారు. ఇలా చేయడం వలన నష్టమేకానీ ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాబట్టి ఆక్రమణదారులు పట్టా భూముల్లో, ప్రభుత్వ భూముల్లోఅక్రమ కట్టడాలు, ఆక్రమణలకు పూనుకున్నా చర్యలు తప్పవన్నారు.

మోకాళ్లపై నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

గిద్దలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు సోమవారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ గత సమ్మెకాలం ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు మస్తాన్‌రెడ్డి, మౌళాలి, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు నాగయ్య, పుల్లయ్య, సిఐటియు నాయకులు ఆవులయ్య పాల్గొని ప్రసంగించారు.

మార్కాపురం వన్‌టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం రెండో రోజుకు చేరింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎం రఫి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, సలాంఖాన్, చెన్నయ్య, శేఖర్‌రెడ్డి, రషీద్‌బాషా, యూసుఫ్ పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

బేస్తవారపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత మల్లాపురం గ్రామంలో మద్యం అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం రావడంతో కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తి వద్ద 15 మద్యం క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సింగరపల్లె గ్రామనికి చెందిన నారు పేరయ్య, అక్కపల్లెకు చెందిన గోవిందారెడ్డిని తహసీల్దార్ ముందు బైండవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పొదిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామ సమీపంలో సోమవారం ఆటోను మరో వాహనం ఢీకొట్టిన ఘటనలో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామం నుంచి పొదిలికి బేల్దారి పనులకు ఆటోలో వస్తుండగా, కనిగిరి నుంచి పొదిలి వైపు వస్తున్న వాహనం స్పీడు బ్రేకర్ వద్ద ఆటోను వెనుకవైపు ఢీకొట్టింది. గాయపడిన నలుగురికీ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సనందించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

మంగళగిరి ఏడీఏ శ్రీనివాసరావు

పొదిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సోమవారం మంగళగిరి వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా ఎరువుల దుకాణాల్లో సోదాలు చేపట్టారు. అనంతరం మంగళగిరివ్యవసాయ సంచాలకుడు టీ శ్రీనివాసరావు స్టాకును పరిశీలించి మాట్లాడారు. నకిలీ విత్తనాలను అమ్మినా, కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మినా చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సుభాని నెల్లూరు, జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ అసిసెంట్ రమేష్, ఏవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ముఖాముఖి

సబ్సిడీపై రైతులకు యంత్ర పరికరాలు

బి.ప్రసాదరావు, ఏవో, తాళ్లూరు



ప్రశ్న: వ్యవసాయ యాంత్రిక పథకం కింద ఏఏ పరికరాలు రైతులకు అందించారు?

జవాబు: రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, నాగళ్లు, గొర్రులు, స్ప్రింకర్లు, టార్పాలిన్ పట్టలు, పైపులులాంటివి సబ్సిడీపై అందజేశాం.

ప్ర: భూసార పరీక్షల ద్వారా రైతులకు జరిగే ప్రయోజనమేంటి?

జ: భూసార పరీక్షలు చేయించుకోవటంవల్ల భూమిలో ఎటువంటి ధాతులోపం ఉందో తెలుస్తుంది. దానిని బట్టి ఎంత మోతాదులో ఏయే ఎరువులను ఉపయోగించుకోవటం తెలుసుకొవటం వల్ల వ్యవసాయఖర్చులు తగ్గుతాయి.

ప్ర: పొలం పిలుస్తుంది కార్యక్రమం వల్ల రైతులకు ఏం ప్రయోజనం?

జ: వ్యవసాయశాఖ అనుసంధానమైన పలుశాఖల అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా గ్రామాల్లోకి వెళ్లి రైతులు సాగు చేసిన పంటలను నేరుగా పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. దీనిద్వారా రైతులు సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నది.

ప్ర: తాళ్లూరు మండలంలో ఏఏ పంటలు సాగు చేస్తారు?

జ: వరి, కంది, మొక్కజొన్న, మిరప, పొగాకు,సజ్జ, ఉద్యాన వనపంటలైన బత్తాయి, జామ, మామిడి, సీతాఫలం, కరివేపాకు సాగు చేస్తున్నారు.

ప్ర: జాతీయ ఆహార భద్రత కింద రైతులకు ఇస్తున్న సౌకర్యాలు ఏమిటి?

జ: రైతులకు విత్తనాలు సరఫరా చేసి నాటించి మంచి దిగుబడి నిచ్చే నాణ్యతగల విత్తనాలను తయారు చేయిస్తున్నాం.

యువకుడు ఆత్మహత్య

పామూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మండలంలోని వగ్గంపల్లికి చెందిన షేక్ రసూల్ (28) చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పామూరు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపిన వివరాలప్రకారం.. వగ్గంపల్లికి చెందిన షేక్ రసూల్ అనే యువకుడు కులాంతర వివాహం చేసుకొని పామూరులో నివాసం ఉంటున్నాడు. భార్యపై అనుమానం, మనస్పర్థలతో మండలంలోని రావిగుంటపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన రెండురోజుల క్రితం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పశువుల కాపరులు సోమవారం ఉదయం చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. వీఆర్వో గూడూరి గాబ్రియేల్ పోలీసులకు సమాచారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని పోస్టుమార్టం కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యాసామగ్రి అందజేత

సీఎస్‌పురం(పామూరు), జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సినాగులారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పూర్వ విద్యార్థి కోమటిగుంట్లకు చెందిన బెల్లంకొండ ఖాజామస్తాన్, నాగూర్‌బి దంపతులు నోటుపుస్తకాలు, జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయమని హెచ్‌ఎం బి.డేవిడ్ అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయాలి

కనిగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): లోగ్రేడ్ పొగాకును కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుసంఘం నాయకుడు పిల్లి తిప్పారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డీటీ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వేలం కేంద్రాలలో నెంబర్ పొగాకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతుల వద్ద ఎక్కువ మొత్తంలో ఉన్న లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయటం లేదన్నారు. కార్యక్రమంలో రవీంద్రారెడ్డి, బ్రహ్మయ్య, మాలపాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు లావాదేవీల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 14(ఆంధ్రజ్యోతి): వెలుగు లావాదేవీల నిర్వహణలో మండల సమాఖ్య నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని సీఆర్పీ పి.మోబినా తెలిపారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం సీఎస్‌పురం, పామూరు, కనిగిరి మండలాల సిబ్బంది, సీఎస్‌పురం మండలం వీవోఏలకు రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈశిక్షణలో సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల లావాదేవిలు ఎలా నమోదు చేయాలి, నమోదు చేసే సమయంలో ఎదురై ఇబ్బందుల గురించి శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో జి.ఈశ్వరి, ఏపీఎంలు ఎం.లక్ష్మీనారాయణ, జి.విద్యాసాగర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి
- మంత్రులు గొట్టిపాటి, స్వామి



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన మంత్రి స్వామి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తదితరులు

కనిగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. కుటుంబ సాధికార సభ్యులు (కేఎస్ఎస్) కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం కెఎస్ఎస్ సభ్యులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏడాదిలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో కుటుంబంలో ఎంత మంది ఉన్నా అందరికి తల్లికి వందనం ఇచ్చామన్నారు. ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నట్టు చెప్పారు. గత ఐదేళ్లు విధ్వంసపాలన సాగించిన జగన్ మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారాలు రేపుతున్నారన్నారు. ఆయనను అధికారం కోల్పోయేలా చేసిన ప్రజలను ఇబ్బందులకు గురిచేసేందుకు పన్నాగం పన్నారన్నారు. ప్రతి చోట ఏదొక రూపంలో అలజడులు, కుల మతాల మధ్య చిచ్చులను సృష్టించి రాష్ట్రంలో భయోత్పాతాన్ని సృష్టించేందుకు పూనుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీకి రాకుండా ఇంట్లో నిద్రపోతున్నారని ఎద్దేవా చేశారు. బ్లాక్‌బర్లీ పొగాకును కొనుగోలు చేసిన రాష్ట్రం దేశంలో ఎక్కడైనా ఉంది అంటే అది మన రా ష్ట్రమేనని చెప్పారు. కనిగిరిలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటుకు మంత్రి లోకేష్ చర్యలు తీసుకున్నారన్నారు. త్వరలో ప్లాంట్‌ల నిర్మాణం ప్రారంభం కాబోతున్నాయన్నారు. ఏడాది కాలంలోనే రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేసిన కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విరివిగా ప్రచారం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పార్టీలో కేఎస్ఎస్ సభ్యులకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఇకనుంచి గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కేఎస్ఎస్‌ల పాత్ర పార్టీలో కీలకం కానుందన్నారు.

సమావేశంలో నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), వేమూరి రామయ్య, పువ్వాడి వెంకటేశ్వర్లు, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, భేరి పుల్లారెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య నివారణకు కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- కల్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



విద్యుత్ సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు రవికుమార్, స్వామి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి తదితరులు

కురిచేడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): లోవోల్టేజీ సమస్య నివారణకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. మండలంలోని కల్లూరు గ్రామంలో రూ.3.80 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సోమవారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో కలసి శంకుస్థాపన చేశారు. కల్లూరు గ్రామానికి చెందిన పోలెబోయిన సుబ్రహమణ్యం 30 సెంట్ల స్థలాన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందజేయగా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లోటల్టేజీ సమస్య రాకూడదన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాలలో గృహాలకు సైతం త్రీఫేజ్ లైన్లు తీసుకువస్తున్నామన్నారు. 33/11కేవీ సబ్ స్టేషన్‌తో పరిసర గ్రామాలకు లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. ఐదే నెలల్లో నిర్మాణం పూర్తిచేసి లోవోల్టేజీ సమస్య తీరుస్తామన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడ్డాక రాష్ట్రంలో 70 వేలకు పైగా కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్టు చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇళ్లపై సౌర పలకలు ఏర్పాటుచేసుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. సౌర విద్యుత్ ద్వారా సరఫరాలో నష్టాలను నివారించి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కురిచేడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కురిచేడు నుంచి నమశ్శివాయపురం, పెద్దవరం, దేకనకొండ గ్రామాల మీదుగా మర్లపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి సోమవారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీవీరాంజనేయ స్వామి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో కలసి శంకుస్థాపన చేశారు. గుంతలమయంగా ఉన్న మార్గంలో రోడ్డు నిర్మాణం చేయాలని గత ప్రభుత్వంలో పలుమార్లు ప్రజలు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. కూటమి ప్రభుత్వం రాగానే నిధులు సమకూర్చి రోడ్డు నిర్మాణానికి పూనుకోవడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కురిచేడు నుంచి త్రిపురాంతకం వెళ్లడానికి గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని మండల వాసులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొల్లేపల్లి ఆదినారాయణ, కలువకొలను చంద్రశేఖర్, నెమిలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

కురిచేడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులమంద గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గజమాల వేసి నివాళులర్పించారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి కల్లూరు వెళ్తూ మధ్యలో ఉన్న ఆవులమంద గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ నీటి సంఘం అధ్యక్షుడు గొట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ పదవిపై ఊహాగానాలకు తెర

- దర్శి చైర్‌పర్సన్‌గా నాగవేణి బాధ్యతల స్వీకరణ



ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన దారం నాగవేణిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు

దర్శి, జూలై 14(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ చైర్మన్ పదవిపై మూడురోజులుగా నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. చైర్‌పర్సన్‌గా నాగవేణి సోమవారం బాధ్యతలు స్వీకరించడంతో వివాదాలకు ఫుల్‌స్టాప్ పడింది. సుమారు మూడు నెలల క్రితమే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా దారం నాగవేణి పేరును అధిష్ఠానానికి పంపారు. ఈమేరకు అధిష్ఠానం ఆమె పేరును ఖరారు చేస్తూ జాబితాను విడుదల చేసింది. వైస్‌చైర్మన్, కమిటీ సభ్యులు పేర్లను కూడా ఖరారు చేశారు.

ఊహించని విధంగా నాలుగురోజుల క్రితం రిజర్వేషన్లల్లో మార్పు జరిగిందని ఊహాగానాలు చెలరేగాయి. దర్శి ఏఎంసీ చైర్మన్ ఎస్సీ జనరల్‌కు కేటాయించారనే వార్తలు బయటకు వచ్చాయి. ఈలోపు బీజేపీకి చెందిన మాదమాకుల హనుమాయమ్మను చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసినట్లు ఊహగానాలు వినిపించాయి. ఉత్తర్వులు కూడా వెలువడ్డాయని మాధ్యమాలో వార్తలు హల్‌చల్ చేశాయి. జరుగుతున్న పరిణామాలను గ్రహించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెంటనే స్పందించి టీడీపీ అధిష్ఠానంతో పాటు పలువురు మంత్రులతో చర్చించారు. గతంలోనే దారం నాగవేణి పేరు ఖరారైందని, అధిష్ఠానం ఆమోదం తెలిపిందని వివరించారు. ఇప్పుడు ఏమైనా మార్పులు జరిగితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, క్యాడర్ అయోమయంలో పడుతుందని స్పష్టం చేశారు. అధిష్ఠానం పూర్తి సమాచారం తీసుకొని గతంలో ఖరారు చేసిన దారం నాగవేణి పేరును ఖరారు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మార్కెటింగ్ శాఖ ద్వారా ఉత్తర్వులు రావటంతో ఊహగానాలకు తెరపడింది. దారం నాగవేణి వెంటనే బాధ్యతలు చేపట్టడంతో టీడీపీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

దారం బాధ్యతల స్వీకరణ

దర్శి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా దారం నాగవేణి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్‌యార్డు కార్యదర్శి మస్తాన్‌రావు ఆమె చేత పత్రాలపై సంతకాలు చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తనకు పదవి కట్టబెట్టిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఒక మహిళకు ఏఎంసీ చైర్‌పర్సన్ పదవి కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, దర్శి సొసైటీ మాజీచైర్మన్ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ నూతన కార్యవర్గం

దర్శి ఏఎంసీ నూతన కార్యవర్గాన్ని ఖరారు చేస్తూ మార్కెటింగ్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. చైర్‌పర్సన్‌గా దారం నాగవేణి, వైస్‌చైర్మన్‌గా కోడెగం మస్తాన్‌రావు, సభ్యులుగా మాడపాకుల నారాయణమ్మ, బొడ్డు నాగేంద్రం, నల్లపాటి సత్యనారాయణ, పాలిపాటి బోడమ్మ, కనుమాల సుధారాణి, కేసనపల్లి శివయ్య, మేడా వెంకటశేషయ్య, ఎం.బాలునాయక్, షేక్ ఖాశీం సయ్యద్, శృంగారపు నాగసుబ్బారెడ్డి, వేముల శివకుమారి, కల్లా వెంకటేశ్వర్లు, మందాడి భారతి, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి పీఏఎస్ అధ్యక్షుడు, దర్శి ఏడీఏ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఉంటారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

కురిచేడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మరుగదొడ్లను పరిశీలించి అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు బయట కూర్చొని ఉంటే వారితో మాట్లాడారు. తల్లికి వందనం డబ్బులు పడ్డాయా అని అడిగారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి



ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

ఏడాదిలో ఎంతో చేశాం!

కనిగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఏడాదిగా ప్రజలకు సుపరిపాలన అందించామని డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అందుకు కనిగిరిలో జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని కాశిరెడ్డి కాలనీలో సోమవారం సాయంత్రం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి ఎమ్మెల్యే తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శివారు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

తాగునీరు, విద్యుత్, రోడ్లు, సైడు కాల్వలు, ఇంటి నివేశ స్థలాలు, గృహనిర్మాణాలు వంటి వాటిపై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కనిగిరిలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, షేక్ ఫిరోజ్, బుల్లా బాలబాబు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా ఉప్పలపాటి, చెరుకుపల్లి నియామకం



ఉప్పలపాటి హరిబాబు



చెరుకుపల్లి వెంకటరెడ్డి

పామూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా ఉప్పలపాటి హరిబాబు, చెరుకుపల్లి వెంకటరెడ్డి నియమితులయ్యారు. పామూరు సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జ్‌గా తెలుగు యువత మండల అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబును నియామకం చేశారు. సభ్యులుగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీముల్లా నియమితులయ్యారు. సీఎస్‌పురం సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఉప్పలపాడు గ్రామానికిచెందిన తెలుగు యువత సీఎస్‌పురం మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి వెంకట్ రెడ్డి నియామకమయ్యారు. సభ్యులుగా తోట నారాయణ, దెవేండ్ల నాగరాజు నియమిస్తూ ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది. హరిబాబు, వెంకటరెడ్డిలను ఎంపిక చేయడం పట్ల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీసీపల్లికి ఈశ్వరయ్య



పరమి ఈశ్వరయ్య

పీసీపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా వెంగళాపురం గ్రామానికి చెందిన పరిమి ఈశ్వరయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన మండలంలోని వెంగళాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు. సభ్యులుగా వితలాపురం గ్రామానికి చెందిన ఉండేల పిచ్చిరెడ్డి, గుదేవారిపాలెం గ్రామానికి చెందిన దింటకుర్తి సుబ్రహ్మణ్యంను ప్రభుత్వం నియమించింది.

పసుపుగల్లుకు శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డి

ముండ్లమూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏఎస్ఎస్) చైర్మన్‌గా ఆగ్రామానికి చెందిన పందుగుల శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి సోమవారం సాయంత్రం నియామక ఉత్తర్వులు అందాయి. సభ్యులుగా పులిపాడుకు చెందిన ఏరేసి వెంకటేశ్వరరెడ్డి, కమ్మవారిపాలెంకు చెందిన నాగినేని నాగేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు అందాయి.

దోమల వ్యాప్తే డెంగ్యూకు కారణం



డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు మంజుల, రామాంజనేయులు

పీసీపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): దోమల వ్యాప్తితోనే డెంగ్యూ వ్యాధి వస్తుందని పీసీపల్లి వైద్యాధికారిణి డాక్టర్ మంజుల, మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామాంజనేయులు అన్నారు. మండలంలోని పెదయిర్లపాడు, గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలను సోమవారం సందర్శించి విద్యార్థులకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, కండరాల నొప్పి, చర్మంపై ఎర్రటి దద్దుర్లు, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేయించడం ద్వారా వ్యాధిని నిర్ధారణ చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పామూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని 297వ బూత్ ఇన్‌చార్జ్ కమ్మ బాలకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి సూచనలతో కంభాలదిన్ను గ్రామ పంచాయతి పరిధిలోని రేణిమడుగు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి కరపత్రాలు అందజేసి ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బక్కా రమేష్, అత్యాల యాలయ్య పాలొగ్గన్నారు.

కంబాలదిన్నె గ్రామంలో 290 బూత్ ఇన్‌చార్జ్ ఏలూరి నరసింహారావు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓరుగంటి సుబ్బమ్మ, అడుసుమల్లి రమణయ్య, గుత్తా వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు. పామూరు పట్టణంలోని 266బూత్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో షేక్ హజీగౌస్, సయ్యద్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండలం వీబైలు గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు.

డెయిరీ యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గేదెల షెడ్‌ల వద్ద పని చేసేందుకు ఇతరరాష్ట్రాల నుంచి జీవనం కోసం అధికంగా వస్తున్నారని ఎస్ఐ ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. వారి పట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం పాడిపరిశ్రమ యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈప్రాంతంలో జీవనం సాగిస్తున్న వలస కూలీలకు మత్తు పదార్థాలు, గంజాయి వల్ల జరుగుతున్న అనర్థాల గురించి వివరించాలన్నారు. గ్రామాల్లో వివాదాలు రాకుండా చూడాలన్నారు. వలస కార్మికులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గేదెల షెడ్ల కార్మికులుగా పనిచేస్తూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే పాడిపరిశ్రమ యజమానులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

స్వామి ఆరాధనకు విరాళం

సీఎస్‌పురం(పామూరు), జూలై 14(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఈనెల 17న జరిగే ఆరాధన మహోత్సవాలకు ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సౌజన్యంతో వడ్లమూడి నాగేంద్రబాబు, శిరీష దంపతులు లక్షా నూట పదహారు రూపాయల విరాళం దేవస్థానం ఈవో నరసింహబాబుకు సోమవారం అందజేశారు.

అనంతరం దేవస్థానంలో దారపనేని, వడ్లమూడిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణస్వామి చిత్రపటాలను, తీర్థప్రసాదాలను దాతలకు ఈవో అందజేశారు. దాతలు ఇచ్చిన విరాళంలో విద్యుత్ అలంకరణ, గర్భగుడిలో పుష్పాలంకరణ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, మాజీ సర్పంచ్ చావా సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.





బాపట్లలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయాధికారులు



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

కుప్పడం చీరకు అవార్డు

u కేంద్రమంత్రి చేతుల మీదుగా అందుకున్న బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల సిల్క్ కుప్పడం చీరకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఢిల్లీ భారత్ మండపంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిం చిన అవార్డుల ప్రధానోత్సవంలో బాపట్ల కలెక్టర్ వెంకటమురళి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. ఒక జిల్లా - ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కార్యక్రమంలో భాగంగా చీరాలకు అరుదైన ఘనత దక్కడంతో ఈ ప్రాంత నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చీరాల చేనేతలు దేశ చరిత్రలోనే ప్రత్యేక స్థానం దక్కించుకుని జిల్లాకు కీర్తిని సాధించారని చెప్పారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర జౌళిశాఖ మంత్రి సవిత ఉన్నారు.

32 సొసైటీలకు..

త్రిసభ్య కమిటీలు

ఇటీవలే 50 సహకార సంఘాలకు నియామకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలుగా త్రిసభ్య కమిటీల నియామకం దాదాపుగా కొలిక్కి వచ్చింది. ఈ నెల 8న జిల్లాలో 50 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం సోమవారం మరో 32 సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకంపై ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో మొత్తం 112 సహకార సంఘాలు ఉండగా ఇప్పట వరకు 82 సొసైటీలకు నియామకం పూర్తయింది. ఒక్కో సహకార సంఘానికి చైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు సభ్యులను ప్రభుత్వం నియమించింది. సహకార సంఘాలను వైసీపీ ప్రభుత్వం దాదాపుగా నీర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. దానిలో భాగంగానే ఇప్పటికే రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసింది. ఖాతాల్లో అవకతవకలపై దృషిపెట్టి నోటీసులు జారీ చేసి.. వివరణ కోరుతున్నారు. ప్రస్తుతం త్రిసభ్య కమిటీలు కూడా కొలువుదీరనుండడంతో సహకార సంఘాల పాలన పూర్తి స్థాయిలో గాడిన పడనుంది.

పల్లెకు ఉపాధి పండగ

v ఉపాధి హామీ పథకం కింద రూ.28 కోట్లు నిధులు విడుదల

v 'గోకులం షెడ్లు' రైతుల ఖాతాల్లో నగదు జమ

v గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులకూ మోక్షం



కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పల్లెకు 'ఉపాధి' పండగొచ్చింది. నిధుల వరదతో గ్రామీణ ప్రగతి ఊపందుకోనుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో.. కాంట్రాక్టర్ల కష్టాలు తీరనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి పనులు చేసి.. వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టడంతో బిల్లుల రాక ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్న వారికి కూడా ఊరట లభించింది. గతేడాది ఆగస్టు 23న గ్రామ సభలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికి కొనసాగింపుగా అక్టోబరు 14 నుంచి 21వ తేదీ వరకు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధి హామీ పథకం అనుసంధాన నిధులతో పల్లెల్లో రహదారులు, మురుగు కాల్వల పనులు అక్టోబరు చివరి నుంచే ప్రారంభమయ్యాయి. సమాంతరంగా గ్రామాల్లో రైతులు రాయితీపై గోకులం షెడ్లు నిర్మించుకున్నారు. తొలి విడత పనులకు డిసెంబరులో బిల్లులు చెల్లించిన ప్రభుత్వం.. ఆ తర్వాత కొంతమేర జాప్యం జరుగుతూ రావడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు దాదాపు ఆరు నెలల నుంచి డబ్బులు కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు రూ.28 కోట్ల నిధులు విడుదల కావడంతో పాటు ఇప్పటికే రూ.20 కోట్లు వరకు లబ్ధిదా రుల ఖాతాల్లో జమ అయినట్లు అధికారులు చెబుతు న్నారు. దీంతో బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్న పల్లె పనులు ఇకపై ఊపందుకోనుండడంతో పల్లెకు నిధుల పండగ వచ్చిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మొత్తం పనులు 646

ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో జిల్లాలో చేపట్టిన మొత్తం పనులు 646 కాగా.. వీటి విలువ రూ.92 కోట్లుగా అధికారులు లెక్కగట్టారు. వీటికి సంబంధించి 25 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలినవి జరుగుతున్నాయి. సీసీ, బీటీ రోడ్లతో పాటు మురుగు కాల్వల నిర్మాణాలు కూడా ఈ పనుల్లో ఉన్నాయి. ఈ పనులతో పాటు రైతులకు రాయితీపై గోకులం షెడ్ల నిర్మాణం కూడా పెద్ద ఎత్తున ప్రభుత్వం చేపట్టింది. జిల్లాలో 580 వరకు షెడ్ల నిర్మాణాలను రైతులు చేపట్టారు. వీటి నిర్మాణం పూర్తయి నాలుగు నెలలు కావొస్తుండగా, నిధులను కూడా ప్రభు త్వం విడుదల చేసింది.

రూ.28 కోట్లు నిధులు విడుదల

ప్రభుత్వం విడుదల చేసిన రూ.28కోట్లలో రూ.19 కోట్లు రహదారులు, ప్రహరీలు, మురుగు కాల్వల నిర్మాణానికి సంబంధించి నవి. రూ.6 కోట్లు గోకులం షెడ్ల లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఇదిలా ఉంటే 2014-19 మధ్య చేపట్టిన పనులు కాంట్రాక్టర్లకి కూడా ప్రస్తుతం ఊరట లభించింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో గత పాలకులు బకాయి ఉంచిన రూ.3 కోట్లు నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రూ.80 లక్షలకు సాంకేతిక చిక్కులు

మొత్తం విడుదలైన రూ.28 కోట్లలో దాదాపు రూ.20 కోట్లు ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని, త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబు తున్నారు. ఇక రూ.80 లక్షల నిధుల జమకు సంబంధించి కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయని వాటి పరిష్కారంపై కూడా దృష్టి సారించినట్లు యంత్రాం గం చెబుతోంది. ఆయా బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు మారడం, గతంలో ఇచ్చిన ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడం వంటి కారణాలతో నిధులు విడుదల చేసినా తిరస్కరణ అయినట్లు తెలిపారు. త్వరలోనే వారి ఖాతాల్లో కూడా నిధులు జమ చేయడానికి కసరత్తు జరుగుతోంది.

ఈ ఏడాది చివరి నాటికి

గ్రామ సభలతో పాటు పల్లె పండుగ సమావేశాల వేదికపై గ్రామస్థులు ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించే దిశగా కార్యాచరణ రూపొందించుకుని అడుగులేసేలా ఆయా విభాగాలకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. ఈ ఏడాది చివరి నాటికి పల్లెల్లో మౌలిక వసతుల సమస్య అనే మాటే ఉండ కూడదనేది ప్రభు త్వ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగు ణంగానే ఆయా నియోజకవర్గాల్లో తయారు చేయ బోయే విజన్ ప్రణాళికల్లో కూడా ఉపాధి హామీ పను ల అనుసంధానంతో పూర్తయ్యే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం అడుగులేస్తోంది.

ఎరువు దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

u రూ. 27.41 లక్షల బయో ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేత

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ రోడ్డులో ఉన్న పద్మావతి ఫర్టిలైజర్ అండ్ జనరల్‌గూడ్స్‌లో జీ2, జీ3 సర్టిఫికెట్లు లేని బయో ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే విక్రయాలు నిలిపివేయాలని తనిఖీ అధికారి ఎం.శ్రీనివాసరావు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్ ఆదేశించారు. అనుమతులు లేకుండా విక్రయించిన, అధిక ధరకు విక్రయాలు జరిపిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూనికలు, కొలతల విషయంలో తేడా ఉన్నట్లు గుర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.ధనరాజు, వ్యవసాయాధికారులు కె.శారద, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కర్లపాలెం, అమర్తలూరు మండలాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

అంతర సాగుతో పత్తిలో నష్ట నివారణ

ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త వెంకట రాములు

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఎక్కు వగా సాగయ్యే పత్తి పంటలో నష్టాల నివారణకు అంతర పంటల సాగు చక్కని పరిష్కారం అని లాం ఫాం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు తెలిపారు. ప్రతికూల వాతావ రణ పరిస్థితులు పత్తి పంటను తీవ్రంగా దెబ్బతీస్తాయని, తద్వారా రైతులు నష్టాల్లోకి వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటువంటి పరిస్థితులు ఎదుర్కోవాలంటే అంతర పంటల సాగు మాత్రమే మంచి పరిష్కారం అని పేర్కొన్నారు. పత్తిలో పప్పు జాతి పంటలను సాగు చేస్తే నేలలో సారం పెరిగి ప్రధాన పంట పెరుగుదలలో దోహ దపడుతుందని అన్నారు. ఈ అంతర పంటలు చీడపీడలను ఆకర్షించి ప్రధాన పంటకు నష్టం వాటిల్లకుండా కాపాడతాయని తెలిపారు.

కనుమరుగైపోతున్న కళాక్షేత్రం..!

కార్యాలయాలుగా మార్చిన వైసీపీ ప్రభుత్వం

అద్దెలూ చెల్లించని వైనం..

ఆదాయం కోల్పోతున్న పురపాలక సంఘం



బాపట్ల పట్టణంలోని నారాచంద్రబాబు నాయుడు మున్సిపల్ కళాక్షేత్రం

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న జనాభా.. తగ్గుతున్న ఆదాయ వనరులతో పురపాలక సంఘం అభివృద్ధి నత్తనడకలా మారింది. ఓవైపు పురపాలక సంఘ ఎన్నికలు జరగక.. ఆర్థిక సంఘ నిధులు రాక అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. ఆదాయం వచ్చే వనరులు కాస్త వైసీపీ పాలనలో దెబ్బతిన్నాయి. దీనికి పట్టణ నడిబొడ్డున ఉన్న నారా చంద్రబాబు నాయుడు మున్సిపల్ కళాక్షేత్రం దర్పణం పడుతుంది. 2002లో బాపట్ల మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో కొంత భాగాన్ని తీసుకొని అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేరు మీద కళాక్షేత్రం నిర్మించారు. అప్పటి ఎంపీ దగ్గుబాటి రామానాయుడు, ఎమ్మెల్యే మంతెన అనంత వర్మ సహకారంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తి చేశారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు వివాహం, ఇతర శుభ కార్యాలయాలు జరుపుకునేందుకు తక్కువ అద్దెకు దీనిని కేటాయించే వారు. బాపట్ల పాత బస్టాండ్ కూడలిలో ఉన్న ఈ కళాక్షేత్రానికి మంచి ఆదరణ లభించింది. ఎన్నో వేడుకలు ఇక్కడ జరిగాయి. కళాక్షేత్రాన్ని వేలం ద్వారా కాంట్రాక్టర్‌లకు ఇచ్చేవారు. దీని ద్వారా పురపాలక సంఘానికి ఆదాయం వచ్చేది. అనంతరం నిర్వహణను పురపాలక సంఘం తీసుకోవడం.. మళ్లీ లీజుకు ఇవ్వడం ఇలా జరుగుతూ వస్తోంది.

కళాక్షేత్రం..కార్యాలయమైంది..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజాప్రయోజనాల దృష్ట్యా తక్కువ అద్దెకు ఇచ్చేందుకు నిర్మించిన నానా చంద్రబాబునాయుడు కళాక్షేత్రం వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. మండలపరిషత్ కార్యాలయం నూతన భవనం నిర్మిస్తామని తొలిగించి అక్కడ విధులు నిర్వహించే వారందరికి కళాక్షేత్రంలోని పై అంతస్తు ఇచ్చారు. అదేవిధంగా జిల్లా కేంద్రమైందంటూ పంచాయతీరాజ్‌శాఖాధికారులకు గ్రౌండ్ ఫ్లోర్ ఇచ్చారు. దీంతో కళాక్షేత్రం కాస్త కార్యాలయంగా మారిపోయింది. అయితే మండల పరిషత్ కార్యాలయం నూతన భవనం నిర్మించేందుకు ఎవరు ముందుకు రాలేదు. కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యాలయాలు ఖాళీగా చేయటం లేదు. పురపాలక సంఘానికి అద్దె కూడా చెల్లించటం లేదు. దీని వల్ల అటు పురపాలక సంఘం ఆదాయం కోల్పోవడమే కాకుండా ఇటు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలవారు తక్కువ ఖర్చుతో శుభ కార్యాలయాలు చేసుకునేందుకు కల్యాణ మండపాలు అందుబాటులో లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కళాక్షేత్రంలో వేడుక చేసుకుంటే మొత్తం రూ.30 వేలు అద్దె ఇతర ఖర్చులతో ముగించేవారమని.. ఇప్పుడు బయట పుట్టగొడుగులా విస్తరించిన కల్యాణ మండపంలో ఒక్కరోజు అద్దె రూ.30వేల నుంచి లక్ష రూపాయల వరకు ఉంటుందని దీనికి అదనంగా కరెంట్ బిల్లు, వంటసామాను ఇతర ఖర్చులు ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి కళాక్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కళాక్షేత్రం ప్రాంగణంలో పిచ్చిమొక్కలు

1 జూన్‌లోనే

1 ఇస్తామని ప్రకటన.. నిధుల విడుదల 1 పలుమార్లు

వాయిదా పడిన పంపిణీ - ఆవేదనలో లబ్ధిదారులు

ఇచ్చే తీరిక లేక..!

వెనక్కి వెళ్లిపోయిన స్పౌజ్ పింఛన్ల నగదు

చేతికందిన ఫలం నోటి దాకా రావడం లేదన్న చందంగా మారింది భాగస్వామ్య పింఛనుదారుల(స్పౌజ్) పరిస్థితి. స్పౌజ్ పింఛన్లకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో భాగస్వామి దూరమైనా.. ప్రభుత్వం నుంచి ఒక భరోసా ఉందని పండుటాకులకు దీమా లభించింది. అయితే ఆచరణలో లబ్ధిదారులకు ఇంకా ఊరట దక్కలేదు. పింఛను మంజూరై రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు వారికి నగదు జమ కాలేదు. వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోతూనే ఉన్నాయి.

అమృతలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటాలో ఎంపికైనవారికి తొలుత జూన్ 1న పింఛను అందజేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటైన జూన్ 12వ తేదీకి పంపిణీని వాయిదా వేసింది. అందు కోసం రూ.3.32 కోట్లు అధికారుల ఖాతాల్లోకి జమయ్యాయి. అయితే అదే రోజున ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పింఛన్ల పంపిణీ మరో మారు నిరవధికంగా వాయిదా పడింది. ఎప్పు డు పంపిణీ చేస్తారనే విషయం చెప్పకుండానే వాయిదా వేయడంతో సందిగ్ధం నెల కొంది. అలా జూన్ నెల మొత్తం గడి చిపోవడంతో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నిధులను తిరిగి జమ చే యాలని ఆదేశించారు. దీంతో నిధుల న్ని తిరుగు టపాలో వెనక్కి వెళ్లిపో యాయి. దీంతో జూలైలోనైనా పింఛన్లు అందుతాయనుకున్న లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. ఈ నెలలో ఇప్పటికి 14 రోజులు గడిచిపోయినా.. పింఛన్ల పంపిణీ మాత్రం జరగలేదు. దీంతో మళ్లీ కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు నగదు తిరిగి వెనక్కి పంపాలని ఆదేశాలు వచ్చాయి. ఫలితంగా ఈ నెల పింఛను నగదు కూడా తిరిగి వెనక్కి వెళ్లిపోతోంది. అయితే ఇలా వెనక్కి వెళ్లిన పింఛను మొత్తాన్ని తిరిగి ఒకేసారి అందజేస్తారా? లేక పథకం అమలులోకి రాలేదు కాబట్టి ఈ రెండు నెలలది మినహా యించి ఒక నెల పింఛనుతోనే సరిపెడతారా? అన్న ఆందోళన లబ్ధిదారులను వెంటాడుతోంది.


● మూడు జిల్లాల్లో 8,304 మందికి..

కూటమి ప్రభుత్వం 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ మధ్య కాలంలో మృతి చెందిన పింఛన్‌దారుల జీవిత భాగస్వాములకు వారి పింఛను పొందే అవకాశాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో కల్పించింది. మే నెలాఖరుకల్లా అర్హులను ఎంపిక చేసి వారికి జూన్ నెల నుంచి పింఛను అందజేస్తామని ప్రకటించింది. దీంతో భాగస్వామి కోటాలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 8,304 మందికి పింఛను పొందే అవకాశం లభించింది. గుంటూరు జిల్లా నుంచి 2,565, బాపట్ల నుంచి 2,715, పల్నాడు నుంచి అత్యధికంగా 3,094 మంది స్పౌజ్ కోటాలో కొత్తగా పింఛను పొందారు.

కారణాలేంటి..?

పింఛను పంపిణీ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం, భాగస్వామ్య పార్టీలు అట్టహాసంగా నిర్వహించాలని భావించాయి. అయితే వివిధ కారణాలతో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులకు అందుకు అవకాశం లభించలేదని తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు అందరూ సుపరిపాలన కార్యక్ర మంలో తీరిక లేకుండా ఉండడంతో ఈ కార్యక్రమం మరుగున పడిపోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఈ జాప్యం కారణంగా లబ్ధిదారులకు మాత్రం తీవ్ర నష్టం వాటిల్లింది.





అనమనమూరు సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ అంతర్భాగంలో ఉన్న చేపల చెరువులు (ఫైల్ ఫొటో)

రిజర్వాయర్ ముంపు ప్రాంతంలో యథేచ్ఛగా చేపల చెరువులు

చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాల వినియోగం..

కలుషిత నీరు మళ్లీ రిజర్వాయర్‌లోకి

ఒంగోలు నగరం, ఐదు మండలాలకు ఇదే తాగునీరు

విషతుల్యం.. గుండ్లకమ్మ

అద్దంకి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ కలుషితమవుతోంది. ప్రాజెక్ట్ ముంపు కింద భూములకు పరిహారం పొందిన కొందరు.. వాటిని చేపల చెరువులుగా మార్చారు. చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆ నీటిని రిజర్వాయర్‌లోకి వదులుతు న్నారు. దీంతో రిజర్వాయర్ నీరు పూర్తిగా కలుషితమయ్యే ప్రమాదం ఏర్పడింది. రిజర్వాయర్ నీటిని ఒంగోలు నగరంతో పాటు కొరిశపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, పంగులూరు, అద్దంకి మండలాల్లోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో కలుషిత నీటినే ప్రజలు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. అద్దంకి మండలంలోని మోదేపల్లి, తిమ్మారెడ్డిపాలెం, ధేనువకొండ, మణికేశ్వరం, కొరిశపాడు మండలం అనమనమూరుల వద్ద గుండ్లకమ్మ రిజర్వా యర్ పరిధిలో ఉన్న భూములలో సుమారు ఐదారు వందల ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలు జరిగాయి. ప్రస్తుతం మరి కొంతమంది కొత్తగా చేపల చెరువులు తవ్వకాలు చేస్తునే ఉన్నారు. చెరువుల తవ్వకాలు జరుగుతున్నా రిజర్వాయర్ అధికారులు మిన్నకుండటంతో ఏటికేడు పెరిగిపోతున్నాయి. చేపల చెరువులను కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన జాలర్లు లీజుకు తీసుకొని చేపల పెంపకం చేస్తున్నారు. నీటి కలుషిత కారణంగా.. గత నెలలో ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో నీరు రంగు మారి సరఫరా అయ్యాయి. ఇది గమనించిన అధికారులు పరిశీలన చేయగా చేపల చెరువుల నుంచి కలుషిత నీరు రిజర్వాయర్‌లోకి వదులుతుండటం గుర్తించారు. దీనిపై నివేదిక తయారు చేసి బాపట్ల జిల్లా అధికారులకు పంపారు. ఈ నివేదిక పై ఇంత వరకు చర్యలు లేకపోవ డంతో చేపల చెరువుల నిర్వాహకులు మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పం దించి కఠిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. మిన్నకుంటే కలుషిత నీటిని వినియోగించి ప్రజలు రోగాలు బారిన పడే ప్రమాదం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు.



తిమ్మారెడ్డిపాలెం సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాంతంలో ఉన్న చేపల చెరువులు

కత్తితో వ్యక్తిపై దాడి

మేదరమెట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): కత్తితో ఒక వ్యక్తి మరొక వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నం చేసిన ఘటన సోమవారం కొరిశపాడు మండలంలోని రాచపూడి గ్రామంలో చోటుచేసుకొంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు రాచపూడి గ్రామానికి చెందిన మేడ మధుసుధనరావు ఆదివారం మద్యంమత్తులో ఇంటి సమీపంలో అసభ్యకరంగా మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముప్పనేని పూర్ణచంద్రరావు మధుసుధనరావును వారించబోగా గొడవ జరిగింది. దీంతో ఈ విషయాన్ని మధుసుధనరావు చెన్నైలో ఉంటున్న తన కుమారుడు కార్తీక్‌కు చెప్పాడు. కార్తీక్ చెన్నై నుంచి వస్తూనే కత్తి కొనుగోలు చేసి గ్రామానికి వచ్చాడు. సోమవారం ఉదయం సెంటర్‌లో ఉన్న పూర్ణచంద్రరావుతో తండ్రి కొడుకులు గొడవ పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే కార్తీక్ తన వద్ద ఉన్న కత్తితో పూర్ణచంద్రరావు మెడపై మూడుసార్లు నరికాడు. దీంతో దాడిలో గాయపడిన పూర్ణచంద్రరావును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ సురేష్‌లు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ విచారించి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోభాయమానంగా జగన్నాథ రథయాత్ర

బల్లికురవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడి గ్రామంలో సోమవారం రాత్రి జగన్నాథ స్వామి శోభాయ యాత్ర అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ నర్సారావుపేట వారి ఆధ్వర్యంలో ఈ యాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. జగన్నాథ స్వామి వారి విగ్రహాలను, రథాన్ని గ్రామంలోని రామాలయం వద్ద ఉంచారు. అక్కడ నుండి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు చేతులతో రథాన్ని లాగారు. ఈసందర్భంగా ప్రతి ఇంటి నుంచి మహిళలు రథానికి నీటితో వారులు పోసి హరతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరం ఉపాధ్యాక్షులు వైష్టవ కృపదాస్ జగన్నాదుని లీలల గురించి ప్రవచనం చేశారు. అనంతరం గ్రామస్థుల సమష్టి కృషితో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రహదారిని విస్తరించాల్సిందే

అద్దంకి,జూలై14(ఆంధ్రజ్యోతి): పొలాలకు రాకపోకలు సాగించేం దుకు 20 అడుగుల వెడల్పు తో బాక్స్ స్ట్రక్చర్ నిర్మాణం చేయాలని రైతులు కోరారు. విజయవాడ -బెంగళూరు రోడ్డు లో అద్దంకి మండలం పాతకొటికలపూడి వద్ద 12 అడుగుల వెడల్పుతో బాక్స్ స్ట్రక్చర్ నిర్మాణం చేస్తున్న నేపథ్యం లో రైతులు పనులు అడ్డుకున్నారు. సోమవారం సాయంత్రం మరోమారు పనులు అడ్డుకోవడంతో రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు వచ్చి రైతులతో చర్చించారు. బాక్స్ స్ట్రక్చర్ వెడల్పు పెంచటం తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి వారంరోజులలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సుమారు 200 ఎకరాల పొలాల నుండి పంట వరిగడ్డి, సుబాబుల్ లోడ్ లతో ట్రాక్టర్ లు రావాలంటే కనీసం 20 అడుగుల వెడల్పు ఉండాల్సిందేనని రైతులు వివరించారు.

32 సొసైటీలకు కొత్త పాలక వర్గాలు


పీడీసీసీబీ ప్రధాన కార్యాలయం

ఒంగోలు విద్య, జూలై14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 32 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కు(సొసైటీల) కొత్త పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పి .రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఉన్న అఫీషియల్ పీఐసీ స్థానంలో కొత్తగా నాన్ అఫీషియల్ పీఐసీలను నియమించారు. వాటి వివరాలు పక్క బాక్స్‌లో పొందుపరిచాం...

చీమకుర్తి సొసైటీకి అధ్యక్షుడుగా పూనాటి వెంకటరావు, సభ్యులుగా ఎ.బాలబ్రహ్మారెడ్డి, యానం వెంకటేశ్వర్లు
గుడిపూడివారిపాలెం సొసైటీ అధ్యక్షుడుగా కడియాల వెంకట్రావు, సభ్యులుగా ఉచ్చు రామారావు, వలేటి శ్రీరాములు
నందిపాడు సొసైటీ అధ్యక్షుడుగా యూ నాగేశ్వరరావు, సభ్యులుగా బోడపాటి సుబ్బారావు, తుమ్మల వీరాంజనేయులు,
పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడుగా మండవ హరిప్రసాదు, సభ్యులుగా నల్లూరి సంజీవరావు, సన్నపురెడ్డి రమేష్‌రెడ్డి,
అమ్మనబ్రోలు సొసైటీ అధ్యక్షుడుగా మారెళ్ల జనార్దనరావు, సభ్యులుగా డి.వెంకటశేషయ్య, కె.వెంకటేశ్వర్లు
తిమ్మసముద్రం సొసైటీ అధ్యక్షుడుగా మన్యం శివనాగేశ్వరరావు, సభ్యులుగా డి .కోటేశ్వరరావు, ఎం మురళి
ఓబ్నపాలెం సొసైటీ అధ్యక్షుడుగా మండవ ఆంజనేయులు, సభ్యులుగా ఈదర రాజా, భీమవరపు వెంకటేశ్వర్లు,
ఉప్పుగుండూరు సొసైటీ అధ్యక్షుడుగా కాట్రగడ్డ చంద్రబాబు, సభ్యులుగా ఎన్.భాస్కరరావు, పి.శ్రీనివాసరావు
బి.నిడమానూరు సొసైటీ అధ్యక్షుడుగా నలమలపు అంకిరెడ్డి, సభ్యులుగా ఎల్ శిరోమణి, ఎన్ వెంకటరావు
చదలవాడ సొసైటీ అధ్యక్షుడుగా కె.నాగరాజు, సభ్యులుగా జె. హరిబాబు, ఎస్ యల్లమంద
గుమ్మనంపాడు సొసైటీ అధ్యక్షుడుగా బి.రంగనాయకులు, సభ్యులుగా పి.రమణారావు, పి నరసింహారావు
గురువారెడ్డిపాలెం సొసైటీ అధ్యక్షుడుగా కె.సుబ్బారెడ్డి, సభ్యులుగా కె.శ్రీకాంత్, పి.ఆనందరావు
మంగమూరు సొసైటీ అధ్యక్షుడుగా ఎన్.నారాయణరావు, సభ్యులుగా ఎస్‌కే మస్తాన్ సాహెబ్, కె.గోపీకృష్ణ
పేర్నమిట్ట సొసైటీ అధ్యక్షుడుగా కె. వెంకటేశ్వరరావు,సభ్యులుగా పి.శ్రీనివాసరావు,ఎ.బ్రహ్మయ్య
సంతనూతలపాడు సిండికేట్ ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడుగా కె.విజయమ్మ, సభ్యులుగా ఎం రామకృష్ణారెడ్డి, పి.రాము
చౌడవరం సొసైటీ అధ్యక్షుడుగా పి.లక్ష్మీప్రసన్న, సభ్యులుగా ఆర్ నారాయణ, కె.వెంకటేశ్వర్లు
సిఎస్‌పురం సొసైటీ అధ్యక్షుడుగా వెంకటరెడ్డి, సభ్యులుగా టి.నారాయణ, డి .నాగరాజు
పామూరు సొసైటీ అధ్యక్షుడుగా యు.హరిబాబు, సభ్యులుగా ఎస్‌కె రహంతుల్లా, కె.వెంకటరమణయ్య
పీసీపల్లి సొసైటీ అధ్యక్షుడుగా పి.ఈశ్వరయ్య, సభ్యులుగా డీ సుబ్రహ్మణ్యం, యు. పిచ్చిరెడ్డి,
వెలిగండ్ల సొసైటీ అధ్యక్షుడుగా ఎస్ కాశిరెడ్డి, సభ్యులుగా వై సలోమన్, లక్ష్మీనారాయణ
ఈస్ట్ వెంకటాపురం సొసైటీ అధ్యక్షుడుగా డి. కృష్ణ, సభ్యులుగా వై.వెంకారెడ్డి, ఆర్ .వెంకటేశ్వర్లు
దర్శి సొసైటీ అధ్యక్షుడుగా కె .చంద్రశేఖరబాబు, సభ్యులుగా పి. పాపారావు, ఎ. వెంకటరావు
పసుపుగల్లు సొసైటీ అధ్యక్షుడుగా పి.శ్రీనివాసరెడ్డి, సభ్యులుగా వె.వెంకటేశ్వరరెడ్డి, ఎన్.నాగేశ్వరరావు
చెట్లమిట్ట సొసైటీ అధ్యక్షుడుగా వి.బోడిరెడ్డి, సభ్యులుగా జి. సత్యనారాయణరెడ్డి, యు.చినశేషయ్య
గుర్రపుసాల సొసైటీ అధ్యక్షుడుగా వి.వెంకటేశ్వర్లు, సభ్యులుగా జి. గోవిందయ్య,జి.చినసుబ్బయ్య
వీరభద్రాపురం సొసైటీ అధ్యక్షుడుగా జి.కోటయ్య,సభ్యులుగా ఎ. మల్లయ్య, జి.ఆంజనేయులు
ముటుకుల సొసైటీ అధ్యక్షుడుగా పి.యోగేశ్వరరావు, సభ్యులుగా జి.వెంకటేశ్వర్లు, కె.అచ్చియ్య
మిట్టపాలెం సొసైటీ అధ్యక్షుడుగా ఎం.అల్లూరురెడ్డి, సభ్యులుగా వై.వెంకటనారాయణ, సభ్యులు డి. వెంకటనారాయణ,
విశ్వనాథపురం సొసైటీ అధ్యక్షుడుగా కె. శ్రీనివాసరెడ్డి,సభ్యులుగా డి.చినికాశిం, కె.ఏడుకొండలు
గిద్దలూరు సొసైటీ అధ్యక్షుడుగా డి.బాలఈశ్వరయ్య, సభ్యులుగా డి.గోపాల్‌రెడ్డి, సీహెచ్ ఆనందరావు
ఇడమకల్లు సొసైటీ అధ్యక్షుడుగా బి.రవీంద్రారెడ్డి, సభ్యులుగా డి.నాగేశ్వరరెడ్డి, బి రంగయ్య
అర్ధవీడు సొసైటీ అధ్యక్షుడుగా కె.వెంకటరంగారెడ్డి, సభ్యులుగా ఎల్. రామయ్య, జి. రామకృష్ణలను నియమించారు

వంతెనల వద్ద వామ్మో..!


శిథిలావస్థకు చేరుకున్న పర్చూరు వాగుపై బ్రిడ్జి


కుంకలమర్రు రోడ్డులోని కొమ్మమూరు కాలువపై రక్షణ గోడలు లేని బ్రిడ్జి

పర్చూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలోని వంతెనల సైడు గోడలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారాయి. కొన్నిచోట్ల వంతెన గోడలమధ్యలో చెట్లు పెరిగిపోతున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో వంతెనలు దెబ్బతింటున్నాయి. దీంతో ఆయా ప్రధాన రహదారుల్లోని వంతెనల పరిస్థితి దయనీయంగా మారింది. పర్చూరు వాగుపై ఉన్న వంతెన కనీస మరమ్మతులకు నోచుకోలేదు. వంతెన గోడపై చెట్టుపెరిగినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఇక చీరాల రోడ్డులోని కొమ్మమూరు కాలువ వంతనపై సైడ్‌వాల్ దెబ్బతింది. ద్విచక్రవాహనదారులు ఎవరైనా ఇక్కడ నియంత్రణ కోల్పోతే నేరుగా కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇక స్వర్ణ-కారంచేడు రోడ్డులోని వంతెన కూడా ప్రమాదభరితంగా ఉంది. కారంచేడు-కుంకలమర్రు రోడ్డులోని కొమ్మమూరు కాలువపై ఏర్పాటు చేసిన వంతెన మరింత ప్రమాదభరితంగా తయారైంది. మరోవైపు శిథిలావస్థకు చేరిన వంతెనతోపాటు, సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతినటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు కొమ్మమూరు కాలువలో నిత్యం నీరు ప్రవహిస్తూ ఉండటంతో పరిస్థితి ఒకింత ఆందోళనకరంగా మారింది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న బ్రిడ్జిలకు కనీస మరమ్మతులు చేయించడంతోపాటు వంతెన గోడలపై అలముకున్న వృక్షాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరగా పరిష్కారం



ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారులు, న్యాయవాదులు

అద్దంకి, జూలై14(ఆంధ్రజ్యోతి): ఇరు పక్షాల అంగీకారం తో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు భవనాల సముదాయం నుండి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ బొమ్మ సెంటర్, పాతబస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, బంగ్లా రోడ్డు మీదుగా సాగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం అయిన కేసులలో ఇరు పక్షాలు విజయం సాధించినట్లే అవుతుందన్నారు. ఇరు పక్షాలు తమ డిమాండ్లను తెలుపుకునే అవకాశం ఉంటుందన్నారు. కేసుల పరిష్కారం లో ఎలాంటి కాలయాపన లేకుండా సమయం ఆదా అవుతుందన్నారు. పెండింగ్ కేసులు త్వరిత గతిన పరిష్కారం అయ్యేందుకు దోహద పడుతుందన్నారు.మధ్యవర్తిత్వం కేసులు పరిష్కారం కోసం న్యాయవాదులు ఉదయభాస్కర్, రామకృష్ణారావు, మారతశ్రీను, మహ్మద్ రఫీ లు అందుబాటు లో ఉంటారన్నారు. కొన్ని సందర్భాలలో సుమోటో గా తమ దృష్టి కి వచ్చిన కేసులను కూడా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఈ కార్య క్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవీఇవీ

ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయాలి


గ్రామ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

కొత్తపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించే ప్రతి పంటను ప్రకృతి వ్యవసాయ విధానంలోనే సాగు చేసే విధంగా చూడాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ సుభాషిణి అన్నారు. సోమవారం రాత్రి కొత్తపట్నంలోని ఎస్సీ కాలనీలో జరిగిన వ్యవసాయ వార్షిక ప్రణాళిక తయారీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కొత్తపట్నం గ్రామంలో ఆరు గ్రామ సంఘాలను ఏర్పాటు చేసి ఈ సంవత్సరం వేయబోయే పంటలు ప్రతి రైతు కూడా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను తినటం వలన ఆరోగ్యంతోపాటు పర్యావరణాన్ని కూడా కాపాడుకోవచ్చని ఆమె అన్నారు. సాగు భూమి లేని వారు ఇంటి వద్దనే కిచెన్ గార్డెన్‌ను పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశానికి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఏసమ్మ, వీవో ఏ ప్రత్యూష, మహిళా సంఘాలసభ్యులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రెడ్డప్ప, ఇందిర, ప్రవీణ్, సురేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఎర్రగొండపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వేగినాటి కోటయ్యనగర్ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారం రోజులుగా ట్యాంకర్ల దారా నీటిని సరఫరా చేయడం లేదని, తాగునీరు లేక 100 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీటీ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

గ్రానైట్ క్వారీల్లో ప్రమాదరహిత చర్యలు : ఐజీ


గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి

చీమకుర్తి,జూలై14(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు.చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం ఆయన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి రికార్డులు తనిఖీలు చేశారు. అనంతరం గ్రానైట్ క్వారీలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో నేరాల కట్టడికి సీసీ కెమెరాలతో అనునిత్యం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు,సీఐ సుబ్బారావు,సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జుల నియామకం

అద్దంకి,జూలై14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జులను నియమిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ధర్మవరం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా చాగంటి రాజేంద్రప్రసాద్, సభ్యులుగా చింతా వెంకటరెడ్డి, లచ్చిబోయిన వాసు, మోదేపల్లి సొసైటీ చైర్మన్‌గా నర్రా వీరయ్య సభ్యులుగా జాగర్లమూడి శ్రీనివాసరావు, అనపర్తి పున్నారావు, నాగులపాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా యేనుగంటి వెంకటరామయ్య(బాబు), సోమేపల్లి వెంకటరావు, వేములపాటి సుబ్బరావమ్మ, బల్లికురవ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గొట్టిపాటి లక్ష్మయ్య, సభ్యులుగా అడవి అంజయ్య, చంటి వెంకటరెడ్డి, కొత్తూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా మామిళ్ళపల్లి ప్రవీణ్, గుంటూరు నారాయణ, దొడ్డా చంద్రమౌళి, కూకట్లపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా పాలడుగు సుబ్బారావు, సభ్యులుగా అంజయ్య, గోగులమూడి వెంకటరావు, వైదన సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గాలం రామకృష్ణ, సభ్యులు గా యేల్చూరి అంజయ్య, కుందుర్తి సిద్ధయ్య, కొండమంజులూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా బత్తుల వెంకట్రావు, సభ్యులుగా చింతలచెరువు రూబేను, బత్తుల వెంకటరావు(హనుమంతరావు), కోటపాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా రావుల శింగరకొండ, సభ్యులుగా కట్టా సుబ్బారావు, మక్కెన ఆంజనేయులు, చందలూరు సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జ్‌గా బెల్లంకొండ శ్రీధర్‌బాబు, వట్టెం శేషయ్య, మాగులూరి సుబ్బారావు, ధైవాలరావూరు పర్సన్ ఇన్‌చార్జ్‌గా మద్దినేని రాఘవస్వామి, సభ్యులుగా తొట్టెంపూడి హరిబాబు, బాలినేని వీరయ్య, పమిడిపాడు పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాగర్లమూడి జయకృష్ణ, సభ్యులుగా మాలెంపాటి లక్ష్మీనారాయణ, తల్లపనేని శ్రీనివాసరావు, సోమవరప్పాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఎం వెంకటసుబ్బారెడ్డి, సభ్యులుగా యేనుగుల రామాంజనేయులు, మైలా కాశయ్యలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

నాలుగు సొసైటీలకు పాలకవర్గం ఎంపిక

బల్లికురవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు సొసైటీలకు పాలకవర్గాన్ని నియమిస్తూ, సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బల్లికురవ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గొట్టిపాటి లక్ష్మయ్య, సభ్యులుగా చంటి వెంకటరెడ్డి, అడవి అంజయ్య, కొత్తూరు సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జ్‌గా మామిళ్లపల్లి ప్రవీణ్‌కుమార్, సభ్యులుగా గుంటూరు నారాయణ, దొడ్డా చంద్రమౌళి, కూకట్లపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా పాలడుగు సుబ్బారావు, సభ్యులుగా ఇలసాగరపు అంజయ్య, గోగులమూడి వెంకటరెడ్డి, వైదన సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గాలం రామకృష్ణ, సభ్యులుగా ఏల్చూరి అంజయ్య, కుందుర్తి సిద్ధయ్యలను ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే రహదారుల అభివృద్ధి

మంత్రి రవికుమార్


ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న మంత్రి

బల్లికురవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అయిదేళ్ల అధికారంలో ఉన్న కూడా వైసీపీ గ్రామాలలో రోడ్లను అభివృద్ధి పరచలేదని కూటమి ప్రభుత్వం రాగానే రోడ్లను అభివృద్ధి చేస్తోందని చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రూ.10 లక్షలతో అభివృద్ధి పరిచిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అలానే చెన్నుపల్లి వైదన గ్రామాల మధ్య రూ. 3 కోట్లతో అభివృద్ధి పరిచిన బీటీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం ముక్తేశ్వరం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి రవికుమార్ ఇంటింటికి తిరిగి గత ఏడాది కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులతో రాష్ట్రం 20 ఏళ్ల అభివృద్ధిలో వెనక్కు వెళ్లిందన్నారు. ఎంతలో అనుభవం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండడంతో ఈ రోజు పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఎన్నికల హామీల అమలులో భాగంగా ఇప్పటికే అన్న క్యాంటీన్‌లు, పింఛన్ నగదు పెంపు, తల్లికి వందనం, ప్రతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు డీఎస్సీ, గ్రామాలలో అధ్వాన స్థితిలో ఉన్న రోడ్ల అభివృద్ధి వంటి పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. మంచి ప్రభుత్వంకు ప్రజల మద్దతు ఇవ్వాలన్నారు. గ్రామాలలో ప్రజలకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని అలానే సోలార్ యూనిట్లకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అట్లూరి నాగేశ్వరరావు, మారాబత్తిన అంజనేయులు, ఇశ్రాయల్ కమతం మంగారావు, చెన్నూరిప్రసాద్, అడపాల బసవయ్య , నాగరాజు, యాలగాల చిరంజీవి, గొట్టిపాటి లక్ష్మయ్య, శంకర్, సింగరయ్య, పోగుల శేఖర్, చంద్రమౌళి, గొట్టిపాటి మారుతి తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ గుర్తిస్తే చర్యలు

- ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు
- మైనింగ్ ఏడీ రామచంద్రయ్య


క్వారీని పరిశీలిస్తున్న ఆర్‌డీవో

అద్దంకి,జూలై14(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, మైనింగ్ జాయింట్ సర్వే నిర్వహించి అనుమతులకు మించి గ్రావెల్, మెటల్ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోనున్నట్లు చీరాల ఆర్‌డీవో చం ద్రశేఖర నాయుడు, బాపట్ల జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రామచంద్రయ్య అన్నారు. అద్దంకి మండలం ధర్మవరం సమీపంలోని కొండల నుండి గ్రావెల్, మెటల్ అనుమతులకు మించి తరలిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వరుస కథనాలు ప్రచురితం కావడంతో సోమవారం చీరాల ఆర్‌డీవో చంద్రశేఖర నాయుడు, బాపట్ల జిల్లా మైనింగ్ ఏడి రామచంద్రయ్యలు పరిశీలించారు. గ్రావెల్ తరలించిన ధర్మవరం చెరువు, సమీపంలో లోతుగా తవ్వకాలు చేసిన కొండ ప్రాంతం తో పాటు మెటల్ కోసం తవ్విన కొండలను పరిశీలిం చారు. ఎంత మేర అనుమతులు ఉన్నాయి.. ఇప్పటి వరకు ఎంత మేర తవ్వకాలు జరిగాయి అన్న విషయమై ఉమ్మడి సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఆర్‌ఐ శంకర్, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి, రెవెన్యూ, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి సున్నా సీట్లు

చీమకుర్తిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి స్వామి


రామనగర్‌లో ఇంటింటా తిరుగుతున్న మంత్రి స్వామి,ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి,జూలై14(ఆంధ్రజ్యోతి): వికృత చేష్టలతో పరుష పదజాలంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం జరిగేలా పన్నాంగం పన్నుతున్న ప్రతిపక్ష వైసీపీకి రాబోయే ఎన్నికల్లో గుండు సున్నా సీట్లు కట్టబెట్టి ప్రజలే బుద్ధి చెబుతారని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం సాయంత్రం చీమకుర్తి పట్టణంలో రామనగర్‌లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఇంటింటా తిరుగుతూ ఏడాదిపాలనలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడారు.తల్లికి వందనం ఎంతమంది పిల్లలుంటే అంత మందికి ఇచ్చామని అన్నపుడు మహిళలనుంచి పెద్ద ఎత్తున చప్పట్ల ద్వారా హర్షం వ్యక్తం అయింది. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏడాది కాలంలో చీమకుర్తిలో చేసిన అభివృద్ధిని వివరించారు రామతీర్ధంనుంచి నేరుగా చీమకుర్తి పట్టణవాసులకు తాగునీరు అందించే ప్రాజెక్టును తన హయాంలో తీసుకువస్తే గత వైసీపీ ప్రభుత్వం మూలన పడవేసిందన్నారు. ఇపుడు తిరిగి రూ.73కోట్లతో పనులును ప్రారంభించనున్నామన్నారు.తదుపరి మంత్రి,ఎమ్మెల్యేలకు పౌర సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, కందిమళ్ల గంగాధరరావు, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, గొల్లపూడి సుబ్బారావు, కోటేశ్వరరావు, కౌన్సిలర్ రమాదేవి, అవనిగడ్డ శేషారావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలులో జాప్యం

● రోజువారీ కొనుగోళ్లలో పెరగని వేగం ● కదలని మండెలతో రైతులలో ఆందోళన ● సోమవారం 250 బేళ్లకే పరిమితం


యార్డులో కొనుగోలు చేస్తున్న పొగాకు

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవికి ముందు ఎడ్ల కొష్టాల వద్ద వేసే వరిగడ్డి వాముల మాదిరిగా పొగాకు నిల్వలు ఉండగా, పాలదూడలకు విసిరే గడ్డిపోచల మాదిరిగా కొనుగోలు ఉన్నాయి. దీంతో తమ వంతు ప్రకారం పొగాకు ఎప్పుడు అమ్ముకోవాలో అర్థంకాక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంగులూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో గురు, శుక్రవారాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాకతో 500 బేళ్లను అధికారులు కొనుగోలు చేశారు. అయితే సోమవారం నాడు కేవలం 250 బేళ్లను మాత్రమే కొనుగోలు చేయడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. రైతులు కొనుగోలు కేంద్రాలకు కనీసం 500 బేళ్ల తెచ్చేలా నిర్ణయిత సమాచారం కూడా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరగని పొగాకు నిల్వలు

ఈ ఏడాది మండలంలో నల్లబర్లీ సాగు ఇబ్బడి ముబ్బడిగా పెరగ్గా, రైతుల వద్ద కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ముందే అధికారిక లెక్కల ప్రకారం మండలంలో 47 వేల క్వింటాళ్ల పొగాకు నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో 13 రోజులు క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు 2100 బేళ్ల పొగాకు మాత్రమే కొనుగోలు చేశారు. మండలంలో అత్యధికంగా చందలూరులో 14,737 క్వింటాళ్లు, పంగులూరులో 10,573 క్వింటాళ్లు, నూజెండ్లపల్లిలో 6,156 క్వింటాళ్లు, బూదవాడలో 6,260 క్వింటాళ్ల నిల్వలుండగా, మిగిలిన గ్రామాల్లో వేల క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, రైతు వద్ద చివరి ఆకును కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే రైతుల వద్ద పొగాకు నిల్వలు రోజులు గడిచే కొద్ది రంగు మారుతుండగా, కొనుగోళ్లలో మందగమనం రైతులను కుంగదీస్తోంది. పొగాకు రైతులను ఆదుకొనేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.270 కోట్లు కేటాయించి కొనుగోలు ప్రారంభించినా, ఇక్కడ కొనుగోళ్లలో ఆస్థాయి వేగం లేకుండా పోయింది. పంట సాగు చేయమని చెప్పిన ప్రైవేట్ కంపెనీలు మొఖం చాటేసిన సందర్భంలో ప్రభుత్వం కొనుగోలుకు ముందుకు వచ్చింది. దీంతో రైతులు తమను మోసగించిన సంస్థలను కూడా నిందించకుండా ప్రభుత్వం వైపు చూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ప్రజాదనంతో కొనుగోలు ప్రారంచినప్పటికీ, రైతులును మోసం చేసిన కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా ఏం చేస్తుందో ప్రకటించలేదు. ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికైనా ప్రభుత్వం బర్లీపొగాకు రైతుల పొగాకు కొనుగోలులో మరింత పారదర్శకంగా వ్యవహరించాలని, ఇచ్చిన మాట ప్రకారం పొగాకు కొనుగోలు చేసే విధంగా వేగం పెంచాలని రైతాంగం కోరుతోంది.

అవీ..ఇవీ..

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు

● సుపరిపానలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే


మొక్కతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న వార్డు ప్రజలు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలుజేస్తోందని ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు, వేటపాలెం మండలం రామన్నపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రోడ్ల అధ్వానస్థితిపై ప్రజలు గగ్గోలు పెట్టినా, పట్టించుకొనే వారే కాదన్నారు. ప్రస్తుతం రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అలాగే కొత్తపేటలో హిందూ శ్మశాన వాటిక ఆధునికీకరణ పనులను పరిశీలించారు. రామచంద్రపురంలో పోలేరమ్మ వారి ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూలులోని పరిశుభ్రత పిల్లలను ఆకట్టుకోవాలి


దాత అందజేసిన భోజనం ప్లేటుతో విద్యార్థులు

మార్టూరు,జూలై14(ఆంధ్రజ్యోతి): పిల్లలు బడికి రావాలంటే మొదట స్కూలులోని పరిశుభ్రత, వాతావరణం పిల్లలను ఆకట్టుకోవాలని, తద్వారా వారికి రోజూ బడికి రావాలనే ఆసక్తి పెరుగుతుందని సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ అన్నారు. సోమవారం మండలంలోని జొన్నతాళి గ్రామంలోని యూపీ పాఠశాలలో గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు శానంపూడి చైతన్య సొంత నిధులతో వంద మంది బాలబాలికలకు భోజనప్లేట్లును అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి విచ్చేసిన సర్పంచ్ నాగేంద్రమ్మ ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. రోజూ స్కూలులోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలనే ఆలోచనను విద్యార్థులలో రేకెత్తించాలన్నారు. అనంతరం ప్లేట్లు అందజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుని హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

మార్టూరు, జూలై14,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్ధన్ కాలనీకి చెందిన పిండ్రాళ్ల పోలయ్య అనే యువకుడ్ని హత్యచేసిన కేసులో సోమవారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. ఆయన కథనం మేరకు, జనార్ధన్ కాలనీలో ఉంటున్న పోలయ్య పాత ఇనుపసామానుకు ఉల్లిపాయలు ఇచ్చే వ్యాపారం చేస్తుంటారు. అదేవిధంగా పోలయ్య బాబాయి పిండ్రాల శ్రీను గాడిదలను, పందులను అమ్ముతుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న సాయంత్రం పోలయ్యకు బాబాయి శ్రీనుతో గొడవ జరిగింది. దాంతో పోలయ్య ఆవేశంలో ఇంటిలో నుంచి కొడవలితో బయటకు వచ్చి బాబాయి శ్రీనును గాయపరచాడు. ఈ ఘటనతో తీవ్ర ఆవేశానికి గురైన శ్రీను, తన అల్లుడు చిన్నా, తన చెల్లెలు పద్మలతో కలిసి నాపరాళ్లతో పోలయ్యను తీవ్రంగా గాయపరచారు. దీంతో గుంటూరు ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 12వ తేదీ పోలయ్య చనిపోయారు. ఈ విషయమై పోలయ్య పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసిన ముగ్గురిని అద్దంకి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు

విద్యుత్ ఎస్ఈ హెచ్చరిక


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఈ ఆంజనేయులు

పంగులూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని బాపట్ల సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ జి.ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం విద్యుత్‌శాఖకు సంబంధించిన విజిలెన్స్ విభాగంతో పాటు ఆపరేషన్స్ విభాగం అధికారులు, సిబ్బంది సోమవారం విద్యుత్ చౌర్యంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పర్యవేక్షక ఇంజనీర్లు ఆంజనేయులు, విజయకృష్ణ ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.భాస్కరరావు, ఆపరేషన్స్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.మస్తానరావుల నేతృత్వంలో అధికారులు, సిబ్బంది 29 బృందాలుగా ఏర్పడి పలు చోట్ల 1527 సర్వీసులు పరిశీలించారు. ఈ తనిఖీలలో భాగంగా అనుమతికి మించిన లోడు వినియోగిస్తున్న విద్యుత్ 59 మంది వినియోగదారులకు రూ.1,53,200 అపరాధం విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.15000 చొప్పున, అనుమతించిన కేటగిరి కాకుండా వేరే కేటగిరిలో విద్యుత్ వినియోగించుకుంటున్న ముగ్గురికి రూ.18 వేల అపరాధ రుసుము విధించారు. ఈ తనిఖీలలో అద్దంకి, మార్టూరు డిప్యూటీ ఈఈలు ఎం.ఆమోదరం, సురేంద్రబాబు, విజిలెన్స్ డీఈఈ విజయ్‌శ్రీనివాస్‌లు, అద్దంకి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఏఈలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

విజయలక్ష్మీ ట్రస్ట్ చైర్మన్ వేగిరాజు శివశర్మ



మాట్లాడుతున్న విజయలక్ష్మీ ట్రస్ట్ చైర్మన్ శివశర్మ

పర్చూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వంతో పాటు, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని విజయలక్ష్మీ ట్రస్ట్ చైర్మన్ వేగిరాజు శివశర్మ అన్నారు. సోమవారం పర్చూరు రోటరీక్లబ్ అధ్వర్యంలో స్థానిక రోటరీ భవనంలో సమగ్ర గ్రామీణ అభివృద్ధి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పర్చూరు రోటరీ అధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలను ఆయన కొనియాడారు. కార్యక్రమం లో క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణ మోహన్, ఆర్‌సీసీ చైర్మన్ పోత్రు రాఘవయ్య, కోమటి ఆంజనేయులు, నాగభైరు శ్రీనివాస రావు, పాబోలు ఉదయభాస్కర్, కొల్లా నరేంద్రకుమార్, కొల్లా సుబ్బారావు, నాగుబడి సుబ్బారావు, పోలిశెట్టి చంద్రశేఖర్, తేళ్ల రమేష్ చంద్ర, దండా శ్రీనివాసరావు, కాల్వ సత్యనా రాయణ, భవనం రాజ గోపాల్‌రెడ్డి, పంబి సదానందరెడ్డి, మున్నంగి వెంకట సుబ్బయ్య, కోడూరి సుబ్రహ్మణ్యాచారి తది తదితరులు పాల్గొన్నారు.

చివరి పొగాకు వరకు కొనుగోలు చేస్తాం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పర్చూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు చివరి ఆకు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. అందులో భాగంగానే మరిన్ని గోడౌన్లను అందుబాటులోని తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సోమవారం పర్చూరు మండలం అడుసుమల్లిలో ఏర్పాటు చేసిన యద్దనపూడి మండల పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ అధికారులతో కలసి ఏలూరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పొగాకు కంపెనీలు రైతులకు ఆశచూపి నిలువునా మోసం చేసినా ప్రభుత్వం మాత్రం రైతులను ఆదుకొంటుం దన్నారు. ఈ ఏడాది తిరిగి పొగాకును సాగుచేస్తే తీవ్రఇబ్బందులు ఉంటా యన్న విషయాన్ని రైతులు గుర్తిం చాలన్నారు. మార్కెట్లో మొక్కజొన్న కు ప్రభుత్వం రూ.2400 మద్దతు ధర ప్రకటించిందని రానున్న రోజుల్లో ఇంకా ధర పెరిగే అవ కాశం ఉందన్నారు. రైతుల ప్రయో జనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఆర్డీవో గ్లోరియా, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఆయా మండల పార్టీ అధ్యక్షులు నల్లపునేని రంగయ్య చౌదరి, తాటి నాగేశ్వరరావు, షంషుద్దీన్, తొండపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, జనార్ధన్, రజాక్ శ్రీనివాసరావు, రావిపాటి సీతయ్య, కే.కృష్ణ పాల్గొన్నారు.

మార్టూరులో: మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 705 మంది రైతుల వద్ద సుమారు 25 వేల క్వింటాళ్లకు పైగా పొగాకు బేళ్లు ఉన్నాయన్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడకూడదని పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే భవిష్యత్తులో పొగాకు పంటను సాగు చేయవద్దని రైతులను కోరారు. మొక్కజొన్న పంట కు పెట్టుబడి తక్కువగా ఉండటం,లాభదాయకంగా ఉండటంతో రైతులు మొక్కజొన్న పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పొగాకు కంపెనీలు చెప్పే మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. వచ్చే నెల 15 లోపు మండలంలోని రైతుల అందరి వద్ద పొగాకు కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ లవన్న, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఆర్‌డీవో గ్లోరియా, టీడీపీ నాయకులు తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్,గుంజి వెంకట్రావు, యలగా రామాంజనేయులు, కమ్మ శివనాగేశ్వరరావు, ఉప్పలపాటి చక్రపాణి,కందిమళ్ల రామకోటేశ్వర రావు పాల్గొన్నారు.

నేడు పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మేదరమెట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలో నూతనంగా బర్లీ పొగాకు కోనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నూతనంగా ఏర్పాటు చేసిన కోనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

సహకార సంఘాలకు నూతన పాలకవర్గం

మేదరమెట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతన పాలకవర్గాలను ప్రభుత్వం సోమవారం నియమిం చింది. కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా జాగర్ల మూడి జయకృష్ణను, సభ్యులుగా ఎం.లక్ష్మినారాయణ, టి.శ్రీనివాసరావులను నియమించారు. దైవాలరావూరు సొసైటీకి చైర్మన్‌గా మద్దినేని రాఘవ స్వామిని, సభ్యులుగా టి.హరిబాబు, ఎం.వీరయ్యలను నియమించారు. ఎన్నికైన సభ్యులుకు పలువురు నాయకులు అభినందించారు. సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తామని ఎన్నికైన సభ్యులు తెలిపారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

మార్టూరు,జూలై14(ఆంధ్రజ్యోతి):కొత్తగా గ్రామాలలో సిమెంటు రోడ్లను నిర్మించడంతో పాటు రోడ్డు పక్కన విద్యుత్‌స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని మండలంలోని కోలలపూడి సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ భుక్యా శాంతిబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సమస్యలను ప్రజా ప్రతినిదులు సభ దృష్టికి తసుకువచ్చారు. అదేవిధంగా ఏవో లావణ్య మాట్లాడుతూ వర్షాలు కురిసిన తర్వాత రైతులకు కందులు, మినుములు నూరుశాతం రాయితీతో అందజేస్తామన్నారు. మండలంలోని పలుగ్రామాలలో మరమ్మత్తులకు గురైన చేతి పంపులను మొబైల్ ఆటో ద్వారా మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఇంకా మార్టూరు, వలపర్ల, ద్రోణాదుల గ్రామాలలో బోర్లుకు మరమ్మత్తులు చేయవలసిన అవసరం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన సిమెంటు రోడ్లకు బిల్లులు రాలేదని పలువురు సర్పంచులు సమావేశం దృష్టికి తెచ్చారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ


దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

ఇంకొల్లు, జూలై 14, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో సోమవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఉపకరణాలను ఎంఈవో శ్రీనివాసరావు అందజేశారు. 2042-25వ విద్యాసంవత్సరంలో జరిగిన క్యాంపు లో ఇంకొల్లు మండలానికి చెందిన వై.దీక్షకు ట్రైసైకిల్, వి.వరుణ్‌కు రోలేటర్, ఎస్‌కె.ఆఫ్రాకు వినికిడి యంత్రాల కోసం ఎంపికయ్యారు. వీరికి సోమవారం ఎంఈవో ఉపకరణాలు అందజేశారు. వీటిని సక్రమంగా వినియోగించుకొని విద్యలో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జరుబుల అనీత, ఐఈఆర్‌టీలు వీరయ్య, ఎం.హరిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ప్రత్యేక వసతులు

వేటపాలెం(చీరాల), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు వేటపాలెం ఎంఈవో జేపీ సుబ్బయ్య, పురుషోత్తం అన్నారు. మండల పరిధిలోని భవిత కేంద్రంలో విద్యభ్యాసం పొందుతున్న ముగ్గురు దివ్యాంగులకు రెండు ట్రై సైకిల్స్, ఒక వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులపై బోధకులతోపాటు తల్లిదండ్రులు కూడా భద్రతలు తీసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో శ్రీధర్, ధనలక్ష్మీ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డంపింగ్ కేంద్రంగా ఎన్ఎస్‌పీ కాలువ


ఎన్ఎస్‌పీ కాలువలో నిండిన వ్యర్థాలు

అద్దంకి, జూలై14 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువ డంపింగ్‌కు కేంద్రంగా మారింది. కాకానిపాలెం సమీపంలోని అద్దంకి మేజర్ కాలువలో భవనాల వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను తెచ్చి పూడ్చి వేస్తున్నారు. ఇప్పటికే నంబూరిపాలెం నుండి రామ్‌నగర్ వరకు కాలువ ఆనవాళ్లు లేకుండా పోగా, ప్రస్తుతం కాకానిపాలెం వద్ద కూడా వ్యర్థాలు పోస్తుండడంతో అదే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒక వైపు అద్దంకి మేజర్ కాలువలో అభివృద్ధి పనులు, మినీ బైపాస్‌గా మార్చే ప్రతిపాదనలు ఉండగా, వ్యర్థాలతో కాలువను నింపడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను కాలువ లో వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనాథ యువకునికి సాయం

మార్టూరు, జూలై14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన అనాథ యువకుడు జంద్రాజుపల్లి మరియదాసుకు సోమవారం హెల్పింగ్ హాండ్స్ సంస్థ వారు 5.వేలు నగదు, బస్తా బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్ వలి, పుట్టా అయ్యప్పస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

మార్టూరు,జూలై14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేతాజీనగర్ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు సోమవారం చిమటా వెంకటేశ్వర్లు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పర్చూరు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ విద్యాలయాల్లో 22 ఏళ్ల నుంచి ఉచితంగా వెంకటేశ్వర్లు నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో గుంటుపల్లి చందు, ఉపాధ్యాయులు ఏ.సూర్యప్రకాశరావు, కవిత తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో రోడ్డుపైనే మెడికల్ వ్యర్థాలు


రోడ్డుపై పడవేసిన మెడికల్ వ్యర్థాలు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో కొందరు మెడికల్ దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వైద్యుల నుండి ప్రిస్కిప్షన్ వెంట తెచ్చుకున్న వారికే మందులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే అందుకు భిన్నంగా దుకాణాదారులు ఏకంగా ఇంక్షన్‌లు సైతం వారే చేస్తూ వైద్యం చేస్తున్నారు. అంతేకాకుండా రోగులకు వినియోగించిన సూదులు, సిరంజీలు, ఏకంగా రోడ్డుపై విసిరేస్తున్నారు. రైల్వే స్టేషన్‌రోడ్డులో ఏకంగా ఓ దుకాణం దారుడు రోడ్డుపైనే కాలం చెల్లిన మందుబిల్లలు, సిరంజీలు వేశాడు. నిబంధనల ప్రకారం మెడికల్ వ్యర్థాలను ఒక పద్ధతి ప్రకారం రీసైకిల్ చేయాలి, కొన్నింటిని పూర్తిగా కాల్చివేయాలి. అయితే ఇక్కడ నేరుగా ఇక్కడ రోడ్డుపైనే పడేస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా, అధికారులు ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సెయింట్ ఆన్స్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అనుమతి

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో కాకినాడ జేఎన్‌టీయూ వారి పరిశోధన కేంద్రానికి అనుమతి దక్కింది. అందుకు సంబంధించి కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు వివరాలు వెల్లడించారు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలాక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాల్లో కళాశాలకు అనుమతి లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన అనుమతిపత్రాన్ని నిర్వాహకులు సోమవారం అందుకున్నారు.

మువ్వల వెంకటరమణకు ఘన సత్కారం


వెంకటరమణను సత్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల బీజేపీ నాయకులు మువ్వల వెంకట రమణరావు జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వెంకట రమణ బీజేపీలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఉన్నత స్థానాన్ని దక్కించుకోవడంపై అభినందనలు కురిపించారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థి బలవన్మరణం

ఈపూరుపాలెం(చీరాల), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థి (18) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరో రెండు రోజుల్లో కళాశాలల చేరనుండగా ఘటన జరగడంపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇటీవలే కళాశాలకు వెళ్లేందుకు మారాం చేయడంతో తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాన్ని సైతం అతనికోసం కొనుగోలు చేశారు. అయితే ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసిన తల్లిదండ్రులు వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై పోలీసులకు ఎటువంటి పిర్యాదు అందలేదు.

2.. 3.. 5.. 5..6... అరె ఇవేవో నీట్, ఎంసెట్ ఇతర పోటీ పరీక్షల్లో వచ్చిన ర్యాంకులు అనుకుంటున్నారా!? అయితే మీరు పొరబడ్డట్టే. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సోమవారం కలెక్టరేట్ నుంచి మండలస్థాయి కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (గ్రీవెన్స్ డే) వచ్చిన అర్జీల సంఖ్యలివి. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో అర్జీల సంఖ్య పదికి దాటడం లేదు. ఇందుకు ప్రధాన కారణాలే ఉన్నాయి. ఇక్కడ అర్జీ ఇచ్చినా ఫలితం ఉండదనే భావనతో అందరూ నెల్లూరులోని కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. అసలు మండల కార్యాలయాల్లో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' బృందం ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలను విజిట్ చేసింది. ఈ విజిట్‌లో అధికారుల మొక్కుబడితత్వం కొట్టొచ్చినట్టు కనిపించింది.


ఆత్మకూరు : మధ్యాహ్నం 12.40 గంటలకు తహసీల్దారు కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు


ఏఎస్‌పేట : ఉదయం 10:40 గంటలకు తహసీల్దారు కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు


నెల్లూరు : అర్జీదారులతో కిటకిటలాడుతున్న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం

● ఏఎస్ పేట : తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 10:40 గంటలకు అధికారులెవరూ రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. మరోవైపు కార్యాలయంలో నెల రోజులుగా వీడియోకాన్ఫరెన్స్ పరికరాలు పని చేయకపోవడంతో ఇక్కడున్న అధికారులు సంగంకు వెళుతున్నారు.

● అల్లూరు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆరు అర్జీలు వచ్చాయి. కాగా, తహసీల్దారు లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దారు, సర్వే శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. అర్జీదారులు అత్యధికంగా లేకపోవడంతో గ్రీవెన్స్‌ను అధికారులు త్వరగా ముగించారు.

● వచ్చామా.. వెళ్లామా!?

సమయపాలన పాటించకుండా కొందరు అధికారులు వచ్చామా.. వెళ్లామా.. అంటూ, మరికొందరు తమ సిబ్బందిని పంపి రిజిస్టర్‌లో సంతకాలు చేయిస్తూ మమ అనిపిస్తున్నారు. కొన్ని శాఖల అధికారులు అసలు రావడమే మానేశారు. వాస్తవంగా అన్ని ప్రభుత్వ శాఖల (సుమారు 17 శాఖలు) అధికారులు ఈ గ్రీవెన్స్‌లో పాల్గొనాలి. కానీ రెండు లేదా ఐదు శాఖల అధికారులు వచ్చి వెళ్లిపోతున్నారు. ఇంకేముంది... అర్జీలు అందజేసినా సమస్యలు పరిష్కారం కావడంలేదనే భావనతో ప్రజలంతా కలెక్టరేట్‌కు పరుగులు తీస్తున్నారు. ఆ వివరాలు సంక్షిప్తంగా...

అలా వచ్చి...


10.45 గంటలకు గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులు, సిబ్బంది

ఉదయగిరి : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 10.45 గంటలకు తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీవో అప్పాజీ, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఏఎస్‌డబ్ల్యూవో రమణారెడ్డి, ఆర్అండ్‌బీ, హౌసింగ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఆ తర్వాత 2, 3 శాఖల అధికారులు వచ్చారు. అధికారులెవరూ సమయపాలన పాటించలేదు. మరోవైపు వచ్చామా.. రిజిస్టర్‌లో సంతకం చేశామా!? వెళ్లామా!? అన్నరీతిలో వ్యవహరించారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తే అధికారులెవరూ లేరంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

మొక్కుబడి తంతే!


ఆత్మకూరు : ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో పావని ఒక్కరే...

ఆత్మకూరు : ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఉదయం 10.25 గంటలకు తహసీల్దారు పద్మజాకుమారి గ్రీవెన్స్‌డేలో పాల్గొన్నా రు. 10.40లకు హౌసింగ్ ఏఈ, సర్వేయర్, ఆర్ఐ మాత్రమే హాజరయ్యారు. తదనంతరం ఎంపీడీవో, ఇరిగేషన్ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, విద్యుత్ శాఖ ఏఈ, ఎంపీఈవోలు వచ్చారు. ఎంపీడీవో రఫీఖాన్ కొద్దిసేపు ఉండి తనకు పని ఉందని తహసీల్దారు అనుమతితో వెళ్లిపోయారు. 6 అర్జీలు మాత్రమే గ్రీవెన్స్ డేకు వచ్చాయి. మధ్యాహ్నం 1 గంట వరకు గ్రీవెన్స్ డే నిర్వహించాల్సి ఉన్నా 12.40 గంటలకు అధికారులంతా వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

● ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఎవరూ రాలేదు. ఉదయం 10.55 గంటలకు ఆర్డీవో పావని ఒక్కరే హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు అంతకు మించి ఏ ఒక్క శాఖ అధికారి గ్రీవెన్స్ డేకు హాజరుగాక పోవడం గమనార్హం.

కలెక్టరేట్‌కు 555 అర్జీలు...

నెల్లూరు (హరనాథపురం) : మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవటంతో జిల్లా కేంద్రంలో కలెక్టర్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తుతున్నారు. సోమవారం 555 అర్జీలు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. వీటిలో 215 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే. మండల స్థాయిలోనే అర్జీలు సమర్పించాలని కలెక్టర్ సూచిస్తున్నా, అర్జీదారులు మాత్రం కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. రికార్డు స్థాయిలో 555 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 215 అర్జీలు, సర్వే శాఖకు 48, మున్సిపల్ శాఖకు 43, పంచాయతీరాజ్ శాఖకు 53, పోలీసు శాఖకు 52, సివిల్ సప్లయీస్‌కు 8 అర్జీలు వచ్చాయి. భూ సమస్యలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ఆనంద్ వెంటనే జాప్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ అర్జీల మీద ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నా, సమస్యలు సమస్యలుగానే మిగులుతున్నాయి, అర్జీలు మాత్రం పెరిగిపోతున్నాయి. వీటికి ప్రత్యేక పరిష్కారాన్ని జిల్లా యంత్రాంగమే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎవరు ఎక్కడుంటారో తెలియక

సంగం : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లా నాయక్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ వేర్వేరుగా గ్రీవెన్స్ డే నిర్వహించారు. మిగతా మండల స్థాయి అధికారులు ఎవరు ఎక్కడ హాజరవుతారో, తమ అర్జీలు ఎక్కడ ఇవ్వాలో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. అసలు ఎవరు ఎక్కడ ఉంటున్నారో, ఎన్ని గంటలకు వస్తారో తెలియ లేదు. వీలున్న సమయంలో వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్తున్నారే కానీ పట్టుమని పది నిమిషాలు కూర్చున్న దాఖలాలు లేదు. ఇది ఇలా ఉంటే తహసీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో ఐదు అర్జీలు వచ్చాయి.

● **సీతారామపురం :** అధికారులు రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం బోసిపోయింది. తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఒకటి రెండు శాఖల అధికారులు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన వారంతా డుమ్మా కొట్టారు. సుదూర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు.

అక్కడలా.. ఇక్కడిలా...

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఎందుకలా!?

● మండల కార్యాలయాల్లో మొక్కుబడిగా పీజీఆర్ఎస్ ● జవాబుదారీతనం లేకపోవడమే కారణమా!?
● అన్నీ కార్యాలయాల్లో రెండంకెలు దాటని అర్జీల సంఖ్య ● కలెక్టరేట్‌కు పెరుగుతున్న అర్జీదారుల తాకిడి
● సోమవారం ఒక్కరోజే 555 వినతుల స్వీకరణ

లింగసముద్రం : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మూడొంతులకుపైగా అధికారులు డుమ్మా కొట్టారు. కార్యాలయంలో నాలుగైదు నెలల నుంచి ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ మోనిటర్‌కు లేకపోవడంతో తహసీల్దారు సీతామహాలక్ష్మి కలిగిరిలో పాల్గొన్నారని ఆర్ఐ తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, ఏవో రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధాదేవి మాత్రమే ఉన్నారు. మూడు అర్జీలు మాత్రమే వచ్చాయి.

భూములు తీసుకోబోమని

చంద్రబాబు, లోకేష్ చెబితేనే నమ్ముతాం!

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరికి తేల్చిచెప్పిన మత్స్యకారులు

ఉలవపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : 'మా వ్యవసాయ భూములను పరిశ్రమలకు తీసుకోమని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చేత చెప్పిస్తేనే నమ్ముతా'మని కరేడు శివారు గ్రామం టెంకాయచెట్లపాలెం మత్స్యకారులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు తేల్చిచెప్పారు. సోమవారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే టెంకాయచెట్లపాలెంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాములవారిగుడి ఎదురుగా గ్రామస్థులు సమావేశం ఏర్పాటు చేశారు. ఏడాదికి రెండు పంటలు పండించే భూములు పరిశ్రమలకు ఇవ్వబోమని గ్రామస్థులమంతా కట్టుమీద ఉన్నామని, తమ భూముల జోలికి రావద్దని కాపులు తేల్చి చెప్పారు. దీంతో ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ మత్స్యకారుల భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోల భూసేకరణ జరగదని ఎమ్మెల్యేగా తాను హామీ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత జీవో ప్రకారం 4500 ఎకరాలకు మాత్రమే భూసేకరణ ఉంటుందని మత్స్యకార గ్రామాల భూములు ఎక్కడికి పోవని మాటిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కొందరు గ్రామస్థులు పలు సందేహాలు వ్యక్తం చేస్తూ... ఇలాగే చెప్తారు ఉన్నతాధికారులు, పైనున్న ప్రభుత్వ పెద్దలు రెండో విడతలో మా భూములు తీసుకోరని గ్యారంటీ ఏమిటని, 8వేల ఎకరాలు భూమి కావాలని ప్రభుత్వం చెబుతోంది కదా మిగిలిన 4వేల ఎకరాలు తీసుకోవడానికి ఇంక కరేడులో భూమి లేదు మా భూములు మాత్రమే మిగిలి ఉన్నాయని సందేహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో చెప్పించి భరోసా కల్పించాలని మత్స్యకారులు ఎమ్మెల్యేని కోరారు. వారిని కలిసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుబ్బారావు, ఆదాము, బాలమురళి, పోలిశెట్టి, రామదాసు, శ్రీనివాసులు, రాంబాబు పాల్గొన్నారు.


ఏపీపీఎస్సీ పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో హుస్సేన్ సాహెబ్

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

● మూడు కేంద్రాల్లో 23 వరకు నిర్వహణ ● పక్కాగా ఏర్పాట్లు : డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) లెక్చరర్ పోస్టుల భర్తీకి మంగళవారం నుంచి పరీక్షలు నిర్వహించనున్నదని, ఈ పరీక్షలు ఈనెల 23వతేదీ వరకు జరుగుతాయిని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ పేర్కొన్నారు. పరీక్షల ఏర్పాట్లపై సోమవారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ఈ పరీక్షలను నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, పొట్టేపాళెం సమీపంలోని ఆయాన్ డిజిటల్, కావలిలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల తరువాత, మధ్యాహ్నం 2 గంటల తరువాత పరీక్ష కేంద్రాలలోకి అభ్యర్థులను అనుమతించబోమని తెలిపారు. అభ్యర్థులు గంట ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సులను నడపాలని, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను డీఆర్వో ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెట్టప్రాంతానికి వరం!

● ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల
● ఐదు కోర్సులతో 300 సీట్లు అందుబాటులోకి..
● ఈ ఏడాది నుంచే తరగతుల ప్రారంభం
● రెండేళ్లపాటు నెల్లూరులో తాత్కాలిక తరగతులు
● సొంత భవనాలు నిర్మించాక ఆత్మకూరుకు తరలింపు
● ఫలించిన మంత్రి ఆనం కృషి

ఆత్మకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. ఈ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాలనే రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి ఫలించి, ఆత్మకూరుకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరైంది. ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఉమ్మడి రాష్ట్రానికి ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ప్రస్తుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ అప్పట్లో కార్యచరణకు నోచుకోలేదు. గత ఎన్నికల సమయంలో ఆత్మకూరులో నిర్వహించిన సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే తప్పనిసరిగా ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా ఆనం పావులు కదిపారు. ఇటీవల ఆత్మకూరులో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఆమోదం లభించింది. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలో ఇంజనీరింగ్ కళాశాల ఈ ఏడాది నుంచే ఆరంభం కానుంది. మొదటగా 300 మంది విద్యార్థులతో ఐదు బీటెక్ కోర్సులు ప్రారంభానికి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. అయితే తాత్కాలికంగా నెల్లూరులోని వీఆర్ ఐపీఎస్ కళాశాల భవనాల్లో బీటెక్ తరగతులు నిర్వహిస్తారు. రెండేళ్లలో ఆత్మకూరులో భవనాలు నిర్మించి ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని కొనసాగిస్తారు.



పల్లె ఫేస్ మారేనా?

గ్రామాలకు త్రీఫేస్ కరెంటు ఎప్పటికో!
రాష్ట్ర ప్రభుత్వ ఫోకస్‌తో వేగవంతం

కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నుంచి, నిరంతర విద్యుత్‌తో పల్లెల ముఖ చిత్రం మార్చే పథకం నత్తనడకన సాగుతోంది. జిల్లావ్యాప్తంగా పల్లెలకు త్రీఫేస్ లైన్‌తో 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి నిర్దేశించిన ఆ పథకం పనులు రెండేళ్లుగా మందకొడిగా జరుగుతున్నాయి. అయితే పనులను వేగవంతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాది పనులు పూర్త య్యేలా లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ క్రమంలో రాబోయే సంవత్సరం జిల్లాలో ప్రతీ గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

- వివరాలు 8లో..



'ఎగ్'బాకుతోంది!

● ఎన్నడూ లేనివిధంగా ధర

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): అనుకోకుండా ఇంటికి వ చ్చే అతిథులకు సులభంగా ఆతి థ్యం ఇచ్చేది కోడిగుడ్డుతోనే... రోజూ గుడ్డు తినండి.. ఆరోగ్యంగా ఉండం డి... అని వైద్యులు సలహా ఇస్తుంటా రు. అలాంటి కోడిగుడ్డు నేడు కొండె క్కింది. రిటైల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 నుంచి రూ.7.50గా ఉంది. తక్కువ ధరలో పోషకాలు లభించేది కోడిగుడ్డులోనే. కోడిగుడ్డు ధర భగ్గుమనడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో కోడిగుడ్ల ఉత్పత్తి కేవలం 3లక్షల లోపేఉంది. ప్రస్తుతం హోల్‌సేల్ వ్యాపారులు హైదరాబాద్ నుంచి జిల్లాకు 10లక్షల కోడిగుడ్లను దిగుమతి చేసుకుంటున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.5.25 నుంచి రూ.5.85గా ఉంది. మధ్యవర్తులు, రిటైల్ వ్యాపారులు మాత్రం గుడ్డును రూ.7 నుంచి రూ.7.50లకు విక్రయిస్తున్నారు.

కావలి
కందుకూరు
ఆంధ్రజ్యోతి
మంగళవారం,
15 జూలై 2025
www.andhrajyothy.com

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

25న సీపీఐ కావలి నియోజకవర్గ స్థాయి మహాసభ

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నియోజకవర్గ మహాసభ ఈనెల 25న స్థానిక పామూరు బస్టాండ్‌లోని లక్ష్మీశ్రీనివాస కళ్యాణ మండపంలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి.మాలకొండయ్య తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్ల పూర్తవుతున్న సమయంలో జరుగుతున్న ఈ మహాసభలకు ప్రాధాన్యత ఉందని కార్యకర్తలు, నాయకులే గాక సానుభూతిపరులు, యువత అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేసేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు నత్తా రామారావు, బి.సురేష్‌బాబు, వై.ఆనంద్‌మోహన్, ఎస్కే హుస్సేన్, మురళి, ద్రోణాదుల ఆదినారాయణ, ఎం.లక్ష్మీనారాయణ, బాలబ్రహ్మచారి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

దర్జాగా కలుజు కాలువ కబ్జా

● చెరువు ఆక్రమణలు పట్టని సాగునీటి సంఘం సభ్యులు, అధికారులు


కలుజు కాలువ మట్టితో పూడ్చిన చోట తోలిన వ్యర్థాలు

కావలి రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలంచర్ల గ్రామ చెరువు కలుజు కాలువ దర్జాగా కబ్జా చేస్తున్నా... గ్రామంలోనే ఉన్న ఇటు సాగునీటి సంఘం అధ్యక్షుడికి కానీ, సభ్యులకుకానీ, అటు ఇరిగేషన్ అధికారులకు కానీ పట్టడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. చెరువు విస్తీర్ణం సుమారు 350 ఎకరాలు కాగా, అందులో 50 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందన్నారు. చెరువు పారుదలతో అధికారికంగా సుమారు 350 ఎకరాలు, అనధికారికంగా 600 ఎకరాలు సాగవుతుంది. ఇక చెరువు నిండినప్పుడు కలుజు నీళ్ల పారే కాలువ మొత్తం అధికారపార్టీ నేతల సహకారంతోనే కబ్జాకు గురైంది. కబ్జాదారులు ముందుగా కాలువలో మట్టి తోలించి కాలువ స్థలం ఆక్రమించారు. అదే స్థలంలో ఇటీవల గ్రామంలో పైప్‌లైన్ల నిర్మాణం కోసం పగలగొట్టిన రోడ్డు కంకర వ్యర్థాలు కూడా అక్కడే తోలారని రైతులు విమర్శిస్తున్నారు. కాలువ ఆక్రమణతో చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, వారు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

వలేటివారిపాలెంలో అంధకారం!

● ఐదారు నెలలుగా వెలగని వీధిలైట్లు ● పట్టించుకోని పంచాయతీ పాలకులు, అధికారులు


మరమ్మతులకు గురైన వీధిలైటు

వలేటివారిపాలెం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో రాత్రుళ్లు అంధకారం నెలకొంటోంది. స్థానిక బీసీ కాలనీ, పెద్దబజార్, చిన్నపాలెం, మెయిన్‌బజార్, మంగళపాలెం, గాంధీనగర్, బ్యాంక్ బజార్‌లలో సుమారు ఐదారు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ఆయా కాలనీల్లోని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా మరికొన్ని చోట్ల కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. రాత్రి వేళ్లలో బయటకు వెళ్లాలంటే పాములు, తేళ్ల ఎక్కడ కాటు వేస్తాయోనని ప్రజలు బయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం డపాదడపా కురుస్తున్న వర్షాల వలన విషపురుగులు రాత్రి వేళ్లలో వీధుల్లోనే తిరుగుతున్నాయి. చీకటి పడితే వాటి నుంచి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. దీనికి తోడు చినుకు పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఏడాది నుంచి వెలగడం లేదు



మా వీధిలో ఏడాది నుంచి వీధిలైటు వెలగడం లేదు. రాత్రి సమయంలో వీధిలోకి రావాలంటేన భయమేస్తోంది. విషపురుగులు వీధుల్లోనే తిరుగుతున్నాయి. దీనికి తోడు ఆకతాయిలు ఆగడాలు పెచ్చరిల్లిపోతున్నాయి. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- కొంకా కృష్ణయ్య, బ్యాంక్‌బజారు, వలేటివారిపాలెం

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ధర్నా



విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

కావలి(టౌన్), జూలై 14(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఈఈకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ పెంచిన కరెంటు చార్జీలు తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రూ.16 వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపిందని ఆరోపించారు. పెంచిన కరెంటు చార్జీలు కట్టలేక బాధపడుతున్న ప్రజలకు స్మార్ట్ మీటర్ల బిగింపు మరింత ఆందోళనకు గురిచేస్తుందన్నారు. అదానీకి దోచిపెట్టేందుకే స్మార్ట్ మీటర్ల బిగింపు అని గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని చెప్పిన తెలుగుదేశం నేతలు ఇప్పుడేం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు వెళ్లి కానిస్టేబుల్ రక్తదానం

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుర్రంవారిపాలెంకు చెందిన ఓ వ్యక్తికి విజయవాడలోని రమేష్ ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్స కోసం అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకుని డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దాసరి వినోద్‌కుమార్, అతని మిత్రుడైన ఉప్పుచెరువు కాలనీకి చెందిన వెలిచర్ల నరసింహారావులు విజయవాడకు వెళ్లి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. బ్లడ్ డోనార్స్ వాట్సాప్ గ్రూపు సభ్యులుగా వీరు చూపించిన స్ఫూర్తిని పలువురు అభినందించారు. కానిస్టేబుల్ వినోద్‌కుమార్ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూ ప్రాణదాతగా నిలుస్తున్నారని ప్రశంసించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్


కరపత్రం అందజేసి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలని, అవి సక్రమంగా అందుతున్నాయా లేదా అని అధికారులతోపాటు నాయకులు పర్యవేక్షించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని పాతూరు ప్రాంతంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. పక్కా గృహాలు కావాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా వారి వివరాలు నమోదు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, కార్యదర్శి కాకు మహేష్, చీమల తాతయ్య, నిశ్శంకర సురేష్, ఊసా మాల్యాద్రి, కొప్పోలు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ


గణేష్ నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి, తదితరులు

కావలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): కలుగోళ్లశాంభవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న 9వ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆగస్టు 27వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వహకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

● పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పట్టణంలోని పలువురి ఉత్తర క్రియల్లో పాల్గొని ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోఆపరేటివ్ కాలనీలోని గోనుగుంట రఘు తల్లి భారతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బృందవనం హౌసింగ్ కాలనీలో వేమూరి పెద్దిశెట్టి సతీమణి ప్రమీల చిత్రపటం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేత గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, నాయకులు తిరువీధి ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కాలువలో పూడికతీత


ప్రధాన కాలువలో పూడికతీస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31, 38వ వార్డులకు సంబంధించిన ప్రధాన డ్రైనేజీ పూడిపోయి మురుగు నీటితోపాటు వర్షపునీరు పారుదలకు ఆటంకం కలుగుతోంది. కాలువ పక్కన ముస్లిం శ్మశానవాటిక కూడా ఉండటంతో వర్షాకాలం నీరు ఆ ప్రాంతంలో రోడ్డు ఎక్కి పారుతూ ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వెంటనే పూడికతీయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు సోమవారం గ్యాంగ్ వర్క్ పెట్టి కాలువలో ఎప్పటి నుంచో పేరుకుపోయి ఉన్న చెత్తా చెదారాన్ని పూడిక మట్టిని తొలగించి నీటి పారుదలకు ఉన్న ఆటంకం తొలగింపచేశారు. ఈ పనులను ఆయా వార్డుల టీడీపీ నాయకులు మంచాల ప్రసాద్, తలపనేని ప్రభాకర్, దశరథరామయ్య, బెజవాడ రవీంద్ర, భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు.

మొక్కుబడిగా 'పీజీఆర్ఎస్'


కొండాపురం : అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు కోటేశ్వరరావు

కొండాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మొక్కుబడిగా జరిగింది. కేవలం రెండు వినతులు వచ్చాయి. అందులో మండలంలోని గొట్టిగుండాలలో పొలాలకు వెళ్లే రోడ్డును సర్వే చేయాలని, భీమవరప్పాడులో సర్వే నెంబరు 151లో ఎద్దుల బీడు హద్దులు తేల్చాలని కోరుతూ వినతులు అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో ఐదు అర్జీలు

బిట్రగుంట : బోగోలు మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు సానా శ్రీనివా సరెడ్డి తెలిపారు. బోగోలులో ఇంటి స్థలం హద్దులు చూపించాలని ఒకటి, కోర్టు పరిధిలో ఉండే పొలం వివాదాలకు సంబంధించిన రెండు అర్జీలు, స్థలం ఆక్రమించుకున్నారని, పొలానికి సంబంధించి ఆధార్ లింకు చేయాలని కోరుతు వినతులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయమ్మ, ఎంఏవో శైలజ, హౌసింగ్ ఏఈ, అంగన్వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు నలుగురు అధికారుల హాజరు

ఉలవపాడు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మండలంలోని నలుగురు అధికారులు హాజరయ్యారు. తహసీల్దారు శ్రీనివాసులు సెలవులో ఉండగా, డీటీ హనుమమ్య ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సులో పాల్గొన్నారు. దీంతో ఐసీడీఎస్‌కు చెందిన ఇద్దరు అధికారులు, వెలుగు, వ్యవసాయ శాఖకు చెందిన ఇద్దరు అధికారులు హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. అధికారులు ఎవరు లేకపోవడంతో రెండు ఫిర్యాదులు మాత్రమే అందాయి.

తప్పులు లేని ఓటర్ల బాబితా బీఎల్‌వోల బాధ్యత

● కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ


బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): తప్పులు తడకలు లేని ఓటర్ల జాబితా రూపొందించటంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆ జాబితాలో స్థానం దక్కేలా కృషి చేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓల దేనని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ పేర్కొన్నారు. కందుకూరు రూరల్ మండల పరిధిలోని 37మంది బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ)లకు సోమవారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాల రూపకల్పనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్‌గా బీకృష్ణవేణి వ్యవహరించగా తహసీల్దారు వి. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో న్యాయాధికారులు, న్యాయవాదులు

కావలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ మండల న్యాయసేవాధికారసంస్థ, కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో న్యాయాధికారులు, న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర లీగల్‌సెల్ అథారిటీ ఆదేశాల మేరకు ప్లకార్డులు, బ్యానర్లతో కోర్టు ప్రాంగణం నుంచి స్థానిక ఉదయగిరి బ్రిడ్జి కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. కోర్టులో పేరుకు పోతున్న కేసులను మధ్యవర్తుల ద్వారా రెండు పార్టీలు ఒక నిర్ణయానికి వచ్చి సత్వరపరిష్కారం చేసుకునే విధంగా అవగాహన కల్పించటమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. ఈ అవగాహన ర్యాలీలో సబ్ న్యాయాధికారి గీతావాణి, జూనియర్ సివిల్ న్యాయాధికారి సుధాకర్, జ్యుడిషయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విక్రమసింహ, స్పెషల్ న్యాయాధికారి పరుశురాం, కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా చెత్తతో సంపద

తయారీ కేంద్రాలు!

● ప్రారంభానికి నోచుకోకనే శిథిలావస్థకు ● పలు పంచాయతీల్లో కప్పులేని పిల్లర్లు
● తుప్పు పడుతున్న రిక్షాలు ● నిరుపయోగంగా వర్మీకంపోస్టు పిట్లు


వీఆర్ కోటలో పైకప్పు లేచిపోయి దర్శనమిస్తున్న పిల్లర్లు

లింగసముద్రం, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రత, సంపద సృష్టిని దృష్టిలో పెట్టుకుని 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గ్రామాల్లోని తడి, పొడి చెత్తను చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు తరలించి, అక్కడ వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. అంతేకాకుండా గ్రామాల్లోని చెత్తను తరలించి గ్రామాలను చెత్త రహితంగా, పరిశుభ్రంగా మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ మండలంలోని 16 గ్రామ పంచాయతీలకుగాను వీఆర్ కోట, విశ్వనాథపురం, అన్నెబోయినపల్లి, లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల్లో 2014-19లో పిల్లర్లు ఏర్పాటు చేసి తాటాకులతో చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. మొగిలిచెర్ల గ్రామంలో ఈ కేంద్రాన్ని అసలు నిర్మించలేదు. మిగిలిన 10 గ్రామ పంచాయతీలలో రేకులతో కేంద్రాలను నిర్మించారు. ఈ 10 పంచాయతీలలో తడి పొడి చెత్తను రిక్షాల ద్వారా తరలించి, వర్మీకంపోస్టు ఎరువు తయారీ ప్రక్రియ జరుగుతోంది. అయితే తాటాకులతో నిర్మించిన 5 కేంద్రాల పైకప్పులు గాలులకు లేచిపోయి, పిల్లరు మాత్రమే నిలిచి ఉన్నాయి. దీంతో మండలంలోని 6 కేంద్రాలలో చెత్త తరలింపు రిక్షాలు, వర్మీకంపోస్టు పిట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభం కాకనే శిథిలావస్థకు చేరుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో చెత్త నిల్వలు ఉండడంతో ఇవి దోమలకు ఆవాసాలుగా మారాయి. అంతేగాకుండా ఆయా గ్రామాలలో నియమించిన క్లాప్‌మిత్రలకు పెద్దగా పని ఉండడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ఈ చెత్త తరలింపుకు పంపిణీ చేసిన రిక్షాలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, గ్రామాలలో తుప్పుపట్టి పోతున్నాయి. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే ఐదారు నెలల క్రితం ఈ కేంద్రాలను పరిశీలించిన అధికారులు, వాటి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


లింగసముద్రంలో నిరుపయోగంగా ఉన్న వర్మీకంపోస్టు పిట్లు


జంపాలవారిపాలెంలో చెత్తకుప్పల్లో తుప్పుపడుతున్న రిక్షా

జాతీయ రహదారిపై బారికేడ్ల ఏర్పాటు

జలదంకి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు జలదంకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్ 167బిజి రహదారిపై 9వ మైలు వద్ద సోమవారం ఎస్ఐ లతీఫున్నీసా బారికేడ్లు ఏర్పాటు చేయించారు. కావలి నుంచి ఉదయగిరికి రాకపోకలు సాగించే వాహనాలు ఈ కూడలి ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. వేగంగా వచ్చే వాహనాలతో తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రమాద నివారణ చర్యలు చేపట్టామన్నారు. వాహనచోదకులు ముఖ్యమైన కూడలి ప్రాంతాల్లో వేగం తగ్గించి వాహనాలను నడపాలని కోరారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ

గుడ్లదొన చెరువుకు సోమశిల జలాలు సరఫరా చేయాలి


నెల్లూరులో సోమశిల ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న గుడ్లదొన రైతులు, ప్రాజెక్టు వైస్‌చైర్మన్ మధుమోహన్‌రెడ్డి

కలిగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్లదొన చెరువుకి కావలి కాలువ నుంచి సోమశిల జలాలు సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సోమశిల ఎస్ఈ రమణారెడ్డికి సోమవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో సోమశిల ప్రాజెక్టు వైస్‌చైర్మన్ పులుగుంట మధుమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడ్లదొన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గతంలో ఎత్తిపోతల పథకం ద్వారా నీరు చెరువుకి అందేదని, ప్రస్తుతం ఆ పథకం కింద ఏర్పాటు చేసిన సామగ్రి పనికిరాకుండా శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ విషయమై నిధులు మంజూరు చేసి ఎత్తిపోతల పథకాన్ని వాడుకలోకి తీసుకువచ్చి చెరువుకు నీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాలపనేని వెంకటరమణయ్య, పట్నం వెంకటేశ్వర్లు, బొట్టా రాధాకృష్ణయ్య, దేవరపల్లి దశరథరామిరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై మనుబోలు వద్ద వెళుతున్న భారీ గ్యాస్ ట్యాంకర్

వామ్మో.. ఎంత పే...ద్దదో!

ఈ చిత్రంలో కనిపి స్తున్న భారీ ట్యాంకర్‌ను ఇంతకు మునుపెన్నడూ బహుశా చూసి ఉండరేమో! ఈ ట్యాంకర్‌ను నడపడానికి డ్రైవర్ చాలా సహనం అవసరం. వేగంగా వెళితే చాలా డేంజర్. అందుకే.. పాపం.. పెళ్లి నడకలా.. అడుగులో అడుగేసుకుంటూ తరలిస్తు న్నారు. రోజుకు 10 నుంచి 15 కి.మీ దూరం మాత్రమే వెళ తుంది. దుబాయ్‌లోని కటార్‌కు ఈ భారీ గ్యాస్ ట్యాంకర్‌ను తీసుకెళ్ళాల్సి ఉంది. తడ శ్రీసిటీలో బీఎస్ఆర్ఎస్ లాజిస్టిక్స్ కంపెనీ దీనిని తయారు చేసింది. చెన్నైకి చెందిన ఆర్‌కేబీ ట్రాన్స్‌పోర్ట్ అండ్ క్రేన్స్ రవాణా చేస్తోంది. ఈ ట్యాంకర్ బరువు 200 టన్నులు. అంటే రెండు లక్షల కిలోలన్నమాట. రెండు ట్రాలీలపై (202 చక్రాలతో) ఇది నడుస్తోంది. రహదారిపై గుంతలు, విద్యుత్ తీగలు, ఇతర వాహనాలను తప్పించేందుకు నిత్యం ఈ ట్యాంకర్ చుట్టూ 20 మంది రక్షణ వలయంలా ఉండాల్సిందే. ఈనెల 7న శ్రీసిటీలో బయలుదేరిన ఈ ట్యాంకర్ వారం రోజులకు మనుబోలు వద్దకు చేరుకుంది. దీనిని నిదానంగా కృష్ణపట్నం పోర్టుకు తరలించి, అక్కడినుంచి దుబాయ్‌నౌక వద్దకు చేర్చాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా జాతీయరహదారిపై పెద్ద ప్రమాదం జరగవచ్చు. అందుకే ఇటు పోలీసులు, అటు విద్యుత్ సిబ్బంది రోడ్డుకు అడ్డుగా తీగలు వచ్చినప్పుడల్లా విద్యుత్ సరఫరా నిలిపివేసి దాటిస్తున్నారు. ఈ వాహనాన్ని తిలకించిన ప్రయాణీకులు 'వామ్మో.. ఎంత పే..ద్ద ట్యాంకరో..!' అంటూ నోరెళ్ళబెడుతున్నారు. కొంతమంది తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. సెల్ఫీలు కూడా దిగడం విశేషం.

- మనుబోలు (ఆంధ్రజ్యోతి)

నేత్ర పర్వంగా వసంతోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 14 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం ద్రౌపదీ దేవి, పాండవులకు విశేష అలంకారంతో మాడవీధుల్లో వసంతోత్సవం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో జానకి ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

కాగా, నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పూజలు కొనసాగుతున్నాయి. నాలుగు పూటల షిరిడీ హారతులతోపాటు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర నామ పూజలు జరిగాయి. మందిరం కమిటీ చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.



బంగారు కుటుంబాలను ప్రోత్సహించాలి

● కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు(హరనాథపురం), జూలై 14(ఆంధ్రజ్యోతి): పీ-4లో కేవలం ఆర్థిక అంశాలు మాత్రమే కాకుండా బంగారు కుటుంబాలను ప్రోత్సాహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తిక్కన భవన్‌లో పీ-4పై సోమవారం అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం వారు కనీసం 500 మందిని, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌అండ్‌బీ, ఏపీఎస్‌పీ డీసీఎల్, పరిశ్రమలశాఖ, జిల్లా విద్యాశాఖ తదితరశాల అధికారులు వారివారి పరిధిలో కనీసం రెండువేలమందికి పైబడి మార్గదర్శకులను గుర్తించాలన్నారు. నాలుగైదు రోజుల్లో ఈ పనిపూర్తి చేయాలని ఆదేశించారు. అన్నిశాఖలు పీ-4 విధానంపై దృష్టి సారించాలన్నారు. అవసరమైన చోట స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని కోరారు.

● ఎరుకల కులవృత్తుల వారికి 90శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలి

● పీజీఆర్ఎస్‌లో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని ఎస్పీ జీ. కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా వ్యాప్తంగా 118 మంది ఫిర్యాదుదారులు తరలివచ్చి వారి సమస్యలు ఎస్పీకి తెలియజేశారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో మోసగాళ్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ ఎస్పీని కోరారు. నగరంలో ఎన్నోఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎంతో హుందాగా జరుగుతుందని, అయితే కొంతమంది మోసగాళ్లు, చీడపురుగులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్రవేశించి ప్రజలను నిట్టనిలువునా మోసం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

పల్లె ఫేస్ మారేనా?

● గ్రామాలకు త్రీఫేస్ కరెంటు ఎప్పటికో!
● నిరంతరాయ సరఫరాకు ఆర్‌డీఎస్ఎస్
● రెండేళ్లుగా నత్తనడకన పనులు
● రాష్ట్ర ప్రభుత్వ ఫోకస్‌తో వేగవంతం

నెల్లూరు (జడ్పీ), జూలై 13 (ఆంధ్రజ్యోతి): పల్లెలకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి నిర్దేశించిన పథకం పనులు రెండేళ్లుగా సా....గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఇటు గృహాలకు, అటు వ్యవసాయానికి సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్లే ఉన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా వ్యవసాయానికి ఇచ్చే 9 గంటల విద్యుత్ సరఫరా సమయంలో లైన్లను మార్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమస్యను పరిష్కరించి నగరాలు. పట్టణాల్లో వలే పల్లెల్లోనూ గృహాలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలన్న ఆలోచనతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంపిణీ రంగ పునరుద్ధరణ పథకం (ఆర్‌డీ ఎస్ఎస్) ద్వారా గ్రామాల్లో త్రీఫేస్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాయి.

● రూ.400 కోట్లతో పనులు

జిల్లాలో రూ.400కోట్లతో త్రీఫేస్ పనులను 2022 సెప్టెంబరులో ప్రారం భించారు. గ్రామాల్లో వ్యవసాయ ఫీడర్లను, గృహాలకు ఇచ్చే ఫీడర్లను వేరు చేసి, గృహాలకు త్రీఫేస్ ద్వారా 24గంటలు సరఫరా అందించే విధంగా ఈ పథకానికి రూపకల్పన చేశారు. జిల్లాలోని గ్రామాల్లో 336 ఫీడర్ల పరిధిలో ఈ పథకం ద్వారా 2821 కి.మీ. 11 కేవీ లైను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1400 కి.మీ. వరకు లైను వేశారు. అలాగే ఎల్‌టీ 5 వైర్ల లైన్లు 1117కి.మీ వేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 200 కి.మీ వేయగలి గారు. ఇక, ఎల్‌టీ 3 వైర్ల లైన్లు 771కి.మీ ఏర్పాటు చేయాల్సి ఉండగా 100కి.మీ మాత్రమే వేశారు. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 1050 ఏర్పాటు చేయాల్సి ఉండగా 156 మాత్రమే ఏర్పాటు చేశారు. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 1529 ఏర్పాటు చేయాల్సి ఉండగా 210 మాత్రమే అమర్చారు. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 1324 అమర్చాల్సి ఉండగా 149 మాత్రమే బిగించారు. ఇవికాక విద్యుత్ స్తంభాలు కూడా పెద్దఎత్తున వేయాల్సి ఉంది. అయితే పనులు నత్తనడకన సాగడంతో గ్రామీణుల్లో అసంతృప్తి నెలకొంది. మరో వైపు, మండుతున్న ఎండలకు పల్లెల్లోనూ ఏసీల వినియోగం అధికమైంది. కానీ, సింగిల్ ఫేస్ కరెంటుతో తగినంత విద్యుత్ సరఫరా లేక పల్లెల్లో ఏసీలు పనిచేయడం లేదు. ఈ క్రమంలో త్రీఫేస్ పనులు త్వరగా పూర్తవుతాయని, తమకు కూడా పట్టణ, నగరవాసుల్లాగా విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావించిన పల్లెవాసులకు నిరాశే మిగిలింది.



కోవూరు మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన త్రీఫేస్ విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్

● రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

గత రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ల పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించి ఇటీవల సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో ఆర్‌డీఎస్ఎస్ పథకం పనులు పుంజుకోనున్నాయి.

మార్చికల్లా పూర్తిచేసేలా చర్యలు

జిల్లాలో జరుగుతున్న త్రీఫేస్ విద్యుత్‌లైన్ల పనులను మరింత వేగ వంతం చేశాం. వచ్చే ఏడాది మార్చికల్లా పనులను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అనుగుణంగా శరవేగంగా పనులు చేయిం చేలా చర్యలు తీసుకుంటున్నాం.

- పరంధామయ్య, ఈఈ

జిల్లాకు 1,850 మెట్రిక్ టన్నుల యూరియా

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



పడుగుపాడు రైల్వే స్టేషన్‌లో యూరియా దిగుమతిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

కోవూరు, జూలై14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరఫరా చేసేందుకు పడుగుపాడు రైల్వేస్టేషన్‌కు 1850 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి తెలిపారు. పడుగుపాడు రైల్వేస్టేషన్ నుంచి దిగుమతి చేస్తున్న యూరియాను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ సంస్థ, రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయసహకార పరపతి సంఘాల ద్వారా 1000 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల ద్వారా 850 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలకు 47,588 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటికే 32714 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. జిల్లాలో 1,50,000 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నట్లు వివరించారు. కోవూరు, నెల్లూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో వరిపైరు చిరుపొట్ట దశకు చేరుకుందన్నారు. కావలి, పొదలకూరు, ఆత్మకూరు డివిజన్లలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. ఎకరాకు 4 నుంచి 5 బస్తాల యూరియా వాడుతున్నందు వల్ల తెగళ్లు, పురుగులు ప్రబలే అవకాశముందన్నారు. సాగు ఖర్చు అధికమౌతుందని చెప్పారు. సూక్ష్మ పోషకాల లోపం వల్ల దిగుబడులు తగ్గే అవకాశముందన్నారు. ఆమె వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత ఉన్నారు.

19న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు(విద్య), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఈనెల 19వ తేదీన అండర్-11, 13, 15, 17, 19 సింగిల్స్ డబుల్స్, మెన్, ఉమెన్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో ఈనెల 17లోగా స్టేడియంలో వారి పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఆలయాల భూముల కౌలు వేలం

కొండాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): కొండాపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, రేణుమాలలోని కోదండ రామస్వామి ఆలయాలకు చెందిన భూమలను ఏడాదిపాటు కౌలుకు కేటాయించేందుక సోమవారం దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈవో శాంతయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం కార్యక్రమంలో రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 26.70 ఎకరాల భూమిని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది రైతులు రూ.1.15 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అలాగే రేణుమాల ఆలయానికి సంబంధించిన 45.27 సెంట్ల భూమిని 5 మంది రైతులు రూ.2.88 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, అధికారులు పాల్గొన్నారు.



వేలంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బౌద్ధ భిక్షువులు ఆశ్రమాల సందర్శన

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆశ్రమాలను సోమవారం విదేశీ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ధర్మాచరణ తగ్గుతోందని, ఆరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. ఇందుకు విరుగుడుగా ప్రజలంతా మౌనం, ధ్యానం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీలంక నుంచి కోవానే పాలితథెరో, జపాన్ నుంచి షిమాడా, భారత్‌కు చెందిన బోధి హీస్‌లు జిల్లాలోని పలు ఆశ్రమాలను సందర్శించారు. అనంతరం వారు ఇందు కూరుపేట మండలం కొత్తూరులోని భర ద్వాజ దత్త పీఠాన్ని సందర్శించి, పీఠం నిర్వాహకులు మహేష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి పొగతోటలోని ఆదిశంకరా ధ్యాన మందిరాన్ని సందర్శించారు. పొదలకూరురోడ్డు కొత్తూరు భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమానికి చేరుకున్నారు. . ఆవరణంలో బిల్వ, రావి మొక్కల ను నాటారు. ఈ కార్యక్రమాలలో పర్వతస్వామి, జగదీశ్వర, చంద్రశర్మ, మణిశంకర్, సునీల్‌కుమార్, ప్రవీణ్ కుమార్, నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధ భిక్షువులతో మాట్లాడుతున్న మహేష్ స్వామి

నేడు అవగాహన సదస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ సమస్యల పరిష్కారంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులంతా పాల్గొనాలని కోరారు.

ప్రాణం తీసిన వేగం

● చెట్టును ఢీకొన్న కారు
● యజమాని మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు



చెట్టును ఢీకొన్న కారును పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

గుడ్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి) : అతి వేగం ఒకరి ప్రాణం తీసింది. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గుడ్లూరు-తెట్టు మార్గంలో పోట్లూరు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దప్పళంపాడుకు చెందిన తూమాటి లక్ష్మయ్య(48) తన కారులో అదే గ్రామానికి చెందిన డ్రైవర్ చెరుకూరి మాధవతో కలసి ఆదివారం రాత్రి కావలికి బయలుదేరారు. మార్గమధ్యంలో పోట్లూరు వద్ద వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చుని ఉన్న కారు యజమాని లక్ష్మయ్యతోపాటు డ్రైవర్ మాధవకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున లక్ష్మయ్య మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. కాగా డ్రైవర్ మాధవను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదం సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకట్రావు సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. మృతుడు లక్ష్మ య్య బంధువు తూమాటి మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాల కోసం ధర్నా

నెల్లూరు(హరనాథపురం), జూలై 14(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా పేదలకు రుణాలు ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ కార్పొరేషన్‌లు ప్రజలకు రుణాలు ఇవ్వకపోవటం తగదన్నారు. దీంతో వారు తండలకు, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుకు డబ్బులు తీసుకుని తీవ్రంగా నష్టపోతున్నారని, తిరిగి కట్టలేక పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో కే. శ్రీనివాసులు, బిల్ల మస్తానయ్య, జెడ్డా వాసు, రాజేశ్వరమ్మ, ఆర్. శ్రీనివాసులు, జే. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కరేడులో భూసేకరణ విరమించుకోవాలి

● సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వామపక్షాల నేతలు, గిరిజన రైతుల ధర్నా

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏడాదికి మూడు పంటలు పండుతూ పచ్చగా కళకళలాడే కరేడులో ఇండోసోల్ కంపెనీ కోసం భూసేకరణ చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణం విరమించుకోవాలని, భూసేకరణ ప్రకటన రద్దు చేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిరిజన రైతులతో కలసి స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ పార్టీల నాయకులు మాట్లాడుతూ మా ప్రాణాలైనా ఇస్తాం.. భూములు ఇవ్వమని గ్రామంలోని ప్రజలంతా ముక్తకంఠంతో అధికారుల సమక్షంలో చెప్పడమే గాక భూములు ఇవ్వబోమని ఏకగ్రీవంగా గ్రామసభ తీర్మానం కూడా చేశారన్నారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రజా వ్యతిరేకతను గుర్తించకుండా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లాలని ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటనను, అవాంఛనీయ పరిణామాలను ఎదుర్కోవల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులకు మద్దతుగా కమ్యూనిస్టు పార్టీలు ఎంతదూరమైనా పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించకపోతే వారు తగినబుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల మనోభావాలను, గ్రామసభ తీర్మానాన్ని ప్రభుత్వానికి తెలియజేశామని, ప్రభుత్వంలో చర్చించిన అనంతరం ఆ విషయాలను ప్రజలకు తెలియజేస్తామని, ప్రజాసంఘాల నాయకులతో కూడా ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసి ప్రభుత్వ ఉద్దేశ్యాలను వివరించటం జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో ఆయా పార్టీల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పీ.మాలకొండయ్య, జీవీబీ కుమార్, బీ.సురేష్‌బాబు, ఆర్.మోహన్, హుస్సేన్, ఆనంద్‌మోహన్, కే.నాంచార్లు, దువ్వూరి జాన్, కత్తి సుజాత, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు, కరేడు గిరిజన రైతులు

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి

● యువకుడి వీపుపై తీవ్ర గాయాలు ● కౌలు డబ్బుల విషయంలో ఇరువురి మధ్య వివాదం

లింగసముద్రం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కౌలు డబ్బులు విషయమై ఏర్పడిన వివాదం ఇరువురి మధ్య కక్షలకు దారితీసింది. ఈ క్రమంలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసి వీపుపై నరికిన ఘటన మండలంలోని మొగిలిచెర్లలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చుండూరు పోతులూరయ్యకు చెందిన సాగు భూమిని గత ఏడాది అదే గ్రామానికి చెందిన గోరంట్ల రాజేష్ అనే యువకుడు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. అయితే మిరప పంట సరైన దిగుబడులు రాక నష్టాలు వచ్చాయి. దీంతో రాజేష్ భూమి యజమాని పోతులూరయ్యకు సరిగా కౌలు చెల్లించలేదు. ఈ విషయమై ఇరువురి మధ్య తరచూ వివాదం జరుగుతోంది. అయితే ఈ ఏడాది కూడా పొలాన్ని తనకు కౌలుకు ఇవ్వాలని రాజేష్ అతనిని కోరడంతో ఆయన నిరాకరించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న రాజేష్ 15 రోజుల క్రితం పోతులూరయ్యపై గ్రామంలోని బస్టాండ్ సెంటరులో మరో వ్యక్తితో కలిసి దాడి చేసి కొట్టాడు. దీంతో కక్ష పెంచుకున్న ఆయన సోమవారం మద్యం సేవించి రాజేష్ ఇంటి వద్దకే వెళ్లి కత్తితో వీపుపై నరికాడు. అతను పెద్దగా కేకలు వేయడంతో ఇంటి పక్కనే ఉన్న కొందరు వచ్చి పోతులూరయ్యను అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను చికిత్స నిమిత్తం బంధువులు కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



దాడిలో రాజేష్ వీపుపై అయిన తీవ్ర రక్త గాయాలు

యువకుడిపై దాడి.. కేసు నమోదు

లింగసముద్రం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపాలెంకు చెందిన బొమ్మల రాజేష్ అనే యువకుడిపై ఇటీవల గుర్తుతెలియని యువకులు దారికాచి దాడి చేసిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.నారాయణ తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన రాజేష్ కందుకూరు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ అక్కడి అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడి నుంచి వచ్చిన స్టేట్‌మెంటు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.